www.manatelangana.news

Mana Telangana

మన తెలంగాణ

హైదరాబాద్ | సంపుటి 6 | సంచిక: 195 | గురువారం | 4 జనవరి, 2018

...అక్షరం సాక్షిగా ఇది ప్రజల పక్షం

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

పేజీలు: 12 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00

ట్రిపుల్ తలాక్!

• రాజ్యసభలో బిల్లు ప్రవేశం, రభస • సెలెక్ట్ కమిటీకి పంపించాలంటూ ప్రతిపక్షం తీర్మానం ప్రతిపాదన

• తీవ్ర వాగ్వాదం, గందరగోళం మధ్య రూలింగ్ ఇవ్వకుండానే సభ నేటికి వాయిదా





న్యూఢిల్లీ: ఏకబిగిన మూడుసార్లు తలాక్ చెప్పి భార్యకు విడాకులివ్వడాన్ని నేరంగా పరిగణించే ముస్లిం మహిళల (వివాహ హక్కుల రక్షణ) బిల్లు – 2017ను బుధవారం విపక్షాల గందరగోళంలో న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ రాజ్యసభలో ప్రవేశపెట్టారు. చట్టవ్యతిరేకమైన ఈ ఆచారాన్ని అరికట్టేందుకు బిల్లును వేగంగా ఆమోదించాలని బిజెపి సభ్యులు వాదించగా, ట్రిపుల్ తలాక్ బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపాలని విపక్షాలు పట్టుబట్టాయి. దీంతో అధికార, విపక్ష సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. మహారాష్ట్ర కుల హింసపై మూడుసార్లు సభ వాయిదా పడి మధ్యాహ్నం 3 గంటలకు తిరిగి సమావేశమైంది. ఏకబిగిన మూడుసార్లు తలాక్ చెప్పి విడాకులివ్వడాన్ని చట్ట వ్యతిరేకంగా, శిక్షార్హంగా పరిగణించి అది చెప్పిన భర్తకు కనీసం మూడేళ్ల జైలు శిక్ష విధించేందుకు ప్రతిపాదించిన ఈ బిల్లుపై ఉభయపక్షాలు వాదోపవాదాలకు దిగాయి. ట్రిపుల్ తలాక్ బిల్లుకు తాము వ్యతిరేకం కాదని కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ స్పష్టం చేస్తూనే దాన్ని లోపరహితం చేసి మరింత బలోపేతం చేసేందుకు, లోతుగా పరిశీలించేందుకు సెలెక్ట్ కమిటీకి పంపాలని డిమాండ్ చేశాయి. లోక్‌సభ ఈ బిల్లును ఇప్పటికే డిసెంబర్ 28న ఆమోదించింది. ట్రిపుల్ తలాక్ రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు కూడా తీర్పు చెప్పినందున బిల్లును సత్వరం ఆమోదించడం మంచిదని ప్రభుత్వం నొక్కి చెప్పింది. అయితే ఈ బిల్లు విషయంలో వివిధ వర్గాల భాగస్వాముల అభిప్రాయాలను కూడా లెక్కలోకి తీసుకోవలసి ఉందని విపక్షాలు పట్టుబట్టాయి. సభలో తీవ్ర వాదోపవాదాలు, గందరగోళం ఏర్పడ్డం, ఎన్నిసార్లు హెచ్చరించినా సభ సాధారణ స్థితికి రాకపోవడంతో సెలెక్ట్ కమిటీకి పంపాలన్న విపక్షాల తీర్మానంపై ఎలాంటి రూలింగ్ ఇవ్వకుండానే రాజ్యసభ చైర్మన్ పి.జె.కురియన్ సభను గురువారానికి వాయిదా వేశారు. 'ట్రిపుల్ తలాక్‌ను సుప్రీం కోర్టు రాజ్యాంగ విరుద్ధంగా పేర్కొంది. లోక్‌సభ డిసెంబర్ 28న ఆమోదించిన ఆ బిల్లు 'చరిత్రాత్మక బిల్లు'. పార్లమెంటులో దీనిపై చట్టాన్ని చేసి తీసుకురావాలని న్యాయమూర్తులు సూచించారు. సుప్రీంకోర్టు నివారించినా, లోక్‌సభ ఆమోదించినప్పటికీ ఈ ఆచారాన్ని ఇంకా ఆచరిస్తూనే ఉన్నారు' అని అంతకు ముందు మంత్రి రవిశంకర్ ప్రసాద్ అన్నారు. ఈ బిల్లును లోక్‌సభలో కాంగ్రెస్ కూడా ఆమోదించిందని పేర్కొన్నారు. ఏది ఎలా ఉన్నప్పటికీ ఈ ట్రిపుల్ తలాక్ బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపించాల్సిందేనంటూ విపక్షాలు మొండిపట్టుబట్టాయి. కాంగ్రెస్ డిప్యూటీ నాయకుడు ఆనంద్ శర్మ ఈ మేరకు తీర్మానం చేశారు. ఈ తీర్మానాన్ని కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ, తృణమూల్ కాంగ్రెస్, ఎఐఎడిఎంకె, బిఎస్‌పి, డిఎంకె, ఎన్‌సిపి, సిపిఐ, సిపిఐ(ఎం), టిడిపి, ఆర్‌జెడి, బిజెడి, జెఎంఎం, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్, నామినేటెడ్ సభ్యుడు కెటిఎస్ తులసి ప్రతిపాదించారు. అయితే సెలెక్ట్ కమిటీకి బిల్లును సమర్పించాలని శర్మ పెట్టిన తీర్మానం 'చెల్లదు' అని అధికారపక్ష సభా నాయకుడు అరుణ్ జైట్లీ చెప్పారు. శర్మ అనుసరించిన విధానానికి కూడా అభ్యంతరం చెప్పారు. రాజ్యసభ నుంచి బిల్లు రానందున, శర్మ పేర్కొన్న నియమం 70 (ఉపనియమం 2ఎ) ఈ బిల్లుకు వర్తించదని జైట్లీ చెప్పారు. బిల్లును

తరువాయి 6లో

మహారాష్ట్ర ఘర్షణలపై దద్దరిల్లిన సభ

హింస వెనుక ఆర్‌ఎస్‌ఎస్ హస్తం ఉందని ఆరోపిస్తూ చర్చకు పట్టుబట్టిన విపక్షాలు

రాజ్యసభ పలుమార్లు వాయిదా 10

దళితుల అంశాలపై మోడీ మౌని బాబా

మల్లికార్జున ఖర్గే 10



మైనారిటీ కమిషన్ చైర్మన్‌గా కమ్రుద్దీన్



మన తెలంగాణ / హైదరాబాద్: తెలంగాణ మైనారిటీ కమిషన్‌ను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ రాష్ట్ర మైనారిటీ కమిషన్ చట్టం (1998) ప్రకారం ఈ కమిషన్‌ను ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. చైర్మన్‌గా మహమ్మద్ కమ్రుద్దీన్‌ను, ఉపాధ్యక్షుడిగా రాజారపు ప్రతాప్‌లతో పాటు ఐదుగురు సభ్యులను కూడా నియమించింది. వీరందరి పదవీ కాలం బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి మూడేళ్లు ఉంటుందని మైనారిటీ సంక్షేమ విభాగం కార్యదర్శి సయ్యద్ ఒమర్ జలీల్ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మహమ్మద్ అర్షద్ ఆలీఖాన్, డాక్టర్ విద్యాస్రవంతి, గుస్తీ నోరియా, బొమ్మల్ల కట్టయ్య, సురేందర్‌సింగ్ సాధారణ సభ్యులుగా ఉంటారు.



విభజనపై హైకోర్టు ఫుల్ బెంచ్ భేటీ

• కళ్యాణ్ జ్యోత్‌సేన్ గుప్తా ఉత్తర్వుల ప్రస్తావన?


మన తెలంగాణ / హైదరాబాద్ : ఉమ్మడి హైకోర్టు విభజన దిశగా అడుగులు పడుతున్నాయి. విభజన అంశంపై ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేష్ రంగనాథన్ అధ్యక్షతన ఫుల్ బెంచ్ బుధవారం సాయంత్రం సమావేశమైంది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నుంచి అందిన లేఖలోని అంశాలపైనా, రెండు రాష్ట్రాలకు వేర్వేరు హైకోర్టులపై కేంద్ర న్యాయశాఖ మంత్రి ఇటీవల ఇచ్చిన ప్రకటనపైనా గంటకు పైగా ఈ సమావేశంలో చర్చ జరిగినట్లు విశ్వసనీయంగా తెలిసింది. అన్ని వసతులు ఉంటేనే ఆ రాష్ట్రంలో హైకోర్టును ఏర్పాటు చేయాలని పలువురు న్యాయమూర్తులు వారి అభిప్రాయాన్ని వ్యక్తం చేసినట్లు తెలిసింది. భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనందున ఓటింగ్ కూడా నిర్వహించినట్లు సమాచారం. గతంలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసిన కళ్యాణ్‌జ్యోత్‌సేన్ గుప్తా ఈ అంశంపై ఇచ్చిన ఉత్తర్వులను ఈ సందర్భంగా పరిగణనలోకి

తరువాయి 6లో

విజయవాడ బుక్ ఫెయిర్‌లో రచయిత

స్త్రైబాబాపై దుండగుల దాడి

11





నాది పనిచేసే అణు మీట

మీకంటే శక్తివంతమైనది : ట్రంప్

వాషింగ్టన్: 'అణ్వాయుధ బటన్ నా టేబుల్‌పైనే ఉంటుంది' అని ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ చేసిన వ్యాఖ్యలకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దీటైన జవాబిస్తూ 'నా అణు బటన్ కిమ్ కంటే శక్తిమంతమైనదే కాదు, అది పనిచేస్తుంది కూడా' అన్నారు. సంవత్సరాది సందర్భంగా కిమ్ జాతినుద్దేశించి చేసిన టివి ప్రసంగంలో ఉత్తర కొరియా అణ్వాయుధాలు అమెరికాలోని ఏ ప్రదేశాన్నైనా తాకగలవని హెచ్చరించారు. అమెరికాను అంతమొందించే అణ్వాయుధాలు తమకున్నట్లు చెప్పుకున్నారు. అయితే అమెరికా వైట్ హౌస్ 'ప్రపంచానికి ఉత్తర కొరియా ముప్పని, ఇతర దేశాలు కూడా ఉత్తర కొరియాపై ఒత్తిడి పెంచాలి' అని వ్యాఖ్యానించింది. 'ఉత్తర కొరియాపై వీలైనంత ఎక్కువ ఒత్తిడి

తరువాయి 6లో

అదనపు విద్యుత్ ఉత్పత్తి ఏదీ?



ఒక్క యూనిట్ కూడా కొత్తగా ఉత్పత్తి చేయకుండా మిగులు రాష్ట్రమంటే ఎలా?

కొనుగోలు చేస్తూ జెన్‌కోను నిర్వీర్యం చేస్తున్నారు : ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

గాంధీభవన్‌లో కాంగ్రెస్ పార్టీ పవర్ పాయింట్ ప్రజంటేషన్

మన తెలంగాణ / హైదరాబాద్ : రాష్ట్రంలో కెసిర్ ముఖ్యమంత్రి అయ్యాక ఒక్క యూనిట్ విద్యుత్ కూడా అదనంగా ఉత్పత్తి చేయలేదని, అలాంటిది తెలంగాణ మిగులు విద్యుత్ రాష్ట్రమని పత్రికల్లో పెద్ద ప్రకటనలు ఇచ్చుకోవడం సిగ్గు చేటు అని టిపిసిసి అధ్యక్షులు ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. ప్రైవేటు కంపెనీల నుండి కొనుగోలు చేస్తున్న విద్యుత్‌ను కూడా రాష్ట్ర ప్రభుత్వమే ఉత్పత్తి చేస్తున్నట్లుగా లెక్కలు చూపుకోవడం ఘోరమన్నారు. వచ్చే రెండేళ్ళలో కూడా కెసిఆర్ ప్రారంభించిన యాదాద్రి, భద్రాద్రి పూర్తికావని, దీంతో ఎత్తిపోతల పథకాలు, వ్యవసాయానికి ఉచిత విద్యుత్ పేరుతో కమీషన్‌ల కోసం ప్రైవేటు కంపెనీల నుండే విద్యుత్‌ను కొంటారని, అందుకే జెన్‌కోను నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. యుపిఎ

తరువాయి 6లో



నీరుమ్మడి

తుంగభద్ర నీటికోసం ఉమ్మడిగా ఇండెంట్

ఫోన్ సంభాషణలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఇరిగేషన్ మంత్రుల అంగీకారం

మన తెలంగాణ/ హైదరాబాద్: తుంగభద్ర నీటి విడుదలకు తెలంగాణ, ఎపి రాష్ట్రాలు పరస్పర సహకార ధోరణికి శ్రీకారం చుట్టాయి. తుంగభద్ర నుంచి రాజోలిబండకు, సుంకేశులకు నీటి విడుదల కోసం రెండు రాష్ట్రాలూ ఉమ్మడిగా ఇండెంట్ ఇవ్వాలని నిర్ణయించుకున్నాయి. ఈ మేరకు తెలంగాణ మంత్రి హరీశ్‌రావు ఆంధ్రప్రదేశ్ సాగునీటిపారుదల మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావుతో బుధవారం ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని వివరించారు. రెండు రాష్ట్రాల నుంచి ఇండెంట్ ఉంటే తప్ప ఇటు రాజోలిబండ నీటి మళ్ళింపు ప్రాజెక్టుకు, అటు సుంకేశులకు తుంగభద్ర నీటి విడుదల సాధ్యం కాదని, ఇందుకోసం వీలైనంత తొందరగా ఉమ్మడి ఇండెంట్ ఇద్దామని ఉమకు హరీశ్‌రావు వివరించారు. తెలంగాణ ప్రభుత్వం వారం రోజుల క్రితమే తుంగభద్ర బోర్డుకు 3.5 టిఎంసిల నీటిని విడుదల చేయాల్సిందిగా ఇండెంట్ ఇచ్చినా ఎపి మాత్రం 5.2 టిఎంసిల మేరకు ఇండెంట్ ఇంకా ఇవ్వలేదు. రెండు రాష్ట్రాల నుంచి ఇండెంట్ అందితే తప్ప తుంగభద్ర బోర్డునీటిని విడుదల చేయడం సాధ్యం కాదు. ఈ నేపథ్యంలోనే మంత్రులిద్దరూ రెండు రాష్ట్రాల సాగునీటిపారుదల శాఖ కార్యదర్శులు (తెలంగాణ కార్యదర్శి ఎస్‌కె జోషి, ఎపి కార్యదర్శి శశిభూషణ్) ఫోన్‌లో మాట్లాడుకున్నారు. ఆయకట్టుకు నీటిని విడుదల చేయాలని చాలా రోజులుగా ఆర్‌డిఎస్ పరిధిలోని రైతులు కోరుతున్నారు. అయితే ఎపి నుంచి ఇండెంట్ లేని కారణంగా తుంగభద్ర బోర్డు నీటిని విడుదల చేయడానికి సంసిద్ధం కాలేదు. దీంతో ఉమ్మడి ఇండెంట్ విషయమై తెలంగాణ మంత్రి హరీశ్‌రావు ఆంధ్రప్రదేశ్ మంత్రి దేవినేనితో మాట్లాడిన తర్వాత ఆ రాష్ట్రం అంగీకారం తెలిపింది. దీంతో ఒకటి, రెండు రోజుల్లో తుంగభద్ర నుంచి ఆర్‌డిఎస్ ఆయకట్టుకు సాగునీరు అందే అవకాశం ఉంది.

కుంచెపోటు





బుద్వేల్‌లో ఐటి క్లస్టర్

మన తెలంగాణ / హైదరాబాద్ : నగర శివారులోని బుద్వేల్‌లో మరో ఐటి క్లస్టర్ ఏర్పాటు చేస్తున్నట్లు ఐటి, పురపాలక శాఖమంత్రి కెటి రామారావు తెలిపారు. త్వరలో ఏర్పాటు కానున్న బుద్వేల్, రాజేంద్రనగర్ ఐటి క్లస్టర్ ప్రాంతాల్లో మంత్రి కెటిఆర్ బుధవారం పర్యటించారు. క్లస్టర్ ఏర్పాటు కోసం సేకరించనున్న పలు స్థలాల్లో మంత్రి అధికారులతో కలిసి పర్యటించారు. బుద్వేల్ ఐటి క్లస్టర్‌ను ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందన్నారు. త్వరలోనే ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర రావు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. ఈ క్లస్టర్‌లో కంపెనీలను స్థాపించేందుకు ఇప్పటికే 30కి పైగా సంస్థలు ప్రభుత్వంతో చర్చలు

తరువాయి 6లో

మార్చిలో కొత్త రేషన్ కార్డులు?

మన తెలంగాణ/ హైదరాబాద్ : రాష్ట్రంలో మరో రెండు నెలల్లో కొత్త రేషన్ కార్డులు రానున్నాయి. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం నుంచి కొత్త ఆహార భద్రత కార్డులు ఇవ్వాలని ప్రయత్నం జరుగుతున్నా అమలుకు నోచుకోలేదు. గతంలో కొత్త కార్డులు ముద్రించి జారీ చేసేందుకు సిద్ధం కాగా, అంతలోనే కొత్త జిల్లాలు ఏర్పాటయ్యాయి. దాంతో పాత పది జిల్లాల పేర్లతో ఉన్న కార్డులన్నీ నిరుపయోగంగా మారిపోయాయి. ఆ తర్వాత కొత్త కార్డుల ముద్రణ చేపట్టలేదు. ఇ–పాస్ విధానంలో రేషన్ సరుకులు పంపిణీ అవుతున్నందున కార్డులు లేకున్నా లబ్ధిదారులు రేషన్ తీసుకునే వెసులుబాటు ఉండటంతో అంతగా కొత్త కార్డుల డిమాండ్

తరువాయి 6లో



జనజీవన బంద్

బంద్‌తో మహారాష్ట్రలో స్తంభించిన రైలు, బస్సు సర్వీసులు

అప్రకటితంగా మూతబడిన స్కూళ్లు, డబ్బావాలాల సేవల నిలిపివేత

ముంబయి: మహారాష్ట్ర బంద్ హింసాత్మకంగా మారింది. ముంబయితో పాటు పలు ప్రాంతాలలో ట్రాఫిక్ స్తంభించిపోయింది. రైళ్ల రాకపోకలకు అంతరాయం కలిగింది. పుణె సమీపంలో భీమా–కోరేగావ్ గ్రామంలో జరిగిన హింసకు నిరసనగా అంబేద్కర్ మనవడు ప్రకాశ్ అంబేద్కర్ రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చారు. బుధవారం ఉదయం నుంచే ఆందోళన కారులు పలు ప్రాంతాల్లో వాహనాలను అడ్డుకున్నారు. స్థానిక రైళ్లకు ఆటంకం కలిగించారు. చెంబూరు, ఘట్కోపర్, కాంరాజ్ నగర్, విక్రోలీ, దిన్‌దోషి, కాండివలి, జగేశ్వరి, కళానగర్, మాహిం

తరువాయి 6లో

బస్సులపై అభ్యంతరాలుంటే విచారణ చేస్తాం : హైకోర్టు

మన తెలంగాణ/ హైదరాబాద్: అరుణాచల్‌ప్రదేశ్, హిమాచల్‌ప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ చేసిన బస్సుల్ని ఏపీలో నడపడంపై అభ్యంతరాలు ఉంటే వ్యాజ్యాన్ని దాఖలు చేసుకుంటే విచారణ చేస్తామని హైకోర్టు స్పష్టం చేసింది. భారీ బస్సుల్ని తయారు చేసి అరుణాచల్‌ప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకుని ఏపీలో నడపడాన్ని సవాల్ చేసిన కేసులో తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి శ్యాంప్రసాద్‌లతో కూడిన డివిజన్‌బెంచ్ బుధవారం విచారణ చేసింది. అలాంటి బస్సుల్ని సీజ్ చేసిన కేసుల్లో బస్సు తిరిగి నడిపేందుకు యజమానులు హైకోర్టు నుంచి మధ్యంతర ఉత్తర్వులు పొందారు. ఇందులో ప్రతివాది అయిన ఆర్టీసీ ట్రేడ్ యూనియన్ లీడర్ వరహాలనాయుడికి బెంచ్ పైవిధంగా సూచన చేసింది. హైకోర్టు ఆదేశాలను అడ్డంపెట్టుకుని ఏపీ ప్రభుత్వం బస్సు యజమానుల నుంచి డిపాజిట్ సేకరించి బస్సులు నడిపేందుకు అనుమతి ఇస్తోందని ఆయన హైకోర్టు దృష్టికి తెచ్చారు. దాంతో బెంచ్ పైవిధంగా ఆయనకు సూచన చేసి విచారణను వాయిదా వేసింది.



టిఎస్‌ఐపాస్ విధానం అద్భుతం

కెటిఆర్‌కు సందేశం పంపిన ఓ పారిశ్రామిక వేత్త



మన తెలంగాణ / హైదరాబాద్ : పారిశ్రామికవర్గాల నుంచి ప్రభుత్వ విధివిధానాలకు వచ్చే అనుకూల అభిప్రాయాలు, ప్రశంసలు మరింత ఉత్సాహంతో పనిచేసేందుకు స్ఫూర్తినిస్తోందని మంత్రి కెటిఆర్ వ్యాఖ్యానించారు. పరిశ్రమల స్థాపన, పెట్టుబడుల ద్వారా ఉద్యోగాలు కల్పించాలన్న తమ లక్ష్యం వైపు పని చేసేందుకు ఇది దోహదం చేస్తుందన్నారు. నూతన పారిశ్రామిక విధానం టిఎస్‌ఐపాస్ పని తీరుపై మంత్రి కెటిఆర్‌కు డెల్ ఎక్సెల్ ఫార్మా కంపెనీ సిఈవో రఘుపతి కందారపు ఒక సందేశాన్ని పంపారు. గతంలో వివిధ కంపెనీల్లో పని చేసిన రఘుపతి సొంతంగా పరిశ్రమను ఏర్పాటు చేసేందుకు చేసిన ప్రయత్నాల్లో ప్రభుత్వం , ప్రభుత్వ విధానాలతో తన అనుభవాన్ని మంత్రితో పంచుకున్నారు. తాను గతంలో 15 సంవత్సరాల పాటు అనేక కంపెనీల్లో ఫార్మా రీసెర్చ్ విభాగానికి హెడ్‌గా పని చేశానని, తనకు ఇంతటి సులభమైన, పారదర్శకమైన అనుభవం ఎప్పుడూ కలగలేదని ఆ సందేశంలో పేర్కొన్నారు. 2016 జూన్ నెలలో టిఎస్ ఐపాస్ ద్వారా అనుమతులు అందుకున్న తాను, తన కర్మాగార నిర్మాణం పూర్తి చేసి డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ శాఖాధికారులను డ్రగ్ లైసెన్స్ కోసం కలిసినట్లు తెలిపారు. గతంతో పోల్చితే ఈ డ్రగ్ లైసెన్సింగ్ విధానం అత్యంత సులువుగాను, పారదర్శకంగానూ ఉందన్నారు. డ్రగ్ లైసెన్సింగ్ విధానం నిజానికి క్లిష్టమైన ప్రక్రియ అయినప్పటికీ తెలంగాణ ప్రభుత్వం రూపొందించిన ఆన్‌లైన్ ప్రక్రియ ద్వారా అత్యంత సులభంగా మారిందన్నారు. తాను కేవలం వారం రోజుల లోపునే తన లైసెన్సును పొందానని హర్షం వెలిబుచ్చారు. ఇంత సులభమైన విధానంలో వేగంగా అనుమతులు ఇచ్చిన అధికారులకు, తెలంగాణ ప్రభుత్వానికి రఘుపతి ధన్యవాదాలు తెలిపారు. మంత్రి కెటిఆర్ వలనే ఇది సాధ్యం అవుతుందని, ఆయన పని తీరే తమకు స్ఫూర్తిగా నిలుస్తుందని అధికారులు తనకు తెలిపారన్నారు. 'ఇంతటి స్ఫూర్తివంతమైన మీ నాయకత్వానికి అభినందనలు' అంటూ మంత్రికి పంపిన సందేశంలో రఘుపతి పేర్కొన్నారు. తెలంగాణలో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ప్రమాణాలు బాగుండడం పట్ల ఆయన అభినందనలు తెలిపారు. రఘుపతి సందేశానికి మంత్రి కెటిఆర్ కృతజ్ఞతలు తెలిపారు. పరిశ్రమల స్థాపన, ఉద్యోగాల కల్పన చేయాలన్న తమ లక్ష్యాన్ని చేరుకునేందుకు ఇలాంటి ఫీడ్ బ్యాక్ స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు.

ఎఫ్‌ఆర్‌డిఐ చట్ట విరుద్ధం

- రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు వెల్లడి

మన తెలంగాణ/హైదరాబాద్ : డిపాజిట్‌దారులకు సమ్మతం లేకుండా వారి నగదును బ్యాంకులు సెక్యూరిటీలుగా మార్చుకునేలా ప్రతిపాదిత ఫైనాన్స్ రెజల్యూషన్, డిపాజిట్ ఇన్సూరెన్స్(ఎఫ్‌ఆర్‌డిఐ) చట్టం రాజ్యాంగానికి విరుద్ధంగా ఉందని ఆల్ ఇండియా బ్యాంకింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఎఐబిఇఎ) జాతీయ ప్రధాన కార్యదర్శి బి.రాంబాబు అన్నారు. బ్యాంకుల పరిస్థితి దిగజారిందని, పది సంవత్సరాల క్రితం మొండి బకాయిలు రూ.60 వేల నుండి రూ.70 వేల కోట్ల వరకు ఉంటే, ప్రస్తుతం అధికారికంగా రూ.8 లక్షల కోట్లు, అనధికారికంగా రూ.15 లక్షల కోట్లు ఉంటాయని అని చెప్పారు. ఎఐటియుసి, రిటైర్డ్ ఇండస్ట్రియల్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (రివ్వా) ఆధ్వర్యంలో బుధవారం ఎఐటియుసి కార్యాలయంలో 'ఎఫ్‌ఆర్‌డిఐ చట్టం'పై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి వి. ఎస్.బోస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బి.రాం బాబు, ఆర్థిక విశ్లేషకులు డి.పాపారావు, ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉజ్జిని రత్నాకర్‌రావు పాల్గొన్నారు. రాంబాబు మాట్లాడుతూ, బ్యాంకుల్లో దాచుకున్న సొమ్మును డిపాజిట్ దారు సమ్మతి లేకుండా బ్యాం కుల వాటా (ఈక్విటీ షేర్) కింద మార్చుకునే వెసులుబాటు కల్పించేందుకు ప్రతిపాదిత బిల్లు ఉందని ఆయన తెలిపారు. నోట్ల రద్దు, ముద్రా, జన్‌ధన్‌యోజన తదితర క్రమానుగతంగా ప్రవేశపెడుతున్న కార్యక్రమాలు ఎన్‌డిఎ రాజకీయ ఎజెండాలో భాగమని ఆయన అభిప్రాయపడ్డారు. మొండి బకాయిలను వసూలు చేసేందుకు ఆర్‌బి ఐ 23 కంపెనీలను ట్రిబ్యునల్‌కు అప్పగించిందని, ఇవి చెల్లించాల్సిన మొత్తం రూ.7.5 కోట్లు అని వివరించారు. ఇలా బ్యాంకుల నుంచి రుణం తీసుకొని చెల్లించని వారి లో తెలుగుదేశం ఎంపి రాయపాటి సాంబశివరావు, మాజీ ఎంపి లగడపాటి రాజగోపాల్ తదితరులున్నారన్నారు. మొండి బకాయిదారుల ఎవరు?, వారంతా నిజంగా చెల్లించలేని స్థితిలో ఉన్నారా? వంటి మౌలిక, అవసరమైన ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా డిపాజిట్‌దారుల సొమ్ముతో బ్యాంకులను కాపాడే యత్నాలు తగవన్నారు. ఎఫ్‌ఆర్‌డిఐలోని సెక్షన్ 48, 52, 53లపై మాట్లాడకుండా బిజెపి నాయకులు ఎందుకు దాటవేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ఉజ్జిని రత్నాకర్‌రావు మాట్లాడుతూ, బ్యాం కుల్లో డిపాజిట్లకు రక్షణ లేని పరిస్థితి ఏర్పడిందన్నారు.ఈ సందర్భంగా పాపారావు మాట్లాడుతూ యుపిఎ, ఎన్‌డిఎ ప్రభుత్వాల విధానాలతో ధనవంతులు మరింత సిరిమంతులుగా మారుతుంటే పేదలు నిరుపేదలుగా మారిపోతున్నారన్నారు. 1930లో దేశంలోని ఒక శాతం మంది ధనవంతుల వద్ద 21 శాతం సంపద ఉంటే స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 1950 నుంచి 1980 వరకు ఆ సంపద 6 శాతానికి పడిపోయిందన్నారు. 2014 సంవత్సరం నాటి కి తిరిగి ఒక శాతం మంది వద్దకు 22 శాతం సంపద పోగుపడిందన్నారు. సమాజంలో పెద్ద మనుషులుగా చెలామణిలో ఉన్న వారు ఉద్దేశ్యపూర్వకంగా ఎగవేసిన సొమ్ము దివాళా తీయడానికి సిద్ధంగా ఉన్న బ్యాంకులను కాపాడేందుకు సామాన్యుల సొమ్ముతో బెయిల్ ఇన్ ఇచ్చేందుకు కేంద్రం యత్నిస్తుందని ఆయన విమర్శించారు. ఇందులో భాగంగానే నోట్ల రద్దు, ఆ తర్వాత డిజిటల్ ఎకానమీ ద్వారా ప్రజల డబ్బు ప్రజల వద్ద లేకుండా చేసేందుకు కుట్ర చేశారన్నారు. అది ఫలించకపోవడంతో ఎఫ్‌ఆర్‌డిఐ చట్టం తెచ్చేందుకు యత్నిస్తున్నారన్నారు. బ్యాంకుల్లో డిపాజిట్‌లు చేసుకున్న వారి హక్కుల పరిరక్షణ కోసం ప్రజా ఉద్యమం చేస్తామని వి.ఎస్.బోస్ తెలిపారు. డిపాజిట్లపై డిపాజిట్‌దారులకే హక్కు ఉండాలని, ఆ డిపాజిట్లకు కేంద్ర ప్రభుత్వం గ్యారంటీ ఇవ్వాలని, రిటైర్డ్ కార్మికుల డిపాజిట్లకు 12 శాతం వడ్డీ చెల్లించాలని, డిపాజిట్లను హరించే ఎఫ్‌ఆర్‌డిఐ చట్టాన్ని తీసుకురావద్దని ఆయన డిమాండ్ చేశారు. ఎఫ్‌ఆర్‌డిఐ చట్టం వస్తుందనే భయంతో బ్యాంకుల్లో ప్రజలు దాచుకున్న రూ.96 లక్షల కోట్లలో రూ.25 లక్షల కోట్లను వెనక్కి తీసుకున్నట్లు సమాచారం ఉందన్నారు.





ఆర్థిక మెరుగు కోసం ప్రత్యేక చర్యలు

మన తెలంగాణ / హైదరాబాద్ : ఆర్‌టిసి ఆర్థిక పరిస్థితి మెరుగు కోసం ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు టిఎస్‌ఆర్‌టిసి ఛైర్మన్ సోమారపు సత్యనారాయణ, మేనేజింగ్ డైరెక్టర్ జి.వి.రమణరావు అన్నారు. ఆర్‌టిసి అధికారులు, సిబ్బంది సమిష్టి కృషితోనే సంస్థకు పేరు ప్రఖ్యాతలు సాధ్యమవుతున్నాయని వారన్నారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఆర్‌టిసి మేనేజింగ్ డైరెక్టర్ జి.వి.రమణరావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డి.వేణు, సిఎఫ్‌ఎ స్వర్ణ శంకరన్, పలువురు ఉన్నతాధికారులు బుధవారం ఛైర్మన్‌ను ఆయన ఛాంబర్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. గత ఏడాది కంటే ఈ ఏడాదిలో సంస్థ మరింత పురోభివృద్ధిని సాధించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఛైర్మన్ సోమారపు సత్యనారాయణ అధికారులను కోరారు. గత ఏడాది కొన్ని డిపోలు లాభాలలోకి రావడం, మరికొన్ని డిపోలు నష్టాలను అధిగమించే స్థాయికి చేరుకోవడం మంచి పరిణామమని, ఇదే స్థాయిలో ఈ ఏడాది కూడా ప్రయత్నిస్తే డిపోలు పూర్తిగా లాభాలను ఆర్జించగలుగుతాయని ఆయన అన్నారు. సంస్థలో నూతన పద్ధతులను అవలంభించడం ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించే దిశగా ప్రయత్నాలు చేస్తున్నట్లు మేనేజింగ్ డైరెక్టర్ రమణరావు తెలిపారు.

హైకోర్టును ఆశ్రయించిన

చెన్నమనేని రమేశ్



మన తెలంగాణ/ హైదరాబాద్: వేములవాడ ఎమ్మెల్యే రమేష్ చెన్నమనేని మరో సారి తన పౌరసత్వంపై హైకోర్టును ఆశ్రయించారు. జర్మన్ పౌరసత్వం కూడా ఉండటంతో ఆయనకు భారత పౌరసత్వం చెల్లదని కేంద్ర హోం శాఖ తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో రిట్ దాఖలు చేశారు. గత ఏడాది డిసెంబర్ 13న కేంద్ర హోం శాఖ రమేష్ చేసుకున్న పిటిషన్‌ను డిస్మిస్ చేయడంతో హైకోర్టులో రిట్ వేశారు. కేంద్ర హోం శాఖ తీసుకున్న నిర్ణయం చెల్లదని ఉత్తర్వులు జారీ చేయాలని రమేష్ రిట్‌లో హైకోర్టును కోరారు. ఒకటి రెండు రోజుల్లో ఈ రిట్‌పై విచారణ జరగనుంది.


నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో

కాళేశ్వరంపై విచారణ వాయిదా

మనతెలంగాణ/న్యూఢిల్లీ:పర్యావరణ, అటవీ అనుమతులు లేకుండానే కాళేశ్వరం ప్రాజెక్టు పనులు ప్రారంభించారని తెలంగాణకు హయాతుద్దీన్ ఎన్జీటీ(నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్)లో పిటీషన్ దాఖలు చేసారు. దీన్ని బుధవారం విచారణకు చేపట్టిన ట్రిబ్యునల్ తదుపరి విచారణను ఫిబ్రవరి 16 కు వాయిదా వేసింది. విచారణ సందర్భంగా జస్టిస్ యూ.డి సాల్వే ధర్మాసనం ముందు తెలంగాణ ప్రభుత్వం తరపున అడ్వకేట్ జనరల్ ప్రకాశ్ రెడ్డివాదనలు వినిపించించారు.ప్రాజెక్ట్ మహారాష్ట్ర పరిధిలోకి కూడా వస్తుంది కాబట్టి ఈ కేసు విచారణ పూణే గ్రీన్ ట్రిబ్యునల్ బెంచ్ పరిశీలించాలని తెలంగాణ అడ్వకేట్ జనరల్ విజ్ఞప్తి చేసారు. పిటిషనర్ దాఖలు చేసిన అప్లికేషన్ కి విచారణ అర్హత ఉందా లేదా అని తేల్చిన తర్వాత ఈ పిటీషన్ ని ఎవరు విచారించాలనే పరిధిని నిర్ణయిస్తామని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ధర్మాసనం పేర్కొన్నది. అదే విధంగా దక్షిణాదిన ఉన్న చెన్నై గ్రీన్ ట్రిబ్యునల్ ధర్మాసనం ప్రస్తుతం ఫంక్షనింగ్ లో లేనందున దిల్లీ లో విచారించవచ్చని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ అభిప్రాయ పడింది.

పార్లమెంట్ సెలెక్ట్/స్టాండింగ్ కమిటీకి పంపించండి

- ట్రిపుల్ తలాక్ బిల్లును పటిష్టవంతంగా రూపొందించాలి
- సిపిఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి డిమాండ్



మన తెలంగాణ/ హైదరాబాద్ : బిజెపి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ట్రిపుల్ తలాక్ బిల్లును మరింత పటిష్టవంతంగా రూపొందించేందుకు వీలుగా పార్లమెంట్ సెలెక్ట్ కమిటీకి లేదా స్టాండింగ్ కమిటీకి పంపించాలని సిపిఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. 'ఒకే దేశం–ఒకే పౌర స్మృతి' అంటున్న బిజెపి 'ట్రిపుల్ తలాక్ బిల్లు'లో మూడేళ్ళ శిక్షార్హమైన నేరాన్ని ఒక్క మతం వారికే అమలు చేయడం తీవ్ర అభ్యంతరకరమని అన్నారు.మహిళలకు న్యాయం చేసే అంశమైనందున బిల్లుపై విషయంపై ఏకాభిప్రాయ సాధనకు ప్రయత్నించాలని ఆయన డిమాండ్ చేశారు. అన్ని మతాలకు చెందిన మహిళా సంఘాలు కోరుతున్నట్లు 'మహిళలకు నష్టపరిహారం, భరణం' అంశం ట్రిపుల్ తలాక్ చట్టంలో ఉండాలని ఆయన కోరారు. మఖ్ధుంభవన్‌లో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డితో కలిసి బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

ట్రిపుల్ తలాక్‌పై బిజెపి ప్రభుత్వ వైఖరి మహిళలకు న్యాయం చేయడం కంటే కక్ష తీర్చుకునే విధంగా ఉందని సుధాకర్‌రెడ్డి విమర్శించారు. ట్రిపుల్ తలాక్ బిల్లును ఇటీవల లోక్‌సభలో ప్రవేశపెట్టి ఆదరాబాదరాగా రాజ్యసభలో ప్రవేశపెట్టడంలోనే బిజెపి ప్రభుత్వ దురుద్దేశ్యం కనబడుతుందన్నారు. ట్రిపుల్ తలాక్‌ను శిక్షార్హమైన నేరంగా ప్రకటించకపోతే అరికట్టలేమనే భావన సరైంది కాదన్నారు. ఈ చట్టం మంచిదే అయినప్పటికీ ప్రమాదకరమైన నిబంధన వల్ల చట్టం ఉద్దేశ్యం నెరవేరదని, మతం పట్ల వివక్షగానే చూస్తారన్నారు.మహారాష్ట్రలో అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాడుతున్న దళితులపై దాడులు క్షమార్హం కావని సురవరం అన్నారు. దళితుల ఆందోళన కొనసాగడానికి మహారాష్ట్ర బిజెపి ప్రభుత్వ వైఖరే కారణమన్నారు. ఈ ఆందోళలను పీష్వాలు, మెహర్‌ల కుల ఘర్షణగా చిత్రీకరిస్తున్నారని, అక్కడ దళితులపై దాడి జరిగిందని, వారి మధ్య ఘర్షణ కాదన్నారు.మహారాష్ట్రలో దళితుల ఆందోళనకు సిపిఐ సంపూర్ణ మద్దతునిస్తుందని ఆయన చెప్పారు. మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎంసిఐ) స్థానంలో కేంద్రం కొత్తగా తీసుకువచ్చిన మెడికల్ బిల్లు ద్వారా వైద్య వృత్తిని, మెడికల్ అసోసియేషన్‌ను విధ్వంసం చేసి సంఘ్ పరివార్‌కు చెందిన వారితో నింపడానికి తప్పుడు ప్రయత్నం చేస్తుందన్నారు.

మందకృష్ణను విడుదల చేయాలి: తెలంగాణ రాష్ట్రంలో ఎంఆర్‌పిఎస్ నేత మంద కృష్ణ మాదిగ అరెస్ట్‌ను దళితుల అణిచివేతలో భాగమేనని సురవరం అన్నారు. తమ సమస్యపై ఎస్‌సి వర్గీకరణ కోసం మందకృష్ణను బయట, వారి కార్యాలయంలో శాంతియుతంగా దీక్ష చేయడానికి నిరాకరించడం అన్యాయమన్నారు. వర్గీకరణ సుధీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉందని, వర్గీకరణను అన్ని పార్టీలు అంగీకరించాయని, ఉషా మెహ్రా కమిషన్ కూడా స్పష్టమైన నివేదిక ఇచ్చిందన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి పార్లమెంట్‌లో చట్ట సవరణ ద్వారా ఎస్‌సి వర్గీకరణ చేయాలని, మందకృష్ణను వెంటనే విడుదల చేయాలని ఆయన డిమండ్ చేశారు. చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ ఇప్పటికైనా సిఎం కెసిఆర్ స్పందించి ఎస్‌సి వర్గీకరణ కోసం అన్ని రాజకీయ పార్టీలను ప్రధానమంత్రి వద్దకు తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు. ఎస్‌సి వర్గీకరణకు అన్ని రాజకీయ పార్టీలు అనుకూలంగా ఉన్నప్పటికీ ప్రభుత్వం వర్గీకరణను ఎందుకు నిర్లక్ష్యం చేస్తుందని ప్రశ్నించారు. సిఎం కెసిఆర్ వచ్చిన తరువాతనే విద్యుత్ ఉత్పత్తి పెరిగినట్లు మాట్లాడడం సరైంది కాదన్నారు. ఛత్తీస్‌ఘడ్ నుంచి రూ.5 లకు యూనిట్ చొప్పున విద్యుత్‌ను కొనుగోలు చేయడం రాష్ట్ర ప్రజలపై భారం మోపడమేనన్నారు. 24 గంటల విద్యుత్‌పై కనబరిచిన శ్రద్ధ క్షేత్ర స్థాయిలో సిబ్బంది ఖాళీలను భర్తీ చేయడం, సమస్యలను పరిష్కరించడంపై చూపాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం లేదని వామపక్షాలు భావిస్తున్నాయని, జన సేన పార్టీ ఒక వైపు వామపక్షలు చేపట్టిన ధర్నా చౌక్ పరిరక్షణ ఉద్యమానికి మద్దతివ్వగా మరో వైపు పవన్ కళ్యాణ్ కెసిఆర్ పాలనను పొగడడం ద్వంద వైఖరే అవుతుందని చాడ వెంకటరెడ్డి విలేకరులు అడిగిన ఒక ప్రశ్నకు సమాధానమిచ్చారు. తెలంగాణతో, తెలంగాణ ఉద్యమంతో పవన్ కళ్యాణ్‌కు సంబంధం లేదన్నారు.

మళ్ళీ చంచల్‌గూడ జైలుకు మందకృష్ణ మాదిగ




మన తెలంగాణ/హైదరాబాద్: ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగను చిలకలగూడ పోలీసులు బుధవారం సికింద్రాబాద్ కోర్టులో హాజరుపర్చారు.ఈ నెల 11వ తేదీ వరకు మెజిస్ట్రేట్ రిమాండ్ విధించడంతో ఆయనను పోలీసులు చంచల్‌గూడ జైలుకు తరలించారు.పక్షం రోజుల వ్యవధిలో మంద కృష్ణ జైలుకు వెళ్లడం ఇది రెండో సారి. ఎంఆర్‌పిఎస్ కార్యకర్త భారతి సంస్మరణ సభ అనంతరం జరిగిన ర్యాలీ, ఘర్షణ కేసులో అరెస్టైన మందకృష్ణ మాదిగ గత నెల 18న చంచల్‌గూడ జైలుకు తరలించిన విషయం తెలిసిందే. 27న విడుదలైన తరువాత తన పోరాటాన్ని సాగిస్తానని చెప్పారు. ఈ క్రమంలోనే తన ఉపవాస దీక్షకు అనుమతి ఇవ్వాలంటూ మంగళవారం నగర పోలీసు కమిషనర్ వివి శ్రీనివాస్‌రావును కలవడం, కమిషనర్ అనుమతి నిరాకరించడం జరిగింది. పోలీసుల అనుమతి ఇవ్వకున్నా తన దీక్ష కొనసాగుతుందని మందకృష్ణ మాదిగ వెల్లడించడం, ఆ తరువాత పార్శిగుట్టలోని తన కార్యాలయంలో తన భవిష్యత్తు కార్యచరణ ప్రకటిస్తున్న సమయంలోనే చిలకలగూడ పోలీసులు అతన్ని అరెస్టు చేశారు. మందకృష్ణపై ఐపిసి 501, 505, 506, 341, 143 సెక్షన్‌ల కింద కేసులు నమో దు చేశారు. ఎన్నిసార్లు అరెస్టు చేసి జైలులో పెట్టినా తమ ఉద్యమం ఆగదని ఎంఆర్‌పిఎస్ నాయకులు తెలిపారు.

మందకృష్ణ మాదిగ అరెస్టు అన్యాయం : కోదండరామ్

మందకృష్ణ మాదిగ అరెస్టు హైదరాబాద్‌లోని నిరంకుశ వాతావరణానికి అద్దం పడుతోందని తెలంగాణ జెఎసి ఛైర్మన్ ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ వ్యాఖ్యానించారు. న్యాయమైన డిమాండ్ల సాధన కోసం దీక్షకు అనుమతినివ్వాలని మందకృష్ణమాదిగ కోరినా ఫలితం దక్కలేదని, అంతిమంగా ఆయన తన సంస్థ కార్యాలయంలో దీక్ష ప్రారంభిస్తే పోలీసులు అరెస్టు చేయడం అన్యాయమని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ నగరంలో నిరసనకు అవకాశం లేకుండా పోయిందని, ఎవ్వరికీ ధర్నాలు, నిరసనలకు పోలీసులు అనుమతినివ్వడం లేదని పేర్కొన్నారు.

విద్యార్థులకు ఉచితంగా ల్యాప్‌టాప్ పథకం



బెంగళూరు: ఉన్నత విద్యను అభ్యసించే ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులకు కర్ణాటక ప్రభుత్వం ఉచితంగా ల్యాప్‌టాప్‌లను అందజేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విధానసౌధలోని బాంక్వెట్ హాల్‌లో బెంగళూరు, బెంగళూరు గ్రామీణ ప్రాంతాలకు చెందిన ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులకు సిఎం ల్యాప్‌టాప్ అందజేశారు. దీని ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఎస్‌సి, ఎస్‌టిలతో పాటు ఇతర వెనుకబడిన వర్గాలకు చెందిన సుమారు 1.5 లక్షల మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుందని సిఎం అన్నారు. త్వరలోనే ఇతర అన్ని వర్గాల్లోని పేద ప్రతిభావంతులైన విద్యార్థులకు అందజేయనున్నట్లు ఆయన ప్రకటించారు.



సిబిఐపి అవార్డును అందుకున్న దేవులపల్లి ప్రభాకరరావు

మన తెలంగాణ/హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ సిబిఐపి అవార్డును తెలంగాణ ట్రాన్స్‌కో సిఎండి దేవులపల్లి ప్రభాకరరావు అందుకున్నారు. న్యూఢిల్లీలో బుధవారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో కేంద్ర మంత్రుల సమక్షంలో సిబిఐపి అధ్యక్షులు రవీంద్రకుమార్ వర్మ ఈ అవార్డును ప్రభాకరరావుకు అందించారు. సెంట్రల్ బోర్డు ఆఫ్ ఇరిగేషన్ అండ్ పవర్ (సిబిఐపి) జ్యూరీ ఇటీవలే ప్రభాకరరావును ప్రతిష్టాత్మక అవార్డుకు ఎంపిక చేసింది. విద్యుత్ సరఫరా రంగంలో విశేష కృషి చేసి దేశంలోనే తెలంగాణ ట్రాన్స్‌కోను పలు రంగాల్లో అగ్రగామిగా నిలిపినందుకు ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు బోర్డు ప్రకటించింది. అవార్డుల ప్రధానోత్సవంలో కేంద్ర మంత్రులు సత్యపాల్ సింగ్, అర్జున్ రామ్ మెఘువాల్, రాజ్‌కుమార్ సింగ్, సిబిఐపి ఉపాధ్యక్షులు మసూద్ హుస్సేన్, కార్యదర్శి కంజిల్లా, కేంద్ర జలవనరుల శాఖ కార్యదర్శి యుపి సింగ్, సంప్రదాయేతర ఇంధన వనరుల శాఖ కార్యదర్శి ఆనంద్ కుమార్, విద్యుత్ శాఖ కార్యదర్శి అజయ్ కుమార్ బల్లా తదితరులు పాల్గొన్నారు.

సిఎంఒలోకి కలెక్టర్ రఘునందన్‌రావు?

- **నలుగురు ఐఎఎస్‌లకు కార్యదర్శులుగా పదోన్నతులు**



మన తెలంగా / హైదరాబాద్ : రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా ఉన్న 2002 బ్యాచ్‌కు చెందిన ఐఎఎస్ అధికారి రఘునందన్‌రావుతో పాటు మరో ముగ్గురికి కార్యదర్శులుగా పదోన్నతి లభించింది. ఈ పదోన్నతితో రఘునందన్ త్వరలోనే ముఖ్యమంత్రి కార్యాలయంలో ప్రత్యేక బాధ్యతలు నిర్వర్తించేందుకు అవకాశం పొందనున్నట్లు సమాచారం. టిఎస్ ఐపాస్‌కు సంబంధించిన ఇండస్ట్రీ ఛేజింగ్ సెల్ బాధ్యతలను ఆయనకు అప్పగించే అవకాశాలున్నట్లు సమాచారం. రఘునందన్‌తో పాటు రాష్ట్ర షెడ్యూల్డు కులాల అభివృద్ధి విభాగం కార్యదర్శిగా ఉన్న జ్యోతి బుద్ధప్రకాష్, హెచ్ఎండిఎ కమిషనర్ చిరంజీవులు, కేంద్ర రక్షణ శాఖలో డిప్యూటేషన్‌పై ఉన్న సుదర్శన్‌రెడ్డి అనే ముగ్గురికి కూడా కార్యదర్శులుగా పదోన్నతి లభించింది. ప్రస్తుతం ముఖ్యమంత్రి కార్యాలయంలో కార్యదర్శిగా ఉన్న శాంతికుమారి టిఎస్ ఐపాస్ ఇండస్ట్రీ ఛేజింగ్ సెల్ సిఇఒగా బాధ్యతలు చూస్తున్నారు. మంగళవారం జరిగిన ఐఎఎస్ అధికారుల బదిలీల ప్రక్రియతో శాంతికుమారి సిఎం కార్యాలయ ముఖ్య కార్యదర్శి బాధ్యతలతో పాటు వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ విభాగం ముఖ్య కార్యదర్శిగా కూడా వ్యవహరించనున్నారు. రఘునందన్‌రావు పదోన్నతితో త్వరలో సిఎంఒలోకి వెళ్ళడానికి మార్గం సుగమమైనట్లు సమాచారం. ఇండస్ట్రీ ఛేజింగ్ సెల్ బాధ్యతలను అప్పజెప్పనున్నట్లు వార్తలు వెలువడుతున్నా సిఎం తీసుకునే నిర్ణయంతో స్పష్టత లభిస్తుంది.

వచ్చే ఎనిమిది నెలలు ఎంతో కీలకం



మన తెలంగాణ/హైదరాబాద్: రాబోయే ఎనిమిది నెలల కాలం ఇరిగేషన్ శాఖకు అత్యంత కీలకమని నీటిపారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ప్రతి గంట విలువైనదని, నిర్దేశించిన లక్ష్యాలు పూర్తిచేయాలని మంత్రి ఇంజనీర్లకు సూచించారు. నీటిపారుదల శాఖ 2018 క్యాలెండర్‌ను మంత్రి బుధవారం జలసౌధలో ఆవిష్కరించారు. పదహారు నెలల్లో చేయాల్సిన పనులను ఎనిమిది నెలల్లో చేయడానికి ఇరిగేషన్ అధికార యంత్రాంగం నడుం బిగించాలని కోరారు. తెలంగాణ వస్తే నీళ్లు వస్తాయని రైతులు ఆశతో ఎదురుచూస్తున్నారని, ప్రజలను నిరుత్సాహపర్చవద్దని చెప్పారు. భవిష్యత్తులో కాళేశ్వరం వంటి భారీ ప్రాజెక్టులు నిర్మించే అవసరం, అవకాశం రాదని, కాళేశ్వరం పనుల వేగాన్ని స్ఫూర్తిగా తీసుకొని మిగతా ప్రాజెక్టుల్లో పనుల వేగం పెంచాలని సూచించారు. లక్షలాది మంది రైతుల జీవితాల్లో వెలుగు నింపే జలసంకల్పంలో భాగస్వాములైనందుకు ప్రస్తుత ఇరిగేషన్ శాఖ ఉద్యోగులు సామాజిక బాధ్యతతో గర్వంగా పనిచేయాలని మంత్రి పిలుపునిచ్చారు. ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ ఎస్‌కె జోషి ఒక్కోసారి టైపిస్టుగా, సెక్షన్ క్లర్క్‌గా కూడా అవతారం ఎత్తి, ఎటువంటి అహం లేకుండా పనిచేస్తున్న తీరును స్ఫూర్తిగా తీసుకోవాలని మంత్రి కోరారు. ఎస్‌కె జోషితో పాటు ఇఎన్‌సిలు మురలీధర్‌రావు, నాగేందర్‌రావు, అనిల్, లిఫ్ట్ పథకాల సలహాదారు పెంటారెడ్డి, పలువురు సిఇలు, ఎస్ఇలు పాల్గొన్నారు.

పాతబస్తీలో మెట్రో పనులు చేపట్టాలి



మన తెలంగాణ/హైదరాబాద్ సిటీ బ్యూరో: పాతబస్తీలో వెంటనే మెట్రో రైలు నిర్మాణ పనులు చేపట్టాలని సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ డిమాండ్ చేశారు. రాష్ట్రానికి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు పాతబస్తీకి మాత్రం కాదనట్లుగా వ్యవహరిస్తున్నారన్నారు. బుధవారం సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి, నగర కార్యదర్శి ఇ.టి.నరసింహాతో కలిసి నారాయణ బుధవారం తార్నాక నుంచి అమీర్‌పేట్ వరకు మెట్రో రైల్లో ప్రయాణించారు. అనంతరం ఆయన అక్కడ మీడియాతో మాట్లాడుతూ నగర చుట్టూ మెట్రోలో ప్రయా ణిస్తుంటే పాతబస్తీలో మాత్రం ఇప్పటికీ పనులను మొదలు పెట్టకపోవడం దారుణమన్నారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో సగభాగమైన పాతబస్తీ అభివృద్ధిపై ప్రభుత్వ వివక్ష చూపితే సహించే ప్రసక్తే లేదన్నారు. ఓ రాజకీయ పార్టీ ఒత్తిళ్ల వల్లే ప్రభుత్వం పాతబస్తీలో మెట్రో రైలు పనులను పక్కన పెట్టిందని ఆరోపించారు. వెంటనే అక్కడ పనులను ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు. సిపిఐ నగర కార్యవర్గ సభ్యులు ఎం.నర్సింహ్మా, మహమ్మద్ సలీంఖాన్, రాకేశ్ సింగ్, వీరేశం, చంద్రమోహన్ ఎఐవైఎఫ్ నగర ఉపాధ్యక్షులు జి.హరినాథ్‌గౌడ్ నారాయణ వెంట మెట్రోలో ప్రయాణించారు.

పతంగులతో పాటు అంతర్జాతీయ మిఠాయిల పండుగ

మన తెలంగాణ/హైదరాబాద్: జనవరి 13 నుంచి 15 వరకు హైదరాబాద్‌లో అంతర్జాతీయ పతంగుల పండుగ జరగనుంది. గత రెండేళ్లుగా పతంగుల పండుగను నిర్వహిస్తున్నా, మూడోసారి మాత్రం ఈ పండుగకు కొంత తీపి తోడవుతోంది. సికింద్రాబాద్‌లోని పరేడ్ మైదానంలో పతంగుల పండుగతో పాటు 'అంతర్జాతీయ మిఠాయిల పండుగ'ను కూడా ప్రభుత్వం నిర్వహిస్తోంది. ఈ మేరకు అంతర్జాతీయ పతంగుల పండుగ, అంతర్జాతీయ మిఠాయిల పండుగ బ్రోచర్లను పర్యాటక శాఖ మంత్రి చందూలాల్ బుధవారం సచివాలయంలో ఆవిష్కరించారు. భారత ప్రభుత్వ పర్యాటక శాఖ, రాష్ట్ర పర్యాటక శాఖ సంయుక్తంగా ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు మంత్రి చందూలాల్ తెలిపారు. ఆడ శిశువుల సాధికారతకు ఈ రెండు అంతర్జాతీయ ఉత్సవాలను అంకితమిస్తున్నామని, 'ఆడ శిశువులను చదివించండి.. ఆమె ప్రపంచాన్ని మారుస్తుంది' అన్న నినాదంతో ఎవరెస్టు అధిరోహించిన విద్యార్థిని పూర్ణను బ్రాండ్ అంబాసిడర్‌గా ఎంపిక చేసినట్లు మంత్రి స్పష్టం చేశారు. 11 దేశాలకు చెందిన 40 మంది అంతర్జాతీయ, 40 జాతీయ కైట్ ఫ్లయర్స్ ఇందులో పాల్గొంటారని పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం తెలిపారు. ఇదేవిధంగా మిఠాయిల ఉత్సవంలో దేశ, విదేశాలకు చెందిన సుమారు 1000 రకాల స్వీట్లను నగర వాసులకు అందుబాటులోకి తీసుకువస్తున్నామని పేర్కొన్నారు. ఇతర దేశాలు, రాష్ట్రాల నుంచి వచ్చి స్థానికంగా స్థిరపడ్డ వారు స్వీట్లను తయారు చేస్తారని, సరసమైన ధరలకే అంతర్జాతీయ రుచులు అందుబాటులో ఉంటాయని వెంకటేశం అన్నారు. ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ డైరెక్టర్ సునీతా భగవత్, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, టిఎస్‌ఎండిసి ఎండి మల్సూర్ తదితరులు పాల్గొన్నారు.

సఖితో సాంత్వన

- **గృహ హింస, వరకట్న వేధింపుల బాధితులకు సర్కారు బాసట**
- **రాష్ట్రానికి మరో 8 కేంద్రాలను మంజూరు చేసిన కేంద్రం**
- **17కు చేరుకున్న 'వన్‌స్టాప్ సొల్యూషన్స్ కేంద్రాల' సంఖ్య**



మన తెలంగాణ / హైదరాబాద్ : గృహహింస దాడులు, లైంగిక వేధింపులను ఎదుర్కొంటున్న బాధిత మహిళలకు అండగా నిలిచేందుకు కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలో మరిన్ని 'సఖి వన్‌స్టాప్ సొల్యూషన్స్ సహాయత కేంద్రాలు' ఏర్పాటు కానున్నాయి. ఈ కేంద్రాలు బాధితులైన మహిళలకు తక్షణమే వైద్య చికిత్సలు అందించడంతో పాటు వారికి న్యాయపరంగానూ, భద్రతాపరంగానూ పూర్తి భరోసాను కల్పించనున్నాయి. తెలంగాణలో ఇప్పటి వరకు 9 సఖి కేంద్రాలు ఉండగా, కేంద్రం ఇటీవలే మరో ఎనిమిది కేంద్రాలను తెలంగాణకు మంజూరు చేస్తున్నట్లు తెలిపింది. దీంతో సఖి ఒన్ స్టాప్ కేంద్రాల సంఖ్య 17కు చేరుకుందని మహిళా శిశు సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు 'మన తెలంగాణ'కు తెలిపారు. తొలి దశలో సఖి కేంద్రాలు మంజూరు అయిన జిల్లాల్లో భువనగిరి యాదాద్రి, భద్రాద్రి కొత్తగూడెం, జగిత్యాల, కామారెడ్డి, నాగర్ కర్నూలు, సిద్దిపేట, మంచిర్యాల, జనగామ, నిజామాబాద్ ఉన్నాయి. సఖి కేంద్రాలను ఏర్పాటు చేసినప్పటి నుండి ఇప్పటి వరకు 2253 మంది బాధితులు సహాయం పొందారు. బాధితుల సంఖ్య అంతకంతకూ పెరుగుతుండడంతో తాజాగా రెండో విడతలో ప్రభుత్వం మరో ఎనిమిది జిల్లాల్లోనూ ఈ కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంది. ఈ కేంద్రాలు 24 గంటలూ పని చేయనున్నాయి. రెండో విడతలో ఆదిలాబాద్, కరీంనగర్, ఖమ్మం, మహబూబ్ నగర్, సంగారెడ్డి, నల్గొండ, రంగారెడ్డి, వరంగల్ జిల్లాల్లో ఏర్పాటుకానున్నట్లు అధికారులు తెలిపారు.



కేంద్రాల నిర్వహణకు అర కోటి నిధులు :

ఈ కేంద్రాల నిర్వహణకు కేంద్ర ప్రభుత్వం తొలి విడతగా రూ.33 లక్షల నిధులను కేటాయించగా, రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ మొత్తానికి తన వంతుగా మరో రూ. 20 లక్షలు జోడించి మొత్తం 53 లక్షలతో సహాయక కార్యక్రమాలను చేపట్టనుంది. మహిళలకు ఆశ్రయం కల్పించేందుకు ప్రతి జిల్లాలో కనీసం రెండు గదులు ఉన్న కార్యాలయాలను చూపించాలని జిల్లా కలెక్టర్‌లను మహిళా శిశు సంక్షేమ శాఖ కోరగా అందుకు పలు జిల్లా కలెక్టర్లు ముం దుకు వచ్చారు. రాజధాని హైదరాబాద్ నగరంలో మినహా సఖి కేంద్రా లు వస్తున్న ఇతర అన్ని జిల్లాల్లోనూ భవనాలు సమకూరనున్నాయి. ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలకు కూడా ఈ కార్యక్రమంలో భాగస్వాములైతేనే 'ఒన్ స్టాప్ కేంద్రాలు' విజ యం సాధిస్తాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. ముంబయిలో సెహత్ అనే ఒక ఎన్‌జివో సంస్థ 'దిలాసా' పేరిట సఖీ కేంద్రాలకు సహకారం అందిస్తోందని వారు గుర్తు చేస్తున్నారు. మన రాష్ట్రంలో ప్రభుత్వం ఆర్థిక సహాయం చేస్తుండగా, మహారాష్ట్రలో ముంబై మున్సిపల్ కార్పొరేషనే ఈ కేంద్రాలను నడిపిస్తోందని వారు తెలిపారు. ముంబైలో 'దిలాసా' కేంద్రాల నిర్వహణ తదితర అంశాలపై రాష్ట్రానికి చెందిన అధికార బృందం ఒకటి ఇటీవల ముంబైలో పర్యటించి వాటి పనితీరును పరిశీలించి వచ్చింది. తెలంగాణతో పాటు మధ్య ప్రదేశ్, చత్తీస్‌ఘడ్, కర్నాటక, తమిళనాడు సహా దక్షిణాదికి చెందిన 10 రాష్ట్రాల్లో సఖి కేంద్రాలఏర్పాటు అత్యవసరమని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం ఈ మేరకు ఆయా రాష్ట్రాలకు తొలి విడతగా ఆర్థిక సహకారం అందించింది. మరో వైపు తెలంగాణ ప్రభుత్వం కూడా ముంబైలో నిర్వహిస్తున్న సఖి కేంద్రాల పని తీరుపై సంతృప్తిని వ్యక్తం చేస్తోంది. ఇదే తరహాలో తెలంగాణలోనూ బాధిత మహిళలకు సంపూర్ణ తోడ్పాటు నందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొంది.

కేంద్రమంత్రులతో ఎంపి కవిత భేటీ

- **పలు అంశాలపై విజ్ఞప్తి**

మన తెలంగాణ/ న్యూఢిల్లీ: నిజామాబాద్ పార్లమెంట్ నియోజక వర్గానికి సంబంధించిన పలు అంశాలపై ఎంపి కవిత బుధవారం ఢిల్లీలో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి సురేశ్ ప్రభు, పౌర విమానయాన శాఖ మంత్రి అశోక్ గజపతి రాజులతో సమావేశం అయ్యారు. కేంద్ర వాణిజ్య శాఖ మంత్రితో జరిగిన సమావేశంలో, నిజామాబాద్ జిల్లాలోని బాల్కొండ నియోజక వర్గంలో స్పైస్ పార్క్ కోసం రాష్ట్ర ప్రభుత్వం 42 ఎకరాల భూమిని కేటాయించి, రూ. 30 కోట్లు మంజూరు చేసిందని మంత్రి సురేశ్ ప్రభుకు ఎంపి కవిత తెలిపారు. డిపిఆర్‌ను స్పైస్ బోర్డు ప్రిపేర్ చేసిందని, పనులు వేగంగా జరుగుతున్నాయని మంత్రికి వివరించారు. దీనిపై స్పందించిన కేంద్ర మంత్రి సురేశ్ ప్రభు, రాష్ట్ర ప్రభుత్వ నిధులకు తోడుగా కేంద్రం తరపున రూ. 20 కోట్లు ఇచ్చేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంపి కవిత పసుపు రైతులను ఆదుకునేందుకు చేస్తున్న ప్రయత్నాలను మంత్రి అభినందించారు. కేంద్ర మంత్రి సూచన మేరకు ఫిబ్రవరి 3న స్పైస్ బోర్డ్ చైర్మన్, వాణిజ్య మంత్రిత్వ శాఖ అధికారులు హైదరాబాద్‌కు రానున్నారు. అదే రోజు హైదరాబాద్‌లో దీనిపై ఒక వర్క్‌షాపును నిర్వహిస్తారని ఎంపి కార్యాలయ వర్గాల సమాచారం. పసుపు పండించే రైతులు, పసుపును ఎగుమతి చేసే వ్యాపారులు, పసుపు పంటతో అనుబంధం ఉండేవారు వర్క్‌షాపుకు హాజరుకానున్నట్లు సమాచారం. తెలంగాణలో పసుపు రైతులను ఆదుకునేందుకు స్పెషల్ టర్మరిక్ సెల్‌ను ఏర్పాటు చేస్తారని, ఈ సెల్‌ను ఫిబ్రవరిలో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి సురేశ్ ప్రభు ప్రారంభిస్తారని ఎంపి కవిత కార్యాలయం బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నది. ఈ సెల్ ద్వారా రైతులకు నాణ్యమైన పసుపు వంగడాలు, పంట చేతికి వచ్చిన తరు వాత ప్రాసెస్ చేసేందుకు రైతులకు బాయిలర్ లను అందజేసేందుకు నాబార్డ్‌ను కోరతామని మంత్రి సురేశ్ ప్రభు ఎంపి కవితకు స్పష్టం చేసినట్లు సమాచారం. పసుపు రైతులకు మేలు చేసేందుకు పంటకు మంచి ధర వచ్చేలా కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రిత్వ శాఖతో సంప్రదించి సంయుక్తంగా కార్యాచరణ రూపొందిస్తామని ఎంపి కవితకు మంత్రి ప్రభు హామీ ఇచ్చినట్లు సమాచారం. పసుపు రైతులను ఆదుకునేందుకు ముందుకు వచ్చిన మంత్రి సురేశ్ ప్రభుకు ఎంపి కవిత ధన్యవాదాలు తెలిపారు.

ప్రతి నెల 1 నుంచి 15వ తేదీ వరకు

రేషన్ సరుకుల పంపిణీ

- **16 నుంచి 18 వరకు డిడిలకు గడువు**
- **త్వరలో పంపిణీలో కీలక మార్పులు**



మనతెలంగాణ/హైదరాబాద్ : ప్రతి నెల 1వ తేదీ నుంచి రేషన్ దుకాణాల ద్వారా సరుకుల పంపిణీ జరిగేలా పౌరసరఫరాల శాఖ కొత్త సంవత్సరంలో కీలక మార్పులు చేసింది. ఇందుకోసం సరుకుల రవాణా తేదీల్లో. క్లోసింగ్ బ్యాలెన్స్(సిబి), రిలీజ్ ఆర్డర్(ఆర్ఒ)లో మార్పులు చేసింది. ఇ–పాస్ అమలవుతున్న 25 జిల్లాల్లో ఈ విధానం తక్షణం అమలులోకి వస్తుందని పౌరసరఫరాల శాఖ కమిషనర్ సి.వి.ఆనంద్ తెలిపారు. 1 నుంచి 15వ తేదీ వరకు సరుకుల పంపిణీ, 16వ తేదీ నుంచి పౌరసరఫరాల శాఖ కేంద్ర కార్యాలయం నుంచి జిల్లాలకు సరుకుల కేటాయింపులు జరుగుతాయన్నారు. ఇందుకోసం ప్రతి నెల 16వ తేదీ నుంచి 18వ తేదీ వరకు డీలర్లు 'మీ సేవ' కేంద్రాల్లో డిడిలు కట్టడానికి తుది గడువుగా విధించినట్లు చెప్పారు. ఈ తేదీల్లో డిడిలు కట్టిన డీలర్ల రిలీజ్ ఆర్డర్‌లను స్థానిక ఎపిఎస్ఒ/ఎంఆర్‌ఒలు సంబంధిత మండల స్థాయి నిల్వ కేంద్రానికి వెంటనే పంపించాలన్నారు. రిలీజ్ ఆర్డర్లు అందుకున్న వెంటనే గోదాం ఇంఛార్జ్‌లు సరుకుల పంపిణీ ప్రక్రియ ప్రారంభిస్తారని, దీని ప్రకారం 16 నుంచి 30వ తేదీలోపు స్టేజ్–2 రవాణాదారులకు మండల స్థాయి నిల్వ కేంద్రాల నుంచి రేషన్ షాపులకు చేరవేస్తారని పేర్కొన్నారు. స్టేజ్–1 రవాణా కాంట్రాక్టర్లు పౌరసరఫరాల సంస్థ మండలస్థాయి గోదాములకు ప్రతి నెల 1వ తేదీ నుంచి 15వ తేదీలోపు సరుకులు రవాణా చేస్తారని తెలిపారు.

సంక్రాంతికి ప్రత్యేక బస్సులు/రైళ్లు

- **3262 బస్సులు, 84 రైళ్లు ఏర్పాటు**



మన తెలంగాణ / హైదరాబాద్ : సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రయాణికుల సౌకర్యార్థం ఈ నెల 10 నుంచి 13వ తేదీ వరకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు 3262 ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు టిఎస్‌ఆర్‌టిసి ప్రకటించింది. హైదరాబాద్, సికింద్రాబాద్ నుంచి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు 1910 బస్సులను, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రాంతాలకు 1352 బస్సులు నడుస్తాయని ఆర్‌టిసి రంగారెడ్డి రీజినల్ మేనేజర్ యాదగిరి చెప్పారు. ఎంజిబిఎస్‌లో బుధవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రత్యేక బస్సులలో సీట్ల కోసం ఆన్‌లైన్ రిజర్వేషన్ సదుపాయాన్ని కల్పించినట్లు తెలిపారు. పండుగ సందర్భంగా ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా శివారు ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులు నడుస్తాయన్నారు. కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాల వైపు వెళ్లే బస్సులను జూబ్లీ బస్‌స్టేషన్ నుంచి, కర్నూల్, అనంతపూర్, కడప, చిత్తూరు, ఒంగోలు, మాచర్ల, నెల్లూరు వైపు వెళ్లే బస్సులను సిబిఎస్ నుంచి నడుస్తాయన్నారు. యాదగిరిగుట్ట, జనగాం, వరంగల్ వైపు వేళ్లే బస్సులు ఉప్పల్ కూడలి, ఉప్పల్ బస్ స్టేషన్ నుంచి, మిర్యాలగూడ, నల్లగొండ, కోదాడ, సూర్యాసపేట ప్రాంతాల వైపు బస్సులు దిల్‌సుఖ్‌నగర్ నుంచి నడుస్తాయని ఆయన వివరించారు. కూకుట్‌పల్లి, ఎల్‌బి నగర్, లింగంపల్లి, చందానగర్, ఇసిఐఎల్, ఎస్ఆర్ నగర్, అమీర్‌పేట్, టెలీఫోన్, దిల్‌సుఖ్‌నగర్ తదితర ప్రాంతాలలోని సమీపంలో గల ముఖ్యమైన పాయింట్ల నుంచి కూడా ప్రత్యేక బస్సులు వెళతాయన్నారు. విజయవాడ, ఖమ్మం జిల్లాల వైపు వెళ్లే బస్సులు ఎంజిబిఎస్ నుంచే నడుస్తాయని ఆయన స్పష్టం చేశారు. ఈ నెల 10న 487 బస్సులు, 11న 840 బస్సులు, 12న 1265 బస్సులు, 13న 643 బస్సులను నడపనున్నట్లు ఆయన వివరించారు. సుమారు 200 కిలో మీటర్లు దాటే ప్రత్యేక బస్సుల్లో 50 శాతం అదనపు ఛార్జీలను వసూలు చేయనున్నట్లు ఆయన చెప్పారు. ప్రత్యేక బస్సులకు సంబంధించిన సమాచారం కోసం ప్రయాణికులు ఎంజిబిఎస్–8330933419, జూబ్లీబస్ స్టేషన్ –040 2780 2203, సిబిఎస్ – 9241448891 నెంబర్లతో పాటు స్థానిక ఆర్‌టిసి ఎజెంట్లకు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని ఆయన వివరించారు.



అదనపు రైళ్లు : సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రయాణికుల అదనపు రద్దీ దృష్ట్యా వివిధ ప్రాంతాలకు 84 ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సిఆర్) ప్రకటించింది. తిరుపతి – విశాఖపట్నం – తిరుపతి (నెం.07487 / 07488) మధ్య ఈ నెల 7 నుంచి ఫిబవరి 26వ తేదీ వరకు 16 రైలు సర్వీసులను, కాచిగూడ – విశాఖపట్నం (నెం.07016) మధ్య ఈ నెల 6 నుంచి ఫిబవరి 27 వరకు 4 సర్వీసులను, విశాఖపట్నం – తిరుపతి (నెం.07479) మధ్య ఈ నెల 7 నుంచి ఫిబ్రవరి 28 వరకు 4 సర్వీసులను నడపనున్నారు. తిరుపతి – కాచిగూడ (నెం.07146) మధ్య ఈ నెల 8 నుంచి మార్చి 1వ తేదీ వరకు 4 సర్వీసులను, హైదరాబాద్ – విశాఖపట్నం – హైదరాబాద్ (నెం.07148) మధ్య ఈ నెల 10 – 13 తేదీల్లో 4 సర్వీసులు నడుస్తాయి. సికింద్రాబాద్ – దర్భాంగ – సికింద్రాబాద్ (నెం.07007 / 07008) ఈ నెల 3 నుంచి ఏప్రిల్ 3వ తేదీ వరకు 34 సర్వీసులు, హైదరాబాద్ – రాక్సల్ – హైదరాబాద్ (నెం. 07005 / 07006) మధ్య ఈ నెల 4 నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు 18 ప్రత్యేక రైలు సర్వీసులను నడపనున్నట్లు ఎస్‌సిఆర్ సిపిఆర్ఓ ఎం. ఉమాశంకర్ కుమార్ ఒక ప్రకటనలో వివరించారు.

అండర్ పాస్ రోడ్డు ప్రారంభం



- **రూ. 44.30 కోట్లతో నిర్మాణం**
- **నగరంలోని 18 ప్రాంతాల్లో అభివృద్ధి : కెటిఆర్**

మన తెలంగాణ/ హైదరాబాద్/ మాదాపూర్ : హైదరాబాద్ నగరాన్ని అభివృద్ధి బాటలో నడిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం అహర్నిశలు శ్రమిస్తుందని రాష్ట్ర మున్సిపల్, ఐటి శాఖమంత్రి కెటి రామారావు అన్నారు. బుధవారం మాదాపూర్ డివిజన్ పరిధిలోని అయ్యప్ప సొసైటీ రూ. 44.30 కోట్లతో నిర్మించిన అండర్ పాస్ రోడ్డును హోంమంత్రి నాయిని నర్సింహరెడ్డి, రవాణ శాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, గ్రేటర్ మేయర్ బొంతు రామ్మోహన్‌లతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రేటర్ హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చే విధంగా పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతుందన్నారు. నగరం అభివృద్ధిలో భాగంగా ఎస్‌ఆర్‌డిపి పనులను నాలుగు దశలుగా చేసి మొత్తం 23వేల కోట్ల రూపాయలతో పనులు రూపొందించడం జరిగిందన్నారు. ప్రస్తుతం 3200 కోట్ల రూపాయలతో పనులు వివిధ దశల్లో అమలులో ఉన్నాయని ఆయన తెలిపారు. నగరంలో 18 ప్రాంతాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. మొత్తం 111 కిలో మీటర్లు మేర ఎలివేటెడ్ కారిడార్‌లు 2018 చివరి కల్లా మొత్తం పూర్తి చేయడానికి ఏర్పాట్లు చేయడం జరుగుతుందన్నారు. అయ్యప్ప సొసైటీ అండర్ పాస్‌కు 12 నెలల సమయం ఉంటే 9 నెలల్లోనే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. మైండ్ స్పేస్ అండర్ పాస్ పనులు సెప్టెంబర్ నెల వరకు పూర్తి చేయడం జరుగుతుందన్నారు. బయోడైవర్సి ఫ్లైఓవర్ బ్రిడ్జి వచ్చే సంవత్సరంలో పనులు పూర్తి చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. అనంతరం పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్ నగరం చుట్టు ప్రక్కనున్న రంగారెడ్డి జిల్లాలో ప్రజలు, రద్దీ ఎక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి అండర్ పాస్‌ల నిర్మాణం చేయాలని ఆయన అన్నారు. మెట్రో ద్వారా మన నగరానికి ప్రపంచ స్థాయి గుర్తింపు రావడంతో మెట్రో స్టేషన్‌లకు వివిధ ప్రాంతాల నుంచి మొత్తం 200 ల బస్సులు నడపడం జరుగుతుందని ఆయన తెలిపారు.అనంతరం ప్రాజెక్ట్ అనుకున్న సమయం కంటే 3 నెలల ముందే పూర్తి చేసిన ప్రాజెక్ట్ అధికారులు చీఫ్ ఇంజనీర్స్ శ్రీధర్, కృష్ణ, రవీందర్, ప్రసాద్, జాకిర్ హుస్సేన్, పెయింటర్ రఘు, సంధ్య, మనోహర్‌లను మంత్రి సన్మానించారు.



ఇరిగేషన్ శాఖ మంత్రి హరీశ్‌రావును బుధవారం నాడు జలసౌధలో ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, సభ్యులు రాంబాల్ నాయక్ మర్యాదపూర్వకంగా కలిశారు. –మన తెలంగాణ/హైదరాబాద్



"మూర్ఖులకు, ఉన్మాదులకు తమ మీద తమకు ఎప్పుడూ అచంచల విశ్వాసం ఉండగా, వివేకవంతులకు అన్నీ సందేహాలుండటమే మొత్తం ప్రపంచం సమస్య. – బెట్రండ్ రస్సెల్, ఇంగ్లీషుతత్త్వవేత్త"

ఎన్నికల బాండ్లు వచ్చేసాయి!

సంపాదకీయం

రాజకీయ పార్టీలకు వ్యక్తులు, సంస్థల విరాళాలను పారదర్శకం చేస్తామంటూ ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ గత బడ్జెట్‌లో చేసిన ప్రకటనకు కార్యాచరణ రూపమిస్తూ ఎన్నికల బాండ్ల ఎల్లలను మంగళవారం ప్రకటించారు. ప్రధాన రాజకీయ పార్టీలు ఎన్నికల్లో విచ్చలవిడిగా డబ్బు ఖర్చు చేస్తూ అవినీతి మార్గాలకు పాల్పడుతున్నందున ఎన్నికల ప్రక్రియ వక్రీకరణకు గురవుతోంది. బడా పారిశ్రామిక సంస్థలు అధికారంలో ఉన్న పార్టీలను బట్టి తమ నల్లధనాన్ని, కొంత తెల్లధనాన్ని దామాషా పద్ధతిలో పంచిపెడుతుంటాయి. బిజెపి అధికారంలోకి వచ్చాక దాని వాటా భారీగా పెరిగింది. కాంగ్రెస్‌కు విరాళాల ఆదాయం భారీగా కోతకు గురైంది. రాజకీయ విరాళాలను కొంతమేర పారదర్శకం చేసేందుకై ఎన్నికల కమిషన్ విజ్ఞప్తి మేరకు ఇదివరకే కొన్ని మార్గదర్శకాలు అమలులో ఉన్నాయి. వాటి ప్రకారం, రూ.20వేలకు పైబడిన విరాళాల మూలాలను ఆదాయపు పన్ను శాఖకు తెలిపి పన్ను మినహాయింపు పొందాలి. రూ.20 వేల లోపు విరాళాలను కూడా లెక్కల్లో చూపి ఐటి మినహాయింపు పొందాలి. అయితే ఈ విరాళాలకు మూలాలు అంటే దాతల పేర్లు వెల్లడించాల్సిన పనిలేదు. అయితే రాజకీయ పార్టీ నిధులకు మరింత పారదర్శకత, జవాబుదారీతనం తెచ్చేందుకుగాను రూ.2000, ఆ పైబడిన విరాళాలకు కూడా మూలాలు వెల్లడించటం మంచిదని ఎన్నికల కమిషన్ కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేయగా, ఆర్థికమంత్రి గత బడ్జెట్ ప్రసంగంలో, ఎన్నికల్లో అవినీతి సొమ్మును అంతం చేసేందుకై ఆ సూచనను ఆమోదిస్తున్నట్లు ప్రకటించి హర్షధ్వానాలు పొందారు. అప్పుడే ప్రకటించారీ ఎన్నికల బాండ్ల పథకాన్ని. ప్రభుత్వం ఇప్పుడు నోటిఫై చేసిన ఆ పథకం ప్రకారం, దాతలు నగదు బదులు బాండ్ల రూపంలో విరాళం అందచేయాలి. రూ.1000, రూ.10,000, రూ.1లక్ష, రూ.10లక్షలు, రూ.1కోటి ముఖ విలువతో బాండ్లు ఉంటాయి. రాజకీయ విరాళాలిచ్చే దాతలు తమ బ్యాంకు ఖాతాల నుంచి బాండ్లను కొనుగోలు చేసి ఏ పార్టీకి ఎంత ఇవ్వదలిస్తే ఆ మేరకు బాండ్లు ఇవ్వవచ్చు. రాజకీయ పార్టీలు ప్రత్యేక ఖాతా తెరిచి, 15 రోజుల్లో ఆ బాండ్లను తమ ఖాతాలో జమచేయాలి. ఆ బాండ్లపై దాత పేరు ఉండదు. అయితే ఎవరైనా సరే 'నో యువర్ కస్టమర్' రూల్సు పాటించి తమ బ్యాంక్ ఖాతాలోని నిల్వ సొమ్ము నుంచి బాండ్లు కొనుగోలు చేయాలి కాబట్టి ఏ వ్యక్తి, ఏ సంస్థ ఎంత విలువ బాండ్లు కొన్నదో బ్యాంకుకు తెలుస్తుంది. కాని ఆ సమాచారం ఆటోమేటిక్‌గా ఐటి వారికి వెళ్లదు. బాండ్ల కొరకు వెచ్చించిన సొమ్ము కంపెనీ బ్యాలెన్స్‌షీట్‌లో చూపబడుతుంది. ఇందులో బదిలీ అయ్యేదంతా తెల్లధనమే అయినందున కావలసినంత పారదర్శకత ఉంటుందన్నది ప్రభుత్వ అంచనా. అయితే ఇది పూర్తిగా పారదర్శకమా?నల్లధనం పాత్ర అంతమవుతుందా?


ఏ దాత ఏ పార్టీకి ఎంత విరాళమిచ్చాడో తెలిసే అవకాశం లేనందున, ఇప్పుడున్న కొద్దిపాటి పారదర్శకత కూడా లేకుండా పోతుందని మాజీ ఎన్నికల ప్రధానాధికారి ఒకరు అభిప్రాయపడినట్లు ఒక పత్రిక వార్త. పైగా దాతలు ప్రభుత్వంనుంచి వేధింపులకు గురయ్యే అవకాశముంది. దాతలపేర్లు బ్యాంకులో లభ్యమవుతాయి. కాబట్టి, ఎవరు బాండ్లు కొన్నారో, ఏ పార్టీకి ఇచ్చారో తెలుసుకునే అవకాశం ఆర్థిక శాఖ వారికి ఉంటుంది. ఆ సమాచారాన్ని ఉపయోగించుకుని పాలక పార్టీవారు ప్రతిపక్ష పార్టీలకు ఎక్కువ విరాళమిచ్చిన దాతలను వేధించే అవకాశం ఉంటుంది. ఆ కారణాన ప్రతిపక్షాలకు విరాళాల మొత్తం తగ్గిపోవచ్చునన్నది బలమైన సందేహం. పూర్తిగా తెల్ల ధనమే విరాళంగా ఇచ్చేటప్పుడు చెక్కుద్వారా చెల్లింపును కంపల్సరీ చేయవచ్చు కదా లేదా పార్టీ ఖాతాకు ఆన్‌లైన్‌లో బదిలీ చేయవచ్చు కదా–ఈ బాండ్ల చికాకు ఎందున్నది మరో సందే హం.

అయితే నల్లధనం పాత్ర లేకుండా పోతుందనేది భ్రమ. కంపెనీలు, వివిధ వ్యాపార తరగతులు, అధికారంలోని రాజకీయ నాయకులు నల్లధనం ఆర్జించటం మానుకున్నప్పుడే అది సాధ్యం. ఏమైనా, ఇదొక ప్రయోగం. నిజం నిలకడమీద తెలుస్తుంది.

ఇతరులు పైకి, మనం కిందికి

చూపు

దేశ ఆర్థిక వ్యవస్థకు గట్టి దెబ్బ తగిలిన సంవత్సరంగా 2017 జ్ఞాపకాలలో మిగిలిపోతుంది. ఆ దెబ్బ చాలా తీవ్రమైనది, స్వయం కృతమైనది కూడా. అందువల్ల స్థూల దేశీయ ఉత్పత్తి (జిడిపి) వృద్ధిలో మాంద్యం నెలకొంది. ఈ సరికే తిరోగమనంలో ఉన్న నూతన ఉద్యోగాల కల్పన మరింత క్షీణించింది. ప్రధాని నరేంద్ర మోడీ, ఆర్థిక మంత్రి జైట్లీ ఈ పరిస్థితిని ఒక పీడకలగా భావించి కలలో కూడా భవిష్యత్తులో మళ్లీ ఈ స్థితి రాకూడదని కోరుకొంటున్నారు. కానీ వ్యవస్థ క్షీణతకు గాను 2017 గుర్తుకువస్తూనే ఉంటుంది. వ్యవసాయ ఆదాయాలలో క్షీణత నోట్ల రద్దు తరువాత 2017లో మరింతగా తీవ్రమయింది.



2017 మొదట్లో రబీకాలంలో అన్ని పంటలకూ 30–40 శాతం ధరలు పడిపోయి రైతుల ఆదాయం పతనమైంది. ఈ పరిస్థితికి సంతల్లో వర్తకుల వద్ద నగదు కొరతే ముఖ్యకారణం. నోట్ల రద్దు వల్ల ఎటిఎంలు సరిగా పనిచేయక చాలాకాలం పాటు వర్తకుల వద్ద నిధులు లేకుండాపోయాయి. దాని ప్రభావం 2017లో కూడా బలంగా ఉంది. వ్యవసాయదారుల ఆదాయం దెబ్బతింటే రాజకీయంగా ఎంత నష్టం జరుగుతుందో 2002లో సౌరాష్ట్రలో బిజెపి ప్రభుత్వానికి తెలిసి వచ్చింది. అప్పుడు పటీదార్ల పట్టులోని మధ్యతరగతి రైతులు చాలామంది ఆగ్రహంతో మోడీకి వ్యతిరేకంగా ఓటు చేశారు.

'ఈసారి ఎంత కష్టంతో గుజరాత్‌లో గెలిచానో నా ఒక్కడికే తెలుసు' అని మోడీ అప్పట్లో తన పార్లమెంటు సభ్యుల సమావేశంలో అన్నారు కూడా. అయితే గుజరాత్‌లో కుల రాజకీయాలను రూపుమాపడానికి తమ పార్టీ 30ఏళ్లపాటు కృషి చేసిందని కూడా ఆయన కితాబు ఇచ్చుకున్నారు. మధ్య భారత్, పశ్చిమ భారత్, ఉత్తర భారత్‌లో మధ్యతరగతి రైతులోకం విడవకుండా ప్రభుత్వంపై తిరుగుబాటు సాగిస్తున్న విషయాన్ని గుర్తించనట్లే మోడీ మాట్లాడ్డం మామూలై పోయింది.2014లో ఆ ప్రాంతాల్లోనే బిజెపికి 90% సీట్లు వచ్చాయి.

రైతుల తిరుగుబాటు పట్టని సర్కార్

అయితే వాస్తవం ఏమిటంటే మధ్యతరగతి కులాల రైతులు సంఘీభావంతో వ్యవహరిస్తూ, తమ డిమాండ్లను ఎలుగెత్తి చాటడానికి సంఘాలు కడుతున్నారు. మహారాష్ట్రలోని మరాఠ్వాడా ప్రాంతంలో, పశ్చిమ ఉత్తరప్రదేశ్, రాజస్థాన్‌లలో కూడా అదే జరుగుతోంది. రాజస్థాన్‌లో ఇటీవల జరిగిన స్థానిక ఎన్నికల్లో రైతులు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కీలకమైన చిన్నచిన్న సమూహాలవారు బిజెపికి వ్యతిరేకంగా ఓటు చేశారు. తమ ఆగ్రహా న్ని వారు అలా వ్యక్తీకరించారు. 2014 లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి ఓట్ల శాతం ఆ రాష్ట్రంలో దాదాపు 56 శాతం కాగా స్థానిక ఎన్నికల్లో అది 15 శాతాని కి పడిపోయింది. ఫలితంగా అక్కడ బిజెపికంటే కాంగ్రెస్ చాలా సీట్లలో గెలిచింది. అలాగే ఉత్తరప్రదేశ్‌లో నగర పంచాయత్‌లకు ఇటీవల జరిగిన ఎన్నికల్లో బిజెపికి 13శాతం కంటే తక్కువ ఓట్ల వాటా దక్కిం ది.

జాట్ రైతుల ఆధిక్యతలోగల పశ్చిమ యుపిలో ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్ స్వయంగా ఎంపిక చేసిన అభ్యర్థులు ఓడిపోయారు. వారు ఇండిపెండెంట్లు, ప్రతిపక్ష అభ్యర్థుల చేతుల్లో ఓడిపోవడం కీలకం. 2014లో జాట్‌లు బిజెపి వెంట నిలిచారు. ఇప్పుడు బిజెపికి తన పాలనలోగల అనేక రాష్ట్రాల్లో ఎదురుగాలి వీస్తోందని చెప్పకతప్పదు. అయితే ఈ నిజాన్ని ప్రధాని గ్రహించవలసి ఉంది. అలా గ్రహించి ఉంటే ఎంతో ఆందోళన చెంది, ఆ పరిస్థితికి కారణాలను ఆయన శోధించాలి. 2017లో వ్యవసాయ ఆదాయాలు క్షీణించడం భారీ ఎత్తున చోటు చేసుకుంటోంది. దీనికి నోట్ల రద్దు అనంతర ప్రభావాలే ముఖ్య కారణం.

2017లో ఆర్థికానికి నోట్ల రద్దు దెబ్బ

రెండు ఏళ్లపాటు దుర్భిక్షాన్ని చవిచూసిన వ్యవసాయ రంగం అప్పుడే కోలుకుంటున్న పరిస్థితిలో నోట్ల రద్దును 2016 నవంబర్‌లో మోడీ ప్రకటించి, తిరిగి దానిని పాతాళంలోకి నెట్టారు. 2017 తొలి ఆరు నెలలలో దాని ప్రభావం హెచ్చుగా కనపడింది. బిజెపి పాలనలో కనీస మద్దతు ధరల పరిస్థితి కూడా తగిన విధంగా లేదు. అందువల్ల రైతుల ఆదాయం మెరుగుపడే పరిస్థితి కనపడడం లేదు. ద్రవ్యోల్బణానికి సరితూగేలా కనీస మద్దతు ధరలు ఉండడం లేదు. చాలాభాగం రైతు ఉత్పత్తులు కనీస మద్దతు ధరల వెలుపలే ఉన్నప్పటికీ రైతు ఆదాయం వృద్ధిలో అది కీలకపాత్ర పోషిస్తోంది. మరిన్ని పంటలకు దానిని వర్తింప చేయాల్సిన అవసరం ఉంది.

ఏప్రిల్–జూన్ త్రైమాసంలో జిడిపి వృద్ధి ఎన్నడూ లేనంత తక్కువగా 5.7శాతం మాత్రమే ఉంది. ఇది ఆర్థిక వ్యవస్థ మొత్తాన్ని వ్యతిరేకంగా ప్రభావితం చేసిన అంశం. వ్యవసాయ రంగం కనాకష్టంగా కొనసాగుతుండడంతో గ్రామీణ ప్రాంతాల్లో సరకులకు గిరాకీ పెరిగే పరిస్థితి ఇప్పట్లో రాదు. అందువల్ల గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత దిగజారుతుంది. జులై–సెప్టెంబర్ త్రైమాసంలో జిడిపి కొద్దిగా కోలుకొన్నప్పటికీ (6.2 శాతం)గ్రామీణ వ్యవస్థకు ఒరిగేదేమీ ఉండదని స్పష్టం అవుతోంది. భవిష్యత్తులో మరింత సమాచారం వచ్చాక జిడిపి రేట్లను సవరించవలసి ఉంటుందని గణాంక నిపుణులు తెలిపారు. వస్తూత్పత్తి రంగం, లక్షలాది చిన్న కంపెనీల వివరాలు అందడానికి కొంత సమయం పడుతుంది.

2017తొలి త్రైమాసంలో ఆ రంగాల అమ్మకాల్లో 50శాతం దాకా తగ్గుదల కనపడుతున్నట్లు ఆర్‌బిఐ (భారత రిజర్వు బ్యాంకు) పేర్కొంది. పూర్తి సమాచారం అందాక జులై– సెప్టెంబర్ జిడిపి శాతం మరింత తగ్గవచ్చు. ఇది సరకులు, సేవల పన్ను (జిఎస్‌టి)అమలులోకి రాని ముందునాటి నేపథ్యం.

జిఎస్‌టి సంబంధిత అయోమయం వల్ల జిడిపి లెక్కకట్టే పద్ధతి సరిగా లేకుండాపోయింది. చిన్న వాణిజ్య కేంద్రాలు, హోటళ్లు, రెస్టారెంట్లతో కూడిన సేవలరంగంలో వృద్ధి ఉన్నట్లు చూపడానికి పెట్రోలియం ఉత్పత్తులపై రాష్ట్రాలు వసూలు చేసిన వ్యాట్‌ను కేంద్ర గణాంక కార్యాలయం(సిఎస్‌ఒ) వాడడంతో జిడిపి పెరిగినట్లు కనపడింది. జిడిపిలో తాజాగా కనపడిన వృద్ధి నిలకడగా ఉండదని నిపుణులు చెబుతున్నారు. ఈ పరిస్థితిలో వాస్తవాలకు అనుగుణంగా దిద్దుబాటు చర్యలను ప్రభుత్వం తీసుకోవాల్సి ఉంది.

* ఎం.కె.వేణు

కమల్, పవన్ 'చెరుపుతురుపులు'



బి.టి.గోవిందరెడ్డి,
సీనియర్ జర్నలిస్ట్

చక్ నోరిస్ హాలీవుడ్ దిగ్గజ నటుల్లో ఒకరు. బ్రూస్ లీతో సమవుజ్జీ అనదగ్గ మార్షల్ ఆర్ట్స్ నిపుణుడు. అమెరికా ఎయిర్ ఫోర్స్‌లో పని చేసిన వెటరన్. ఎట్లా మొదలైందో కానీ మానవమాత్రులకు సాధ్యం కానివన్నిటినీ చక్ నోరిస్‌కు అంటగట్టి ఇంటర్నెట్‌లో, సోషల్ మీడియాలో పెట్టడం, ఆయన కూడా వాటిని ఆస్వాదించడం నవ్వులు పూయిస్తుంది. ఆయన ఒకసారి సముద్రపు ఇసుకతో మేడలు కట్టే పోటీలో పాల్గొన్నారట. అతని ఇంజనీరింగ్ నైపుణ్యం చూసి మిగతా పోటీదారులంతా తమ పనిని వదిలేసి నోరిస్ కు సహాయం చేశారట. అట్లా నిర్మించిందే ఈజిప్టులోని గ్రేట్ పిరమిడ్ ఆఫ్ గీజా అని చెబుతారు. అర్థమైంది కదా ప్రపంచ వింతల్లో ఒకటి, క్రీస్తు పూర్వం 2560 ప్రాంతంలో నిర్మించిన గీజాను బీచ్ ఇసుకతో చక్ నోరిస్ కట్టాడట. ఇట్లా ఉంటాయి ఆయనపై సృష్టించిన సరదా కథనాలు. నిత్యం ఊహల్లో జీవిస్తూ తమను తాము సూపర్ హ్యూమన్లుగా, తమ శక్తిని అమేయమైనదిగా భావించే వారికి 'చక్ నోరిస్ సిండ్రోమ్' ఉందని అంటుంటారు. అది ఉన్నవారు యుక్తివిరుద్ధం (illogical)గా, తెలివిలేకుండా(irrational) ఆలోచనలు చేస్తారట. ఇదంతా ఎందుకు చెప్పాల్సి వచ్చిందంటే మన దక్షిణాది నటుల్లో ముగ్గురికి 'చక్ నోరిస్ సిండ్రోమ్' సోకిందేమో అని వారు చేసే ప్రకటనలు, వేస్తున్న అడుగులను బట్టి అనుకోవాల్సి వస్తుంది. ఆ ముగ్గురూ ఎవరంటే పవర్ స్టార్‌గా అభిమానులు పిలుచుకునే పవన్ కళ్యాన్, తమిళ సూపర్ స్టార్ రజనీకాంత్, సిల్వర్ స్క్రీన్ నిత్య ప్రయోగశీలి కమల్ హాసన్. సినీ రంగంలో తమకున్న పాపులారిటీ రాజకీయాల్లో కూడా ఉపయోగ పడుతుందని వీరు తమను తాము ఆకాశమంత అంచనా వేసుకుంటున్నట్టు కనిపిస్తోంది. ఎంజిఆర్, ఎన్‌టిఆర్, జయలలితలు తారాపథం నుంచి ముఖ్యమంత్రి పీఠంపైకి విజయవంతంగా చేరుకోవడమే వీరికి ప్రేరణ అయిఉండవచ్చు. కానీ ఆ తర్వాత ఎన్నో ఆశలతో లక్షలమంది జన సమూహం మధ్య ప్రజారాజ్యం పార్టీ ఏర్పాటు చేసిన మెగా స్టార్ చిరంజీవి కనీసం ప్రతిపక్ష నాయకుడి హోదా కూడా దక్కించుకోలేక పోయారు. జయలలిత మొదటి సారి సిఎం కావడానికి ఎంజిఆర్ గట్టి పునాదులతో నిర్మించిన అన్నా డిఎంకె పార్టీ పనికొచ్చింది. ఆమెకు కుటుంబమంటూ లేకపోవడం, పేదలకోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడం వల్లే మళ్లీమళ్లీ సిఎం కాగలిగారు. ఇప్పుడు సినీనటులు రాజకీయాల్లోకి వచ్చినా తమకు పెద్దగా ఒరిగేదేముండదని ప్రజలు అర్థం చేసుకుంటున్న రోజులు. చిరంజీవి వైఫల్యానికి ఇతర అనేక కారణాలతో పాటు ఇదీ ఒకటయి ఉండవచ్చు. ఈ ముగ్గురు నట శిఖరాలు భ్రమలో ఉన్నట్టా? లేక తెలిసీ కొయ్యగుర్రం స్వారీ చేస్తున్నట్టా? రజనీ బిజెపితో అంట కాగుతున్నారని తెలిసిందే. కమల్ వెనక డిఎంకె ప్రయోజనాలున్నాయి. పవన్ ఆంధ్రా అధికార పార్టీ చెప్పు చేతల్లో ఉన్నారని అందరూ చెప్పుకోవడాన్ని వింటూనే ఉన్నాం.

46 ఏళ్ల పవన్ 2014 ఎన్నికలకు ముందు జనసేన పార్టీని స్థాపించి ఎపిలో అభ్యర్థులను నిలపకుండా తెలుగుదేశం–బిజెపి సంకీర్ణానికి మద్దతిచ్చారు. ఈయన సపోర్టు ఎంతవరకు పనిచేసిందో తెలియదు కాని ఆ కూటమి అధికారంలోకి రావడంతో పలుకుబడి పెరిగింది. ఇప్పుడు 2019 ఎన్నికల్లో ఎపిలో అన్ని సీట్లకు పోటీ చేస్తానని చెబుతున్నాడు. 'ఇజం' అనే పుస్తకంలో ఆయన తన ఐడియాలజీని వివరించారు. అడపాదడపా ప్రజల్లోకి వెళ్లి హడావుడి చేయడం, మళ్లీ తన షూటింగుల బిజీలో పడటం ఇప్పటి వరకు చూస్తున్నాం. ట్విట్టర్ వేదికగా నడిచే ఈ పార్టీలు, ఇటువంటి రాజకీయాలు ఎంతకాలం కొనసాగుతాయో చెప్పలేం. ఇక తమిళనాడులో జయ మరణం తర్వాత మొదట రజనీకాంత్ రాజకీయాల్లోకి వస్తున్నట్టు ప్రకటించారు. 67ఏళ్ల వయసులోనూ తమిళ సినిమాలో రజనీయే నెంబర్ వన్. భారతీయ కుటుంబ విలువలను పాటించే వ్యక్తిగా, కోట్ల రూపాయల భారి విరాళాలిచ్చిన మంచి మనిషిగా పేరుంది. చక్ నోరిస్ తరహాలో ఆయన అభిమానులు కూడా రజనీ పేరుతో సూపర్ హ్యూమన్ కథనాల్ని ప్రచారంలోకి తెచ్చారు. నల్లని రూపంతో బక్క పలచగా కనిపించే రజనీ మేకప్, విగ్గు లేకుండా బయటకు వచ్చే ఒకే ఒక్క అగ్రనటుడు. ఇంతెందుకు వినమ్రతకు మారు పేరు, ఏ భేషజాలు చూపకుండా మెలిగే బాలీవుడ్ మహానటుడు అమితాబ్ బచ్చన్ సైతం తన జంజీర్, దీవార్ సినిమాల కాలం నాటి హెయిర్ స్టయిల్‌ను పోలిన విగ్గు లేనిదే బయట కనిపించరు. అది లేకుండా ఆయన ఎట్లా ఉంటారో ఒక్క ఫోటో కూడా బయటకు రాలేదంటే తన గ్లామర్ పట్ల అమితాబ్ ఎంత జాగ్రత్త పడతారో అర్థమవుతుంది. రజనీ ఈ గ్లామర్ గోడల్ని బద్దలు కొట్టిన వ్యక్తిగా గౌరవ మర్యాదలు పొందుతున్నారు.1996లో ఆయన మద్దతుతో డిఎంకె కూటమి విజయబావుటా ఎగుర వేసింది. ఇటీవల జయలలిత మరణం తర్వాత రజనీ తను ప్రత్యక్షంగా రాజకీయాల్లోకి వస్తున్నట్టు ప్రకటించారు. జయ తర్వాత ఏర్పడిన రాజకీయ శూన్యాన్ని తనకు అనుకూలంగా మలుచుకోవచ్చని ఆయన భావిస్తున్నట్టు కనిపిస్తోంది. అన్నా డిఎంకె, శశికళ గ్రూపుల విభేదాల వల్ల లాభపడవచ్చని వీల్ చైర్లో కాచుక్కూర్చున్న కరుణానిధి నేతృత్వంలోని డిఎంకె పార్టీకి రజనీ నిర్ణయం అశనిపాతంగా మారింది. బిజెపి చేతిలో పావుగా మారి, తమిళ రాజకీయాలను శాసించాలని చూస్తున్నారని డిఎంకె మద్దతుగా ఉన్న సినీ ప్రముఖులు రజనీపై ఆరోపణలు గుప్పించారు. రజనీ అసలు తమిళుడే కాదని మహారాష్ట్రలో జన్మించి కర్ణాటకలో బస్ కండక్టర్‌గా పనిచేసిన ఆయన సినిమాల్లో సూపర్ స్టార్ అయినంత మాత్రాన తమిళుల ఆత్మను అర్థం చేసుకోలేరనే విమర్శల దుమారం రేగింది. రజనీ మాత్రం ఇవేమీ పట్టించుకోకుండా తన పని తను చేసుకుంటున్నారు.

ఇక 63 ఏళ్ల కమల్ హాసన్ ఈ మధ్య తన రాజకీయ ప్రవేశం గురించి వెల్లడించారు. రజనీ లాగానే ఆయన తన అభిమాన సంఘాలతో చర్చలు జరిపి వారిచేతే ఆ మాట అనిపించాడు. మొదటి నుంచి జయ వ్యతిరేకిగా, డిఎంకె అనుకూలుడిగా ముద్రపడిన కమల్‌వి వ్యక్తిగత జీవితం, మిగతా తమిళ నటులలాగా ప్రజలకు మేలు చేసే పనులేవి పెద్దగా చేయక పోవడం ప్రతికూల అంశాలుగా మారాయి. ఆయన నాస్తికుడు. హిందూ దేవతలను కించపర్చేలా అనేకసార్లు విమర్శలు చేశారు. భక్తి భావం మెండుగా ఉండే తమిళులకు ఇది నచ్చని విషయం. మొదట నర్తకి వాణీ గణపతి, తర్వాత హిందీ నటి సారికా ఠాకూర్‌ను వివాహం చేసుకుని విడాకులిచ్చారు. నటి గౌతమితో 9ఏళ్లు సహజీవనం చేశారు. గౌతమి కూడా ఆయన నుంచి దూరంగా ఉంటున్నారు. కమల్‌ను డిఎంకె పార్టీ ఒక 'గేమ్ స్పాయిలర్' గా వినియోగించుకుంటోందనే విమర్శలు లేకపోలేదు. రజనీ ప్రభావాన్ని తగ్గించడమో, తటస్థం చేయటమో ఆయనకు డిఎంకె ఇచ్చిన అసైన్‌మెంట్ అనే ప్రచారం కూడా ఉంది. రజనీ స్థానికుడు కాదనే ప్రచారాన్ని పెంచి కమల్ ను ప్రత్యామ్నాయంగా చూపాలనేదే స్టాలిన్ ప్లాన్‌గా కనిపిస్తోంది. సొంతంగా ఒక బలమైన ఆకాంక్ష, ఎజెండాతో సేవ చేయాలని వచ్చే వారిని ప్రజలు ఎంతో కొంత ఆదరిస్తారు. కానీ మరొకరి విజయానికి అడ్డుపడే సంకల్పమే లోపాయికారీ ఒప్పందంగా రాజకీయ పార్టీలు స్థాపించే వారు ఎక్కువ కాలం మనలేరు. కమల్, పవన్ కళ్యాణ్‌లు ఇద్దరు ఇప్పుడు గేమ్ స్పాయిలర్ బాధ్యతను మోస్తున్నట్టు కనిపిస్తున్నది.2008ఆగస్టులో చిరంజీవి స్థాపించిన ప్రజారాజ్యం పార్టీకి పవన్ యూత్ వింగ్ నాయకుడు. పది నెలల తర్వాత జరిగిన ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజారాజ్యం 18సీట్లను మాత్రమే గెల్చుకుంది. రెండు చోట్ల పోటీ చేసిన చిరంజీవి ఒక చోట ఓడిపోయారు. రెండోసారీ కాంగ్రెస్‌కు ఘనవిజయం సాధించి పెట్టిన డా.వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆకస్మిక మరణం ఆ తర్వాత ఆయన తన పార్టీని అధికార పార్టీలో విలీనం చేసి కేంద్ర మంత్రిగా ఒదిగి పోయారు. ఆ విధంగా ప్రజారాజ్యం పార్టీ అదృశ్యమై పోయింది. ఇప్పుడాయన సైరా నరసింహారెడ్డి అనే చారిత్రక ఇతిహాస సినిమా నిర్మాణంలో తల మునకలై ఉన్నారు. ఇదంతా దగ్గరుండి చూసికూడా పవన్ కళ్యాణ్ తానూ ఒక రాజకీయ పార్టీని ఆవిష్కరించడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఇప్పటి వరకు పార్టీ నిర్మాణమే లేకుండా సోషల్ మీడియా పోస్టింగులతోనే నడుస్తున్న పార్టీ పోలింగ్ బూత్ స్థాయినుంచి కార్యవర్గాలను ఏర్పాటు చేసుకోవాలంటే కనీసం రెండేళ్లు పడుతుంది. ఆయన ఆ దిశలో పెద్దగా ప్రయత్నాలు చేస్తున్నట్టూ కనబడటం లేదు. కమల్ లాగే పవన్‌కు కూడా రెండు వివాహాలు విడాకులతో ముగిసాయి. ఆయన మూడోసారి పెళ్లి చేసుకున్నారు. సినీ ఎంటర్ టైనర్లుగా ఉన్నంత కాలం అది వారి వ్యక్తిగత జీవితం అనుకోవచ్చు. ఒక్కసారి ప్రజా జీవితంలోకి అడుగుపెట్టిన తర్వాత ఇవన్నీ స్క్రూటినీ అవుతాయి. 'చక్ నోరిస్ సిండ్రోమ్' వీరిని అధికార పీఠానికి చేరువ చేస్తుందో, అగాథంలోకి తోసి వేస్తుందో చూడాలంటే మరి కొంతకాలం ఎదురు చూడాలి. రెండున్నర గంటల నిడివి సినిమాలో హీరో ఇంటర్వెల్‌కు ముందు తనే ఒక సమస్యలో చిక్కుకోవడమో, జనం అవస్థలు పడటమో చూస్తాడు. రెండో భాగంలో విలన్లను చితక తన్ని ప్రాబ్లంను సాల్వ్ చేస్తాడు. రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత జీవిత కాలమంతా అధికారంలో ఉన్నా సమస్యలు అట్లాగే ఉంటాయి. కొత్తవి పుడుతూనే ఉంటాయి. రెండున్నర గంటల్లో చూపగలిగిన పరిష్కారం పది, ఇరవై ఏళ్లయినా దొరకదు. ఇప్పటి తరానికి అంత అవకాశం, సమయం ఇచ్చే ఓపికెక్కడిది?

అంధుల చీకట్లకు వెలుగు రేఖ లూయిస్ బ్రెయిలీ...



సూరం అనిల్,
9059457045

'రవి కాంచనిది కవి గాంచును' అనేది ఆర్యోక్తి. కవితా హృదయం కలిగినవారు తమ సూక్ష్మ దృష్టితో సృష్టిలోని అందాలను, నిగూఢమైన విషయాలను వెలుగులోకి తేగలరు. ఇలా సమాజం ముందరకు వచ్చిన విషయాలన్నీ అక్షర రూపంలో ఉంటాయి. ఈ విజ్ఞానాన్ని మనం మన అమూల్యమైన నేత్రాలతో స్పృశించగలం. మన 'కన్ను'లతో ఆస్వాదించగలుగుతాం. మరి ఈ సమాజంలో విధి వంచనకు గురైన 'అంధులు' ఎందరో ఉన్నారు. (కళ్ళున్నా, సమాజంలోని వ్యక్తుల బాధలను అర్థం చేసుకోలేని మూఢులు ఉన్నారు. ఇది మరో కోణం అనుకోండి!) ఈ సృష్టి అందాలను చూడలేని నిర్భాగ్యులూ ఉన్నారు. ఇలాంటి వారందరూ నిరాశా నిస్పృహలతో కృంగిపోకుండా అంధులైన మన ఈ మిత్రుల కోసం వారి విజ్ఞాన జీవితాలకు దిక్సూచిలా, మహోన్నత గురువుల భువిపైన జన్మించాడు లూయా బ్రెయిలీ.

మహోన్నతుని గురించి :

లూయా బ్రెయిలీ ఒక ఫ్రెంచ్ విద్యావేత్త, బ్రెయిలీ లిపి సృష్టికర్త. జనవరి 4వ తేదీ 1809 వ సంవత్సరంలో పారిస్ దగ్గర లోని "క్రూవే" గ్రామంలో మోనిక్ బ్రెయిలీ, సైమన్ రెనె బ్రెయిలీలకు జన్మించాడు. లూయా తన 4వ సంవత్సరంలోనే అనుకోకుండా జరిగిన ప్రమాదంలో రెండు కళ్ళను కోల్పోయాడు. అలా అంధుడయ్యాడు. 1784వ సంవత్సరంలో స్పెయిన్ దేశానికి చెందిన ఫ్రాన్సిస్కో లూకాస్, అక్షరాలను చెక్కమీద ఉబ్బెత్తుగా ఉండేటట్లు రూపొందించాడు. ఫ్రాన్సిస్కో లూకాస్ కనుగొన్న ఉబ్బెత్తు అక్షరాల ద్వారా అంధులకు విద్యను నేర్పేటువంటి పాఠశాలను 1784వ సంవత్సరంలోనే పారిస్‌లో వాలెంటైన్ హ్యూ ప్రారంభించారు. ఈ పాఠశాలలో చదువుకునేందుకు లూయా బ్రెయిలీ వెళ్ళాడు. ఆ పాఠశాలలో చేరిన అతి తక్కువ కాలంలోనే లైన్‌టైప్ పద్ధతిలోగల చదువులో విశేష ప్రతిభను ప్రదర్శించాడు. తద్వారా తన 17వ ఏటనే తను విద్యాభ్యాసం చేసిన పాఠశాలలోనే ప్రొఫెసర్‌గా నియమించబడ్డాడు.

సాధారణ విద్యార్థుల లాంటి పుస్తకాల ద్వారా అంధ విద్యార్థులు విద్యను అభ్యసించలేరు. వారికి కేవలం స్పర్శ ద్వారానే చదువుకునే అవకాశం ఉంది కాబట్టి, ఆ స్పర్శ ద్వారానే చదువుకునేటట్లు వారి కోసం లిపిని కనిపెట్టుటకు రకరకాల ప్రయోగాలు జరిగాయి. ఇందులో గొప్ప ఆసక్తికర అంశం ఏమిటంటే, ఈ లిపి కనుగొనుటకు చేసిన కృషి భాగంలో అంధులే ఉండడం. 16వ శతాబ్దంలో పాదరస్ అనే అంధ సంగీత విద్వాంసుడు, అతని స్నేహితుడైన హెయిలీ కలిసి పేపరు మీద అక్షరాలను ఉబ్బెత్తుగా ప్రింటు చేయడం రూపొందించారు. ఇదే సమయంలో స్పెయిన్‌కు చెందిన ఫ్రాన్సిస్కో లూకాస్ ఉబ్బెత్తు అక్షరాలను కాగితం మీద కాక చెక్కపై ముద్రించాడు. ఈ రెండు అంశాలపై విశేష పరిశోధనలు జరిపిన లూయా బ్రెయిలీ 20 సంవత్సరాల వయస్సులో "ఆరు చుక్కల సంపూర్ణ నవీన ఆవిష్కరణనూ, నూతన సిద్ధాంతాన్ని అంధులకు వజ్రాయుధంగా అందించాడు. మొత్తం ఆరు చుక్కలను వివిధ రకాలుగా పేర్చుతూ.. ఇంగ్లీషు అక్షరాలను వాటి ఆకృతిని సృష్టించాడు. అలా మొత్తం 26 అక్షరాలను కనిపెట్టాడు. తద్వారా 1784 సంవత్సరంలో కనుక్కోబడి న లిపి, నూతన ఆవిష్కరణ గావించబడినందున లూయా బ్రెయిలీకే ఈ ఘనత దక్కింది.

బ్రెయిలీ ఆవిష్కరణకు బీజం :

అంతవరకు ఉన్న పుస్తకాలు అర్థం చేసుకోడానికి అంధ విద్యార్థులు వారి స్పర్శజ్ఞానాన్ని ఎక్కువస్థాయిలో వినియోగించవలసి ఉంటుందని భావించాడు. ఇందులో చాలా లోపాలున్నాయని అసహనానికి లోనయ్యాడు. వీరికోసం చాలా సులువైన మార్గమేదో ఒకటి కనుగొనాలనే సంకల్పం బలంగా నాటుకుంది. అప్పుడే అటు కాగితంగా, ఇటు చెక్కలపై రూపొందించబడిన అక్షరాలు వరుసలుగా కాకుండా చుక్కల రూపంలో గనుక అందుబాటులో ఉంటే ఆ ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు, చాలా తేలికగా అర్థం చేసుకుంటారని భావించాడు. దీనికోసమే అహర్నిశలు శ్రమించాడు.

1821 సంవత్సరంలో ఛార్లెస్ బార్బియర్ అనే సైనికాధికారి తన సైనికులు చీకట్లలో సైతం నేను పంపే సమాచారం చదువగలగాలి అనే ఉద్దేశ్యంతో 12చుక్కలతో సంకేతాలు కనిపెట్టి, చిహ్నాలతో లిపిని రూపొందించాడు. ఈ విషయం తెలుసుకున్న లూయిస్ బ్రెయిలీ ఆ 12 చుక్కలను 6 చుక్కలకు కుదించి అక్షరాలను (సంగీత బాణీలకు సంబంధించి) పదాలను, అంకెలను రూపొందించాడు. వీటికోసం బ్రెయిలీ రాత్రి, పగలు తేడా లేకుండా నిర్విరామ కృషి చేయడం వల్ల ఆయన క్షయ వ్యాధికి గురై 1852 వ సంవత్సరం జనవరి 6వ తేదీన తుదిశ్వాస విడిచారు. లూయిస్ శిష్యులు తమ గురువు రూపొందించిన లిపికి గుర్తింపునివ్వాలని ఉద్యమించడంతో ఫ్రాన్స్ ప్రభుత్వం లూయా కనిపెట్టిన లిపికి బ్రెయిలీ లిపి అని పేరుపెట్టి, ప్రతి సంవత్సరం జనవరి 4వ తేదీని ప్రపంచ బ్రెయిలీ దినోత్సవంగా జరపాలని నిర్ణయించారు. బ్రెయిలీ 43వ ఏటనే ప్రపంచాన్ని విడిచివెళ్లడం బాధాకరం. 1952లో లూయిస్ అస్తికలను పారిస్‌లోని పాంథియన్‌లోకి మార్చి మహోన్నత వ్యక్తిగా కీర్తించారు. 2009వ సంవత్సరంలో బ్రెయిలీ 200జన్మదినోత్సవ సందర్భంగా యావత్ ప్రపంచం ఆయనను స్మరించాయి. బెల్జియం, ఇటలీ దేశాలు బ్రెయిలీ బొమ్మతో రెండు యూరోల నాణాన్ని ముద్రించాయి. వీరిని స్మరిస్తూ మన భారతప్రభుత్వం కూడా 2 రూపాయల నాణాన్ని బ్రెయిల్ బొమ్మతో విడుదల చేసింది. అతి ముఖ్యమైన అమెరికా దేశం తన డాలర్‌పై బ్రెయిలీ బొమ్మను ముద్రించడం అద్భుతం.

వీరి అశేష కృషి ఫలితంగా నేడు ప్రపంచవ్యాప్తంగా లక్షలాది అంధ విద్యార్థులు హృదయంతో, వారి స్పర్శతో ఈ ప్రపంచాన్ని చూడగలుగుతున్నారు. రోజువారి దినపత్రికలు కొన్ని బ్రెయిలీ లిపిలో ప్రచురిస్తున్నాయి. ఈ చిరస్మరణీయుడూ అంధుల మనస్సులలో వారి చేతి పదివేళ్ళ కొనలలో వారి స్పర్శయై చిరకాలం వర్ధిల్లుతూనే ఉంటాడు. ఇలాంటి మహోన్నతులను ప్రతి సంవత్సరం స్మరిద్దాం. సమాజంలోని ఇలాంటి ప్రత్యేకమైన మిత్రులను ప్రతిరోజు గౌరవిద్దాం. వారికి మనస్థాయి చేయూతనందిద్దాం.



మా ఇల్లు ఓ రంగుల ప్రపంచం



ప్రకృతి సౌందర్యంతో పరవశించే కళాకారుల అంతరంగాల్లో అనేక భావాలు దాగిఉంటాయి. వారి కళాకృతుల్లో కళాసౌందర్యంతోపాటు సామాజిక సమస్యలు ఉంటాయి. తల్లి ఒడిలోనే కళలను నేర్చుకుని కాన్వాసుపై వర్ణాలు అద్దుతున్న చిత్రకారిణి స్వర్ణభార్గవి. సమాజంలోని ప్రతి అంశాన్ని కుంచెలో బంధించిన ఆర్టిసు. అనేక అంతర్జాతీయ వేదికలపై నుంచి బహుమతులను సొంతం చేసుకున్న స్వర్ణభారతిని అఖిల పలకరించింది.

చిత్రకళలో అనేక రీతులు ఉన్నాయి. అయితే సందర్భానుసారంగా ఆ పద్ధతుల్లో బొమ్మలు గీస్తుంటాం. ఇటీవల అంతర్జాతీయ నగల డిజైన్స్ పోటీల్లో బహుమతి రావడం ఎంతో ఆనందంగా ఉంది. జ్యూలరీ డిజైన్ చిత్రీకరించడం ఎంతో నైపుణ్యతతో పాటు ఏకాగ్రత అవసరం. వీటితో పాటు కార్వింగ్ డిజైన్స్, మైక్రో ఆర్ట్, పోట్రెట్స్, కార్టూన్స్, భావవ్యక్తీకరణ చిత్రాలకు అధిక ప్రాధాన్యత ఇస్తుంటాను. ఖమ్మం జిల్లా పోలంపల్లి సొంత ఊరైనా హైదరాబాద్‌లోనే స్థిరపడి చిత్రాలనే ఉపాధిగా చేసుకున్నా. అమ్మ సుగుణ నా చిన్నతనంలో మహిళా సంఘం ద్వారా డ్రాయింగ్, అల్లికలు నేర్పిస్తుండేది. దాంతో ఆసక్తి పెరిగింది. ఊహ తెలిసినప్పటి నుంచి బొమ్మలు వేయడం ఎంతో సరదాగా ఉండేది. ఆ తర్వాత డ్రాయింగ్‌లో టీచర్ ట్రైనింగ్ చేసి వరంగల్ లోని కేప్టెన్ లక్ష్మీ కాంతారావు పాఠశాలలో డ్రాయింగ్ టీచర్‌గా చేరాను. అనంతరం ఉన్నత చదువులతో పాటు అంతర్జాతీయ చిత్రప్రదర్శనల్లో పాల్గొని అనేక బహుమతులు గెలుచుకున్నాను.



కుటుంబపరంగా ప్రోత్సాహం ఉందా?



అమ్మ దగ్గర ఈ కళ నేర్చుకున్న నాకు హోమియో డాక్టర్ వాసుదేవరావుతో పెళ్లయింది. వృత్తి రీత్యా ఆయన డాక్టర్ అయినా ప్రవృత్తి ఆర్టిస్టే. ఇద్దరం కలిసి అనేక చిత్రాలను చిత్రీకరించాం. అనేక ప్రదర్శనలను ఏర్పాటు చేశాం. మా ఇంటిని ఓ రంగుల ప్రపంచంగా మార్చాం. వరకట్నం అంశంపై చిత్రీకరించిన పెయింటింగ్స్ కు ఆదరణ లభించింది. సామాజిక అంశాలపై మా రంగులు పదు

తూనే ఉంటాయి.

జ్యూలరీ ఆర్ట్‌కు డిమాండ్ ఉందా?

చాలా సున్నితమైంది జ్యూలరీ ఆర్ట్. ప్రతి కోణాన్ని నైపుణ్యంతో చిత్రీకరించాలి. లండన్ కు చెందిన సంస్థ నిర్వహించిన జ్యూలరీ ఆర్ట్ పోటీల్లో నేను గెలిచాను. అలాగే జపాన్ పత్రికలకు బొమ్మలు వేశాను. అంతర్జాతీయ సంస్థలు అనేక అవార్డులతో నన్ను ప్రోత్సహించాయి. అయితే ప్రకృతికి సంబంధించిన వర్ణ చిత్రాలతోపాటు విభిన్నరీతుల పెయింటింగ్స్‌ను వేశాను. వీటితో పాటు కార్టూన్స్ వేయడమం చాలా ఇష్టం. మా ఇద్దరిదీ రంగుల ప్రపంచమే. శాస్త్రీయ చిత్రాలతో పాటు విభిన్న పద్ధతుల్లో ఎన్నో బొమ్మలు వేశాం. మైసూర్ యూనివర్సిటీ నుంచి బి.ఎఫ్.ఎ, ఎం.ఎఫ్.ఏ పూర్తి చేశాను. మావారు ఎం.ఎఫ్.ఏ పూర్తి చేశారు.

మీ ఆర్ట్‌కు ప్రత్యేకత ఏమిటి?

నేను వేసే పెయింటింగ్స్‌లో ప్రయోగాత్మకత ఉంటుంది. ప్రతి పెయింటింగ్‌కు ఓ ప్రత్యేకమైన లైన్ ఉంటుంది. ఈ ప్రత్యేక లైన్ పేటెంట్ కోసం దరఖాస్తు చేశాను. అలాగే ప్రత్యేక ఫాంట్‌ను రూపొందించాను. కష్టమైన పనిని ఇష్టంగా చేసినప్పుడే టాలెంట్ ఏంటో తెలుస్తుంది. నేను ప్రతి పెయింటింగ్ లో కష్టమైన డిజైన్స్ వేస్తుంటాను. నైపుణ్యతకు ఇది ఎంతో ఉపయోగపడుతుంది. చెక్క టీపాయ్‌పై అల్లికలు ఉన్నట్లు వేసిన పెయింటింగ్‌కు ఎంతో శ్రమించాను. ప్రతి చిన్న లైన్ ఓపి



కతో వేయాలి. సమయం చాలా అవసరం అవుతుంది. అయినా పట్టుదలగా నైపుణ్యతను ప్రదర్శిస్తే రూపొందే కళాకృతులు ఎంతో తృప్తిని ఇస్తాయి. చిత్రకళలో ఏకాగ్రత ఉంది. పట్టుదల ఉంది. లక్ష్య సాధన ఉంది.

విద్యార్థులకు చిత్రకళనేర్పిస్తూ సమాజానికి నా వంతు కృషిచేస్తున్నట్లు భావిస్తాను. అందుకే మానవ నాగరికత సాధనాలలో లలితకళలకు అధిక ప్రాధాన్యత లభించిందనడంలో అతిశయోక్తిలేదు.

వి. భూమేశ్వర్
మన తెలంగాణ ముఖ్య ప్రతినిధి

చలికాలంలోనూ మెరిసే శిరోజాలు



చలికాలం వస్తూనే ఎన్నో ఇబ్బందుల్ని కూడా తెస్తుంది. అందులో శిరోజాల సమస్య ముఖ్యమైంది. చలికాలంలో ఆరోగ్యకరమైన జుట్టుకూడా నాజూకు గా తయారవుతుంది. గాలిలో తేమ ఉండటం వల్ల జుట్టు ఊడిపోతుంది. జుట్టు రాలిపోవడం, పొడిబారడం, చుండ్రు సమస్యల నుంచి విముక్తి పొందటానికి ఈ చిట్కాలు పాటించండి.

కొబ్బరినూనె: కొబ్బరి నూనె వంటింటి చిట్కాల్లో ఎక్కువగా ఉపయోగించే వస్తువు. ఇది జుట్టులో తేమను నిలిపి ఉంచుతుంది. జుట్టు పొడిబారకుండా కాపాడుతుంది. గోరువెచ్చని కొబ్బరి నూనెలో జుట్టు కుదుళ్లను మర్దనా చేయాలి. అరగంట తర్వాత కడిగేయాలి.

నిమ్మరసం: డ్రైహెయిర్, డ్రై స్కాల్ఫ్‌తో జుట్టులో చుండ్రు ఏర్పడుతుంది. దీనికి నిమ్మరసం సరైన ఉపాయం. నిమ్మరసంతో జుట్టును మసాజ్ చేస్తే చుండ్రు తగ్గుతుంది.

అలోవెరా జెల్: అలోవెరా జెల్‌తో జుట్టుకు మసాజ్ చేసి పావుగంట తర్వాత కడిగేయాలి. దీనివల్ల జుట్టులో దురదకూడా తగ్గిపోతుంది. బేకింగ్ సోడా పేస్ట్ కూడా జుట్టు దురదను తగ్గిస్తుంది. ఇందుకోసం బేకింగ్ సోడా తో పేస్ట్ తయారుచేసి జుట్టుకు రాయాలి. అరగంట తర్వాత జుట్టును శుభ్రంగా కడగాలి.

పొడి జుట్టు, డ్రై స్కాల్ప్ : టీట్రీ ఆయిల్‌లో పవర్‌ఫుల్ యాంటీ ఫంగల్, యాంటీ బ్యాక్టీరియల్ శక్తి ఉంటుంది. జుట్టుకు ఇది చక్కని చిట్కా.

తేనె మసాజ్: రెండు చెంచాల తేనెను నాలుగు కప్పుల వేడి నీళ్లలో కలపాలి. షాంపూ చేసుకున్న తర్వాత జుట్టుకు రాయాలి.

ఎగ్‌మాస్క్: మూడు చెంచాల గుడ్డు సొనను ఒక స్పూన్ తేనెలో కలిపి, నెమ్మదిగా జుట్టుకు రాయాలి. కొద్దిసేపటి తర్వాత మైల్డ్ షాంపూతో జుట్టు కడిగేయాలి.

చిట్లిన వెంట్రుకలు: జుట్టును డ్రైయర్‌తో ఆరబెడితే వెంట్రుకలు చిట్లిపోతాయి. అలాంటప్పుడు అవసరాన్ని బట్టి నూనెల మిశ్రమం అంటే కొబ్బరినూనె, ఆలివ్, బాదం నూనెల వాడకంతో జుట్టు ఒత్తుగా అందంగా పెరుగుతుంది.

సమతుల ఆహారం: జుట్టు రాలిపోవడాన్ని అరికట్టాలంటే మంచి ఆహారం తీసుకోవాలి. అన్నం, పప్పులు, కూరగాయలు, మొలకెత్తిన గింజలు మొదలైనవి తగినంత మోతాదులో తీసుకోవాలి. దీంతోపాటు రోజుకు కనీసం 8 – 10 గ్లాసుల మంచినీళ్లు తాగాలి.

వేడినూనెతో మసాజ్: మాలిష్ కోసం తరచుగా సహజమైన ఆలివ్ ఆయిల్, కొబ్బరినూనె, ఆముదం ఉపయోగించాలి. ఇవి జుట్టుకు మాయిశ్చరైజర్ చేయడమే కాకుండా అవి ఊడిపోకుండా కాపాడతాయి.

వీటితోపాటు కొన్ని నూనె చుక్కలను గుడ్డులో కలపాలి. జుట్టుకు రాయలి. తర్వాత మైల్డ్ షాంపూతో శుభ్రం చేయాలి. అందమైన జుట్టు సొంతమవుతుంది.

ఫోనేరియా

లైఫ్ స్టైల్ @

అబ్బబ్బ ఈ వెధవ ఫోన్ నాకు ఒక శత్రువులా తయారైంది. కూర్చోనివ్వదు, నిల్చోనివ్వదు... అన్నం తిననివ్వదు... నిద్రపోనివ్వదు ...ఆఖరికి సరదాగా జలకాలాడనివ్వదు... ఛ విసుగొచ్చేస్తోంది ... విసిరి హుస్సేన్ సాగర్ లో పడేస్తే వదిలిపోతుంది..

వచ్చిండే ... వచ్చిండే మెల్ల, మెల్లగా వచ్చిండే ... క్రీము బిస్కెట్ ఏసిండే...




అదిగో మోగింది..... క్షణం గ్యాప్ ఇవ్వదు కదా... ఎవరో.... అరె భవ్య .... హాయ్ భవ్యా ... హౌవార్యు... ఆఫ్టర్ లాంగ్ టైం ...నన్ను మర్చి పోయావా? అవునులే ఎందుకు గుర్తుంటాము... నువ్వు పెద్ద సెలెబ్రిటివి కదా... మేమెందుకు గుర్తుంటాం... టివి ఆన్ చేస్తే నువ్వే కనిపిస్తున్నావట సంధ్య చెప్పింది... అన్ని అవకాశాలు ఎలా వస్తున్నాయే నీకు... అవునూ పెళ్లి చేసుకున్నావా ... ఏంటి లాస్ట్ మంత్ చేసుకున్నావా... బాప్ రే.. ఇంత లేట్ గానా .. వాట్? సెకండ్ మారేజ్ ... ఫస్ట్ డైవోర్స్ అయిందా... అయ్యయ్యో అదేంటే.. ఏంటి? నో వర్రినా ...

అయినా ఏదన్నా ప్రాబ్లం ఉంటే నాకు చెప్తే సాల్వ్ చేసేదాన్నిగా.. అసలు ఫోన్ చేసి ఎంత కాలం అయింది? ఏంటి నాకు లాస్ట్ వీక్ నువ్వు ఫోన్ చేసావా... కొయ్ కోయ్ ... నన్ను నమ్మమంటావా .. ఏంటి ఎంగేజ్ వచ్చిందా .. ఇంపాజిబుల్ ... నా ఫోన్ అసలు ఎంగేజ్ వచ్చే ప్రసక్తే లేదు... నాకెవరు చేస్తారే బాబూ ... నువ్వంటే సెలబ్రిటీ కాబట్టి నీ ఫోన్ నిరంతరాయంగా మోగుతూనే ఉంటుందేమో ...సరే, సరే ఇంతకీ ఏంటి విశేషాలు.... ఎలా ఉన్నావు? కొత్త సీరియల్ ఏదన్నా ఒప్పుకున్నావా? ఏంటి ఇప్పుడు చేతిలో మూడున్నాయా... ఏమేవిటి? జీడిపాకం, బబుల్గం, చైనీస్ నూడుల్స్... భలే ఉన్నాయే పేర్లు... అవునూ బబుల్గం సీరియల్ ఎప్పుడో నా పెళ్లి కాకముందే చేసావుగా... సెకండ్ పార్టా .. కాదా అదేనా ...అదేంటే ... నా పెద్ద కొడుక్కి నిన్ననే పది నిండి పదకొండు వచ్చింది.... నా పెళ్లి టైంకి నీ సీరియల్ పదహారో భాగం వస్తోంది.. నాకు పెళ్లి అయిన రెండేళ్ళకి పుట్టాడు వాడు.. ఒకటిన్నర , రెండు మూడున్నర, పది, మైగాడ్ దాదాపు పదమూడేళ్ళు దాటింది... ఇంకా అవలేదా ... ఏంటి మన జీవితంలో లాగా సీరియల్స్ లో కూడా తరాలు మారాలా ... బాబోయ్ జనాలు చూస్తారా. సహ జత్వానికి దగ్గరగా ఉండడానికి అలా తీస్తారా ...


అదేం సహజత్వం నా బొంద ... ఇంతకీ ఏంటి ఎందుకు విడాకుల దాకా వచ్చింది.. లవ్ మారేజ్ చేసుకున్నావా... ఓ మరి లవ్ మారేజ్ ఎందుకు ఫెయిల్ అయింది? జాతకాలు చూసుకోలేదా? ఏంటి ఈ రోజుల్లో అవన్నీ చూడడం లేదా ... ఎన్ని విల్లాలు ...ఎన్ని ఎఫ్‌డి లు, ఆడి కారు ... చూస్తున్నారా.. మరి పోనీ అవన్నీ అయినా చూసుకోకపోయావా.. ఏంటి అవన్నీ ఉన్నాయా.. మరి విడాకులెందుకిచ్చావే ...అవన్నీ పోయినట్టేగా ...అయినా చేసుకునే ముందే అన్నీ చూసుకోవద్దూ..పెళ్ళంటే మామూలు విషయం కాదుగా ... కులం, మతం, కుటుంబం ఎన్ని చూడాలి? నీలాంటి వాళ్ళు తొందరపడి , కులం , మతం.. అన్నీ ట్రాష్ అంటూ పెళ్ళిళ్ళు చేసుకుని తరవాత నీ కులం ఇలాంటిది, మా కులం అలాంటిది అని మాటల ఈటెలు విసురుకుంటూ విడిపోయిన వాళ్ళు ఎంతమంది లేరు! అన్నంత ఈజీ కాదమ్మా.. పెళ్ళంటే నూరేళ్ళ పంట ... ఏంటి కాదా .... నిర్వచనం మారిపోయిందా... ఏమని ... మూడేళ్ళ క ....కా ... కాంట్రాక్టు... అయినా విల్లాలు, ఎఫ్‌డిలు చూసుకుని చేసుకున్న దానివి అవి కూడా పోయినట్టేగా.. నీ ఖర్మ ... ఏంటి అవి నీకు నష్టపరిహారంగా తీసుకున్నావా? హాలో, హాలో అబ్బ దిక్కుమాలిన ఫోన్ కట్ అయి చచ్చింది... ఏం చెప్పిందో భవ్య ... వెధవ ఫోన్ ... వెధవ ఫోన్ అని... ఛ కలిసి చావడం లేదు.. నాట్ రీచబులట ... ఎక్కడుందో మహాతల్లి... కలవదేంటి బాబో ... ఒసేయ్ ఫోనా నా తల్లి కదూ ఒక్కసారి కలవ్వే ... అదేదో చెప్పింది ...పూర్తిగా తెలుసుకునేదాకా నాకు మనశ్శాంతి లేదు... అయ్యయ్యో ఫోన్ కింద పడింది... అబ్బా పని చేయడం లేదు.. ఎలా ఇప్పుడు ... ఫోన్ లేకపోతే నా లైఫ్ స్తంభించినట్టే ...

అత్తలూరి విజయలక్ష్మి
99512 50144

ముత్యాలముగ్గులు



యం.శారదాదేవి, హైదరాబాద్
25 చుక్కలు – 8వరుసలు



వి.సంగీత, ఆర్‌టిసి క్రాస్‌రోడ్స్
20 చుక్కలు ,10 వరుసలు

ముగ్గు పేరు

మీ పేరు....
ఫొటో.....
చిరునామా....
ఎన్ని వరుసల ముగ్గు.....
ఎన్ని చుక్కలు....

ముగ్గులు పంపవలసిన చిరునామా

అఖిల- మన తెలంగాణ దినపత్రిక, నాల్గవ ఫ్లోర్, బేకన్ టవర్స్,
1-1-60/7A, స్ట్రీట్ నెంబర్. 13, జవహర్‌నగర్, ఆర్‌టిసి క్రాస్‌రోడ్స్,
హైదరాబాద్ – 500020, తెలంగాణ రాష్ట్రం.
e-mail : features@manatelangana.org

నేడు లాలూప్రసాద్‌కు శిక్ష ఖరారు



రాంచీ : దాణా కుంభకోణంలో దోషులుగా తేలిన వారికి రాంచీలోని సిబిఐ ప్రత్యేక న్యాయస్థానం గురువారం శిక్షలు ఖరారు చేయనుంది. బుధవారమే శిక్షలు ఖరారు కావల్సింది, కానీ న్యాయవాది విద్వేశ్వరి ప్రసాద్ హఠాన్మరణంతో ఈ కేసులో దోషులుగా ఉన్నవారికి శిక్షను ఖరారు చేసే ప్రక్రియను కోర్టు వాయిదా వేసింది. ఆర్‌జెడి అధినేత లాలూ ప్రసాద్ యాదవ్‌తో పాటు మరో14 మందిని దాణా కుంభకోణంలో దోషులని సిబిఐ ప్రత్యేక న్యాయస్థానం గత ఏడాది డిసెంబర్ 23న తేల్చింది. బీహార్ మాజీ ముఖ్యమంత్రి జగన్నాథ మిశ్రాతో పాటు మరో ఆరుగురిని నిర్దోషులుగా ప్రకటించింది. దోషిగా తేలిన లాలూ ప్రసాద్ యాదవ్ బిర్సాముండా జైలులో శిక్ష అనుభవిస్తున్నారు. సిబిఐ ప్రత్యేక న్యాయస్థానం దోషిగా తేల్చిన తర్వాత లాలూ ప్రసాద్ తనదైన శైలిలో స్పందించారు. బీహార్‌లో జరుగుతున్న ధర్మ యుద్ధంలో లాలూ ఒక్కడే ఒంటరిగా పోరాటం చేయడం లేదని మొత్తం బీహార్ అంతా వెనకు ఉందని ఆయన అప్పట్లో ట్వీట్ చేశారు. 2013 అక్టోబర్‌లో ఒకసారి దాణా కుంభకోణానికి సంబంధించి లాలూ ఒక సారి శిక్షను అనుభవించారు. సుప్రీంకోర్టు నుంచి బెయిల్ వచ్చేంత వరకు రెండు నెలల పాటు జైలు జీవితాన్ని చవిచూశారు. ప్రస్తుతం దాణా కుంభకోణం విషయంలో లాలూ అనేక నిబంధనలను ఉల్లంఘించారని సిబిఐ ఆధారాలతో సహా నిరూపించింది.

'ప్రేయర్ డే' రద్దు చేయాలని రిట్

మన తెలంగాణ/హైదరాబాద్ః క్రిష్టియన్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో ఈ నెల 5న పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించతల పెట్టిన 'రాష్ట్ర, జాతీయ ప్రేయర్స్ డే' కార్యక్రమాన్ని రద్దు చేయాలని హైకోర్టులో బుధవారం రిట్ దాఖలైంది.ఈ కార్యక్రమ నిర్వాహకులు స్వచ్ఛ్ భారత్, బంగారు తెలంగాణ అవగాహన కార్యక్రమం చేపడుతున్నట్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తప్పుడు సమాచారం అందించి,మత ప్రచారానికి భారీ ఎత్తున బహిరంగ సమావేశం ఏర్పాటు చేయడం జరుగుతుందన్ని రంగారెడ్డి జిల్లా బిజెపి అధికార ప్రతినిధి, న్యాయవాది కరుణా సాగర్ ఈ రిట్‌ను దాఖలు చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విదేశి మత ప్రచారకురాలు అన్నా గ్రాహం లోజ్ వస్తున్నారని, రాజ్యాంగం ప్రకారం విదేశీయులు దేశంలో మతప్రచారానికి అనర్హులని రిట్‌లో ఆయన పేర్కొన్నారు. కాగా కేంద్రానికి తప్పుడు సమాచారం అం దించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తన రిట్‌లో న్యాయస్థానానికి తెలియజేశానన్ని ఆయన తెలిపారు. అదే విధంగా అన్నా గ్రాహం లోజ్ వీసాను నిరాకరించాలన్ని కోరారు. ఈ కేసు గురువారం విచారణకు వస్తుందన్ని తెలిపారు.

బంగారు తెలంగాణ కోసం రేపు ప్రార్థనా దినోత్సవం : సిసిటి

మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన బంగారు తెలంగాణ నిర్మాణంతో పాటు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న స్వచ్ఛభారత్ విజయవంతం కావాలని కోరుతూ జనవరి 5న జాతీయ, రాష్ట్ర ప్రార్థనా దినోత్సవంగా పాటిస్తున్నట్లు క్రిష్టియన్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణ (సిసిటి) తెలిపింది. నగరంలో బుధవారం జరిగిన మీడియా సమావేశంలో సిసిటి ఛైర్మన్ బిషప్ ఎం.ఎ.డానియల్, కో ఛైర్మన్ బిషప్ జాన్ గొల్లపల్లి, ప్రధాన కార్యదర్శి రెవరెండ్ వై.మోహన్ బాబు, కోశాధికారి రెవరెండ్ కె.ఎం.జాన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సికింద్రాబాద్ పెరేడ్ గ్రౌండ్స్‌లో 5న మధ్యాహ్నం 2.30 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు జరిగే ప్రార్థనా దినోత్సవానికి ఏంజెల్ మినిస్ట్రీస్(యుఎస్‌ఎ) వ్యవస్థాపక డైరెక్టర్ డాక్టర్ బిల్లీ గ్రహం కూతురు డాక్టర్ అన్నీ గ్రహం లట్జ్ గౌరవ అతిథిగా, రాష్ట్ర ఐటి, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కె.తారకరావు ముఖ్య అతిథిగా హాజరౌతారన్నారు. కార్యక్రమంలో ఇతర క్యాబినెట్ మంత్రులు, ఎంపిలు, ప్రజా ప్రతినిధులు పాల్గొంటారన్నారు. ఈ సమావేశంలో అన్నీ గ్రహం లట్జ్ రాష్ట్ర ప్రభుత్వ అధికారిక అతిథిగా వస్తున్నారని, ఈ మేరకు ఇదివరకే రాష్ట్ర ప్రభుత్వం ఆమెను ఆహ్వానించిందన్నారు. శాసనమండలి సభ్యులు డి.రాజేశ్వర్‌రావు సహకారంతో నిర్వహించే ఈ కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన బిషప్‌లు, క్రైస్తవ పెద్దలు, స్వతంత్ర పాస్టర్లతో పాటు రెండు లక్షల మంది ప్రజలు ఒకే చోట చేరి సామూహికంగా ప్రార్థన చేస్తారని తెలిపారు.

వ్యాయమంతోనే రక్తస్రావానికి అడ్డుకట్ట

మన తెలంగాణ/హైదరాబాద్ : సంవత్సరానికి రెండు సార్లు ప్రత్యేక వ్యాయమ చికిత్స ద్వారా మస్కులో స్కెలిటల్ బ్లీడింగ్ అనే వ్యాధి లక్షణాలకు అడ్డుకట్ట వేయవచ్చని డాక్టర్ పమేలా నారాయణ్ అన్నారు. హిమాయత్‌నగర్‌లోని లక్ష్మి హాస్పిటల్‌లో హైదరాబాద్ హిమోఫిలియా సొసైటీ, నీలోనార్క్ డెస్క్ హిమోఫిలియా ఫౌండేషన్ సంయుక్తాధ్వర్యంలో హిమోఫిలియా వ్యాధిగ్రస్తుల్లో రక్తస్రావం, చికిత్సపై బుధవారం అవగాహనా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ నారాయణ్ మాట్లాడుతూ, గాయమైనప్పుడు సాధారణ ప్రజల్లో రక్తస్రావం జరిగినప్పటికీ కొంతసేపటి తర్వాత ఆగిపోతుందని, హిమోఫిలియా వ్యాధిగ్రస్తుల్లో మాత్రం అలా కాదన్నారు. వీరిలో ఫ్యాక్టర్ 8,9 అనే ద్రవ పదార్థాలు తగిన మోతాదులో లేకపోవడమే ఇందుకు కారణమని అన్నారు.

టిఎంయు క్యాలెండర్ ఆవిష్కరణ

మన తెలంగాణ / హైదరాబాద్ : తెలంగాణ మజ్దూర్ యూనియన్(టిఎంయు)ప్రచురించిన 2018 క్యాలెండర్‌ను టిఎం యు గౌరవాధ్యక్షులు, రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి టి.హరీష్‌రావు బుధవారం ఆవిష్కరించారు. మంత్రి నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో టిఎంయు వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.థామస్‌రెడ్డి, ప్రధా న కార్యదర్శి ఇ.అశ్వద్ధామరెడ్డి, ఉపాధ్యక్షులు బి.వి.రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఆర్‌టిసిని మరింత అభివృద్ధి పథకంలో తీసుకెళ్లేందుకు కార్మికులంతా కృషి చేయాలని ఈ సందర్భంగా మంత్రి హరీష్‌రావు అన్నారు.

మార్చిలో కొత్త రేషన్ కార్డులు?

(మొదటిపేజీ తరువాయి)

లేదు. మరో నెల రోజుల్లో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఇ-పాస్‌విధానం అందుబాటులోకి తీసుకువచ్చేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పూర్తిస్థాయిలోఇ-పాస్‌విధానం అందుబాటులోకి వచ్చిన తర్వాత లబ్దిదారులందరికీ మార్చిలో కొత్త కార్డులు జారీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నా రు.

కార్డు లేకున్నా రేషన్ పంపిణీ : రాష్ట్రంలో ఇపాస్ విధానంలో బయోమెట్రిక్ అథెంటికేషన్ తప్పనిసరి. ఈ ప్రక్రియలో లబ్దిదారులు తమ కుటుంబంలో ఎవరో ఒకరు తప్పనిసరిగా రేషన్ దుకాణాలలో వేలిముద్రలు ఇవ్వాల్సి ఉంటుంది. దాంతో కార్డు లేకుండా రేషన్ పంపిణీ జరుగుతోంది. ఇదివరకు రేషన్‌కార్డును ఆరోగ్యశ్రీతో పాటు, చిరునామా ధృవీకరణతోపాటు గుర్తింపు కార్డుగా కూడా వినియోగించుకునేవారు. దాంతో పాటు చాలా ప్రభుత్వ పథకాలకు రేషన్ కార్డు కలిగి ఉండటం అర్హతగా ఉండేది. ప్రస్తుతం రేషన్ కార్డును కేవలం రేషన్ కోసమే వినియోగించుకోవాలని, ఇతర అవసరాలకు వినియోగించకూడదని పౌరసరఫరాల శాఖ స్పష్టం చేసింది. ఇప్పుడు దాదాపు అన్ని పథకాలకు ఆధార్ కీలకం కావడంతో రేషన్ కార్డు ప్రాధాన్యత కూడా చాలా వరకు తగ్గిపోయింది. ఇపిడిఎస్ వెబ్‌సైట్‌లో లబ్దిదారుల వివరాలు అందుబాటులో ఉన్న నేపథ్యంలో కార్డులు లేని వారు, పోగొట్టుకున్న వారు ఆన్‌లైన్ ద్వారా డూప్లికేట్ తీసుకుని, దానితోనే రేషన్ తీసుకునే వెసులుబాటు కల్పించారు.

బుద్వేల్‌లో ఐటి క్లస్టర్

(మొదటిపేజీ తరువాయి)

జరుపుతున్నాయని మంత్రి కెటిఆర్ తెలిపారు. ఇందులో ఐటి పరిశ్రమలో పేరున్న దేశీయ కంపెనీలతో పాటు అంతర్జాతీయ స్థాయి కలిగిన బహుళ జాతి సంస్థలు ఉన్నాయన్నారు. కంపెనీల విజ్ఞప్తి మేరకు వాటి వివరాలను వెల్లడించడంలేదని అన్నారు. త్వరలోనే ఆయా కంపెనీతో లాంఛనంగా పరిశ్రమల స్థాపనకు ఒప్పందాలు చేసుకోనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఐటి పరిశ్రమలను నగరంలోని నలుమూలలకు విస్తరించాలన్న దీర్ఘ కాలిక లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగుతోందన్నారు. కొత్త క్లస్టర్ ద్వారా ఐటి పరిశ్రమ మరింత విస్తరిస్తుందన్నారు. ఇందులో అన్ని మౌలిక సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని టిఎస్‌ఐఐసి అధికారులను కెటిఆర్ ఆదేశించారు. ఇందుకు సంబంధించి అత్యుత్తమ మాస్టర్ ప్లాన్ తయారు చేయాలన్నారు. ఈ కంపెనీలు పూర్తి స్థాయిలో ఏర్పడిన తర్వాత లక్ష 25 వేల ఉద్యోగాలు నూతనంగా అందుబాటులోకి వస్తాయన్నారు. రాబోయే ఐదేళ్లలోపే ఈ కంపెనీలు తమ పూర్తి స్థాయి కార్యకలాపాలను ప్రారంభిస్తాయన్నారు. ప్రస్తుతం రాజేంద్రనగర్‌లో ఉన్న పలు ప్రభుత్వ సంస్థలు (ఎలాంటి కార్యకలాపాలు లేనివి) తమ భూములను పరిశ్రమలకు ఇచ్చేందుకు ముందుకు వచ్చాయన్నారు. వాటికి భూయాజమాన్య మార్పులను త్వరలోనే పూర్తి చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఈ క్లస్టర్ పనులను వేగవంతం చేసేందుకు ఐటి శాఖ, రెవెన్యూ శాఖ, రంగారెడ్డి జిల్లా కలెక్టర్, టిఎస్‌ఐఐసి లతో కలిపి ఒక సమావేశాన్ని నిర్వహిస్తామన్నారు. మంత్రి పర్యటనలో ఐటి శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, రెవెన్యూశాఖ అధికారులు కూడా ఉన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షల నివారణకు ఉన్నతస్థాయి కమిటీ



మన తెలంగాణ/హైదరాబాద్ : ఆడ శిశువుల భ్రూణ హత్యల నివారణ కోసం ఉద్దేశించిన లింగ నిర్ధారణ పరీక్షల నివారణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేసేందుకు ప్రభుత్వం రాష్ట్ర స్థాయి నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. వైద్యారోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అధ్యక్షులుగా, వైద్య విద్యాశాఖ డైరెక్టర్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ సభ్య కార్యదర్శులుగా ఉండే ఈ కమిటీలో కెఎన్‌ఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఉప కులపతి, రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ ఛైర్మన్, వైద్య విధాన పరిషత్ కమిషనర్, ప్రజారోగ్యం, కుటుంబ సంక్షేమ సంచాలకులు, ఉస్మానియా ఆసుపత్రి రేడియాలజీ విభాగం అధిపతి, పెట్ల బురుజు ప్రసూతి విభాగం అధిపతి, లింగ నిర్ధారణ పరీక్షల నివారణ చట్టం అమలు రాష్ట్రస్థాయి అధికారి సభ్యులుగా ఉంటారు. కమిటీని నియమిస్తూ వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తివారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ చట్టంపై గర్భస్థ పరీక్షలను చేసే వైద్యులకు తగిన శిక్షణ ఇవ్వాలని రాష్ట్రాలను, కేంద్ర పాలిత ప్రాంతాలను సుప్రీంకోర్టు గతంలో ఆదేశించిన సంగతి తెలిసిందే. సుప్రీంకోర్టు తీర్పు మేరకు ఎంబిబిఎస్ వైద్యులకు, గర్భస్థ పరీక్షలు నిర్వహించే అన్ని ఆరోగ్య కేంద్రాల్లో కనీసం 6 నెలల శిక్షణ ఇచ్చేలా రాష్ట్ర స్థాయిలో ఉన్నత నిపుణుల కమిటీని నియమించాలని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. ఈ మేరకు రాష్ట్రంలో ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటైంది.

నియమ నిబంధనలు : కమిటీ కనీసం ప్రతి మూడు నెలలకు ఒకసారి సమావేశం కావాలి. ఈ లోపు అత్యవసర పరిస్థితి ఏర్పడితే సమావేశం కావాలి. కమిటీ సభ్యుల్లో మూడింట ఒక వంతు మంది తప్పనిసరిగా సమావేశంలో హాజరుకావాలి. కో ఆప్ట్ సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులకు ఇతర సభ్యుల మాదిరిగా అన్ని అధికారాలుంటాయి. అవసరమనుకుంటే ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి కమిటీని పునర్నియమించుకోవచ్చు.

ఛైర్‌పర్సన్ విధులు : కమిటీ పనితీరును పూర్తిగా పర్యవేక్షించాలి. వైద్యులకు సంబంధిత చట్టంపై ఆరు నెలల శిక్షణకు గాను కమిటీలో సభ్యులకు విభాగాల వారీగా బాధ్యతలను అప్పగించాలి. అదే విధంగా సభ్య కార్యదర్శులకు, మిగిలిన సభ్యులకు ప్రత్యేక విధులు ఉంటాయి.

జనజీవన బంద్

(మొదటిపేజీ తరువాయి)

తదితర ప్రాంతాల్లో ఆందోళన కారులు తమ ప్రతాపాన్ని చూపించారు. అయితే వెస్టన్ ఎక్స్‌ప్రెస్ హై వేపై ఆందోళన కారులను పోలీసులు చెల్లాచెదురు చేశారు. కొన్ని ప్రాం తాల్లో పోలీసులు వ్యూహాత్మకంగా వ్యవహరించారు.వాహనదారులను సురక్షిత మార్గాల వైపు మళ్లించారు. హార్బర్ లైన్ వద్ద కొన్ని ప్రాంతాల్లో ఆందోళన కారులు రాళ్లు రువ్వారు. అదే విధంగా హార్బర్ లైన్ వద్ద గోవండి, మాన్ కుర్ద్, కుర్లా ప్రాంతాల్లో నిరసన కారులు రైల్వే ట్రాకులపై హంగామా సృష్టించారు.దీంతో పాన్వెల్, బేలాపూర్, వాషి ప్రాంతాలవైపు వెళ్లే సబర్బన్ సర్వీసులు రద్దయ్యాయి.అలాగే సెంట్రల్ రైల్వే మార్గంలో ఉన్న థానే, భాండ్రూప్, కంజుర్ మార్గ్, విక్రోలి, ఘట్కోపర్ స్టేషన్ల వద్ద కూడా ఆందోళన కారులు అలజడి సృష్టించారు. దీంతో చాలా రైళ్లు ట్రాకులపైనే చాలా సేపటి వరకు నిలిచిపోయాయి. చేసేది ఏమీ లేక చాలా మంది ప్రయాణీకులు ట్రాకుల గుండా నడిచి వెళ్లారు. పశ్చిమరైల్వే పరిధిలో ఉన్న నల్లసోపారా స్టేషన్ వద్ద కూడా ప్రయాణీకులకు కష్టాలు తప్పలేదు. ఇదిలా ఉంటే బాంద్రాలోకలానగర్, ధార్వీ, కామ్‌రాజ్ నగర్, సంతోష్ నగర్, దిన్‌దోషి, హనుమాన్‌నగర్ ప్రాంతాల్లో బెస్ట్ బస్సు సర్వీసులకు తీవ్ర నష్టం జరిగిందని 13బస్సులు ధ్వంసమయ్యాయని బృహన్‌ముంబయి మున్సిపల్ కార్పోరేషన్ అధికారులు తెలిపారు. ఘట్కోపర్ వద్ద సబర్బన్ ట్రైన్ సర్వీసులను దళిత ఉద్యమకారులు అడ్డుకోవడంతో సిఎస్‌ఎంటి వైపు వెళ్లే రైళ్లకు తీవ్ర అంతరాయం కలిగింది.చాలా రైళ్లు ట్రాకులపై నిలిచిపోయాయి.

డబ్బావాలాల సేవలు నిలిపివేత : ముంబయిలో ప్రఖ్యాతిగాంచిన డబ్బావాలాలు తన సేవలను బుధవారం నిలిపివేశారు. బస్సులు, రైళ్లకు అంతరాయం కలగడంతో తమ కస్టమర్లు సరైన సమయానికి కార్యాలయాకు వెళ్లలేకపోతున్నారని, అందుకే తమ సేవలను బుధవారం నాడు నిలిపివేస్తున్నామని ముంబయి డబ్బావాలా అసోసియేషన్ అధికార ప్రతినిధి ఒకరు తెలిపారు. ఇదిలా ఉంటే చాలా పాఠశాలు స్వతహాగా మూతబడ్డాయి. ప్రభుత్వం ఎటువంటి సెలవు ప్రకటించకపోయినా, బస్సు ఆపరేటర్లు తమ సేవలను నిలిపివేయడంతో స్కూళ్లకు అప్రకటిత సెలవు లభించింది. రాష్ట్రంలో స్కూల్ బస్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దాదాపు 40,000 బస్సులు విద్యార్థులకు సేవలందిస్తున్నాయి. రాష్ట్రంలో చాలా ప్రాంతాల్లో వాణిజ్య సముదాయాలు కళావిహీనంగా తయారయ్యాయి. హింసకు భయపడి చాలా మంది కార్యాలయాలకు సెలవు పెట్టారు. థానే,గోరేగాం స్టేషన్ల వద్ద ఉదయం నుంచే దళిత ఉద్యమకారులు ఆందోళనకు దిగారు. బుధవారం ఉదయం నుంచి జరిగిన హింసాత్మక ఘటనను పోలీసులు పర్యవేక్షిస్తున్నారు. తీవ్ర విధ్వంసానికి పాల్పడిన తొమ్మిది మందిపై కేసులు నమోదు చేశారు.అదే విధంగా దాదాపు 100 మందిని అదుపులోకి తీసుకున్నారు. పూణెలో స్వల్ప ఉద్రిక్తలు మినహా బందు ప్రశాంతంగా జరిగింది. పూణెలో మహానగర్ పరివాహన్ మహామండల్ లిమిటెడ్‌కి చెందిన బస్సులపై ఆందోళన కారులు రాళ్లు రువ్వారు. బుధవారం ఒక్కరోజే 12 బస్సులు ధ్వంసమయ్యాయని, గత రెండు రోజుల నుంచి మొత్తంగా 42 బస్సులు ఆందోళన కారుల చేతిలో ధ్వంసమయ్యాయని సంస్థ అధికారులు తెలిపారు. భీమా కోరేగాం గ్రామంలో అల్లర్లకు ప్రధాన కారకుడైన మిలింద్ ఎక్‌బోటే నివాసం వైపుగా ఆందోళనకారులు ర్యాలీని చేపట్టారు. పూణె పోలీసులు ఇప్పటికే ఎక్‌బోటే పై కేసు నమోదు చేశారు.

ఫుల్ బెంచ్ భేటీ

(మొదటిపేజీ తరువాయి)

తీసుకున్నట్లు తెలిసింది. ఆ ఉత్తర్వుల్లో ఉన్న 'సూటబుల్ స్ట్రక్చర్స్' అనే అంశంపైన చర్చించినట్లు తెలిసింది. ఈ పూర్వ రంగంలోనే ఎపి ప్రభుత్వం ప్రతిపాదించిన భవనాలు హైకోర్టు కార్యకలాపాలకు అనువుగా ఉన్నాయో, లేవో పరిశీలించాలని ఈ సమావేశం ఒక అభిప్రాయానికి వచ్చి ఐదుగురు న్యాయమూర్తులతో కూడిన కమిటీని ఏర్పర్చినట్లు తెలిసింది. విభజన ద్వారా తలెత్తే న్యాయాధికారుల, సిబ్బంది విభజన, పరిపాలనాపరమైన అంశాలు కూడా ఈ సమావేశంలో ప్రస్తావనకు వచ్చినట్లు సమాచారం.

మిడిల్ కొలాబ్ ప్రాజెక్టుకు తెలంగాణ అభ్యంతరం

మన తెలంగాణ/హైదరాబాద్: ఇంద్రావతి, శబరి నదులపై ఒడిశా ప్రభుత్వం చేపడుతున్న మిడిల్ కొలాబ్ ప్రాజెక్టుపై తెలంగాణ ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ మేరకు బుధవారం నాడు గోదావరి బోర్డుకు లేఖ రాసింది. అధిక నీటి మళ్లింపుకు వీలుగా ఈ ప్రాజెక్టును ఒడిషా ప్రభుత్వం చేపడుతోందని, దీంతో దేవాదుల ఎత్తిపోతల పథకానికి నీటి లభ్యత తగ్గుతుందని బోర్డుకు రాసిన లేఖలో అధికారులు తెలిపారు. డిజైన్లలో మార్పులు చేసి, ప్రాజెక్టు ప్రతిపాదనలు సవరించాలని తెలంగాణ సూచించింది. బోడాఘాట్ జలవిద్యుత్ ప్రాజెక్టుకు మిడిల్ కొలాబ్ నిర్మాణంతో నీటి లభ్యత తగ్గుతుందని తెలంగాణ ఆందోళన వ్యక్తం చేసింది. తెలంగాణ ప్రయోజనాలు కాపాడేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం గోదావరి బోర్డును కోరింది.

కెజిబివిల పర్యవేక్షణాధికారిగా జి.డి.ప్రియదర్శిని

మన తెలంగాణ/హైదరాబాద్:రాష్ట్రంలో కస్తూర్బా బాలికా విద్యాలయాల(కెజిబివి)పర్యవేక్షణకు రిటైర్డ్ ఐఎఎస్ అధికారిణి జి.డి. ప్రియదర్శిని ప్రత్యేక అధికారిగా నియమితులయ్యారు. కెజిబివిల్లో కొత్తగా చేపడుతున్న పనులతోపాటు అక్కడఅమలవుతున్న మెనూ, తరగతులు తదితర అంశాలను ఆమె పర్యవేక్షించనున్నారు. ప్రస్తుతం ప్రియదర్శిని ప్రభుత్వం కన్సల్టెంట్‌గా నియమిచుకుంది. భవిష్యత్తుల్లో కెజిబివిల కార్యదర్శిగా మార్చనుంది.



అదనపు విద్యుత్ ఉత్పత్తి ఏదీ?

(మొదటిపేజీ తరువాయి)



పదేళ్ళ హాయంలోనే దేశంలో అదనంగా లక్ష మెగావాట్ల ఉత్పత్తి పెంచారని, ఫలితంగానే ప్రస్తుతం మిగులు విద్యుత్ అందుబాటులోకి రావడంతో రైతులకు 24 గంటల విద్యుత్ సాధ్యమైందన్నారు. గాంధీభవన్‌లో ''కరెంటుపై కెసిఆర్ అబద్ధాలు- విద్యుత్ వాస్తవాలు' అనే పేరుతో విద్యుత్ శాఖ మాజీ మంత్రి, శాసనమండలి ప్రతిపక్ష నాయకులు మహ్మద్ అలీ షబ్బీర్, టిపిసిసి ముఖ్య అధికార ప్రతినిధి దాసోజు శ్రవణ్‌లు బుధవారం పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణకు సంబంధించిన విద్యుత్ అంశం గురించి ఇతర రాష్ట్రాల పత్రికలకు యాడ్స్ ఎందుకు ఇచ్చారని ప్రశ్నించారు. కేవలం తన స్వంత ప్రచారం కోసమే కోట్లాది ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తూ యాడ్‌లు ఇచ్చుకుంటున్నారని ఆరోపించారు. తెలంగాణ ఏర్పడిన కాంగ్రెస్ ప్రారంభించిన భూపాలపల్లి, జైపూర్, జూరాల, పులిచింతల వంటి విద్యుత్ ప్లాంట్‌ల నుండే కొత్తగా విద్యుత్ ఉత్పత్తి అవుతోందని, అలాగే ప్రైవేటు నుండి వస్తున్న సోలార్ విద్యుత్ అందుబాటులోకి వచ్చిందని, వీటితో పాటు ప్రైవేటు కంపెనీల నుండి ఎక్కువకు కొనుగోలు చేసిన విద్యుత్‌ను కలుపుకొని తాము విద్యుత్ మిగులు రాష్ట్రమని కెసిఆర్ చెప్పుకోవడం దారుణమన్నారు. ఛత్తీస్‌ఘడ్ నుండి తెస్తున్న విద్యుత్‌లో పెద్ద కుంభకోణం దాగి ఉందన్నారు. అలాగే ఉద్యమ సమయంలో కడతామన్న పిట్‌హెడ్ (గనుల వద్దే) పవర్ ప్లాంట్ ఎక్కడున్నాయని ప్రశ్నించారు.రెండేళ్ళలో లోపు పూర్తి చేస్తానని శాసనసభలో స్వయంగా ప్రకటించిన యాదాద్రి పవర్ ప్రాజెక్ట్‌లో మూడేళ్ళవుతున్నా తట్టెడు మట్టి ఎత్తలేదన్నారు. అలాగే భద్రాద్రిలోని కాలం చెల్లిన సబ్ క్రిటికల్ టెక్నాలజీ పవర్ ప్లాంట్‌ను కూడా పూర్తి చేయలేకపోయారని, కెసిఆర్ ప్రారంభించిన ఈ రెండూ 2020 వరకు కూడా పూర్తి కాబోవని చెప్పారు. తాను మంత్రిగా ఉన్న సమయంలో భద్రాద్రిలోని హిందూజ సబ్ క్రిటికల్ టెక్నాలజీని అమ్మేందుకు చూడగా వద్దన్నామని, అలాంటి దాన్ని కోట్లు దండుకునేందుకే అనుమతించారని అన్నారు. మరోవైపు ప్రభుత్వరంగంలో ఉన్న జెన్‌కోను క్రమంగా నిర్వీర్యం చేస్తున్నారని, అందుకే 2014లో 80 శాతం ఉన్న జెన్‌కో ఉత్పత్తిని 65 శాతానికి తగ్గించారని ఆరోపించారు. అలాగే ఎన్‌టిపిసి అవసరమైన నీరు, భూమి ఇస్తే వెంటనే ప్రాజెక్టును పూర్తి చేసి 3వేల మెగావాటల విద్యుత్ ఇస్తామన్న చెప్పినా కూడా మూడున్నరేళ్ళలో 800 మెగావాట్ల ఉత్పత్తికి మాత్రమే అవసరమైన వనరులు సమకూర్చారని అన్నారు. ఇదిచివరకు విద్యుత్ లేదంటూ అడ్డగోలుగా ప్రైవేటు విద్యుత్ కేంద్రాల నుండి విద్యుత్ కొనుగోలు చేస్తారని చెప్పారు. పవర్ పాయింట్ ప్రెజెంటేషన్‌లో తొలుత షబ్బీర్ అలీ మాట్లాడుతూ విద్యుత్ విషయంలో సిఎం కెసిఆర్ అన్ని అబద్ధాలే చెబుతున్నాడని అన్నారు. మూడున్నరేళ్ళలో 6వేల మెగావాట్ల నుండి విద్యుత్ 14వేల మెగావాట్లు ఎలా పెరిగిందో సిఎం కెసిఆర్ చెప్పాలని అన్నారు. అలాగే వచ్చే రెండేళ్ళలో 14వేల మెగావాట్లను ఎలా ఉత్పత్తి చేసి 28వేల మెగావాట్ల లక్ష్యాన్ని చేరుకుంటారని ప్రశ్నించారు. రాష్ట్రం ఏర్పడిన తరువాత అదనంగా ఉత్పత్తి అయిన 8340 మెగావాట్ల విద్యుత్‌లో కాంగ్రెస్ హయాంలో ప్రాజెక్టుల ద్వారానే 3,840 మెగావాట్లు వచ్చాయని, అలాగే 3వేలమెగావాట్లు సోలార్ పవర్ నుండి వచ్చాయన్నారు.మిగతాదంతా ప్రైవేటు కంపెనీల నుండి ఇష్టమొచ్చిన ధరలకు కొంటున్నారని, దీంతో ప్రజలపై భవిష్యత్తులో భారీ భారం పడుతుందన్నారు. ప్రపంచంలోనే అత్యధికంగా 9 శాతం వృద్ధి రేటుతో ముందుకుపోతున్న నేపథ్యంలో నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ పారిశ్రామిక, వ్యవసాయ అవసరాల కోసం 1.50 లక్ష మెగావాట్ల విద్యుత్ అదనపు విద్యుత్ అవసరమవుతుందని, ఆనాడే ప్రణాళికలు రచించి, ప్రాజెక్టులకు అనుమతులిచ్చారని గుర్తు చేశారు.

ప్రజలపై పెనుభారం- దాసోజు: దేశంలో 1950లో 2వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి నుండి 2015 నాటికి 2.84లక్షల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వాలు వేసిన పునాధే కారణమని దాసోజు శ్రవణ్ చెప్పారు. కాంగ్రెస్ కట్టిన ఇంట్లో దొడ్డిదారిలో గృహ ప్రవేశం చేసిన కెసిఆర్ తానే విద్యుత్‌ను తీసుకువచ్చినట్లు చెబుతున్నారని ఎద్దేవా చేశారు. ఛత్తీస్‌ఘడ్ విద్యుత్ ఒప్పందంతో ప్రజలే ఏటా రూ.1500 కోట్ల భారం పడుతోందని, మార్కెట్‌లో రూ.3.50కే యూనిట్ దొరుకుతుంటే అక్కడి నుండి రూ.6 ఖర్చుతో 500 యూనిట్లే తెప్పించుకుంటున్నా వెయ్యి యూనిట్‌లకు డబ్బులు కడుతున్నామన్నారు. దీనిని వ్యతిరేకించిన ఇందన శాఖ ముఖ్య కార్యదర్శి అరవింద్‌కుమార్‌ను ప్రాధాన్యత లేని పోస్టుకు బదిలీ చేశారన్నారు.అలాగే ప్రైవేటు కంపెనీల నుండి అడ్డగోలు ధరకు కొనుగోలు చేయడం ద్వారా రూ.1,126 కోట్లు చెల్లించారని, దీని వెనుక అక్రమాలు ఉన్నాయన్నారు.గతంలో థర్మల్ పవర్ టెక్ సంస్థతో రూ.3.58 కే యూనిట్ కొనుగోలు చేస్తే తెలంగాణ వచ్చాక రూ.4.15కు కొనుగోలు ఒప్పందం చేసుకున్నారన్నారు. టెలిస్కోపిక్ విధానం నుండి నాన్ టెలిస్కోపిక్ విధానంలో బిల్లులను మారుస్తూ సామాన్యులపై పరోక్షంగా పెను భారం మోపుతున్నారని తెలిపారు. 101 యూనిట్లు వాడే వినియోగదారుడికి గతంలో రూ.232 బిల్లు వస్తే ఇప్పుడు రూ.384 బిల్లు వస్తుందని, 201 యూనిట్లు వాడితే రూ.655 బిల్లు వస్తే, ఇప్పుడు 1067 బిల్లు వస్తోందని, అంటే నెలకు రూ.412 అదనంగా కట్టాల్సి వస్తుందని వివరించారు. మాటిచ్చిన ప్రకారం కాంట్రాక్టు కార్మికులకు రెగ్యులరైజేషన్ కాలేదని, ఇపిఎఫ్, ఇఎస్‌ఐకి కూడా వాళ్ళ జీతం నుండే కట్ చేస్తున్నారని దాసోజు తెలిపారు. ప్రాజెక్టుల రీడిజైనింగ్ కారణంగా విద్యుత్ ఖర్చు విపరీతంగా పెరుగుతోందని, సగటున ఎకరానికి రూ.80వేలు వ్యయం అవుతుందని చెపాపరు. ప్రాజెక్టుపై పెట్టుబడి ఖర్చులు కలుపుకుంటూ సాగుకు మొత్తం ఖర్చు ఎకరానికి రూ.1.35వేలు అవుతుందని చెప్పారు. మొత్తం గంటన్నర పాటు సాగిన పవర్ పాయింట్ ప్రెజెంటేషన్‌లో దాసోజు 1950లో విద్యుత్ పరిస్థితి నుండి ప్రస్తుతం మిగులు విద్యుత్ వచ్చిన కారణాలు లెక్కలతో సహా వివరించి ఆకట్టుకున్నారు. అలాగే ప్రాజెక్టు వారీగా ఉత్పత్తి అవుతున్న విద్యుత్, ప్రైవేటు సంస్థలకు కట్టబెడుతున్న మొత్తాన్ని కూడా సవివరంగా చెప్పారు.

ట్రిపుల్ తలాక్!

(మొదటిపేజీ తరువాయి)

లోక్‌సభ ఆమోదించి రాజ్యసభకు పంపిందని కూడా ఆయన స్పష్టం చేశారు. అంతేకాక సెలెక్ట్ కమిటీని ఏర్పాటు చేయాలన్న నోటీసును ముందు ఇవ్వలేదని తద్వారా పార్లమెంటరీ విధానాలను ఉల్లంఘించారని జైట్లీ అభ్యంతరాన్ని లేవనెత్తారు. ట్రిపుల్ తలాక్ రాజ్యాంగ విరుద్ధమని ఆగస్టు 22న ఇద్దరు సుప్రీం కోర్టు న్యాయమూర్తులు తీర్పు చెప్పారు. ఆ ఆచరణ సరైంది కాదని అభిప్రాయపడ్డారు. వారు తమ విచక్షణాధికారాన్ని ఉపయోగించి ట్రిపుల్ తలాక్ ఆచారాన్ని ఆరు నెలల కోసం రద్దు చేశారు. ఆ ఆరు నెలల గడువు ఫిబ్రవరి 22న ముగియనున్నది. ఈ కారణంగా ఈ బిల్లును శీఘ్రంగా ఆమోదించాలని బిజెపి సభ్యులు పట్టుపట్టారు. ఈ సందర్భంగా జైట్లీ కాంగ్రెస్‌పై విరుచుకుపడుతూ 'సభలో ఏమిజరుగుతుందో దేశమంతా చూస్తోంది. ఈ బిల్లును మీరు లోక్‌సభలో సమర్థించారు. కానీ ఇక్కడ(రాజ్యసభలో) గాడి తప్పిస్తున్నారు' అన్నారు. అంతేకాక ఆయన ఈ విషయంలో అధ్యక్షుడి రూలింగ్‌ను డిమాండ్ చేశారు. జైట్లీ అభిప్రాయాలను కాంగ్రెస్ నాయకుడు కపిల్ సిబాల్ వ్యతిరేకిస్తూ 'సుప్రీంకోర్టు మైనార్టీ తీర్పునే మంత్రి ప్రస్తావిస్తున్నారు. కానీ దీనిపై వేగిరం చేయాలని సుప్రీంకోర్టు మెజారిటీ తీర్పేమి లేదు' అని అన్నారు. దాంతో మంత్రి సహా బిజెపి సభ్యులు రెచ్చిపోయి నిలబడి గోల చేశారు. 'మహిళలను గౌరవించడం తప్పా?' అని నిలదీశారు. దానికి కాంగ్రెస్ నాయకుడు శర్మ 'మేము మహిళల హక్కులను గౌరవిస్తాం, సమర్థిస్తాం. మేమేమి వ్యతిరేకించడం లేదు. మేము మద్దతునిస్తున్నాం. మేమేమి కపటులం(హిపోక్రైట్స్) కాము. అయితే ఈ బిల్లు శాసన పరిశీలన ప్రక్రియను పూర్తిచేసుకోవాలనే కోరుకుంటున్నాం' అన్నారు. వాగ్వాదాలు, గందరగోళం నడుమ రాజ్యసభ గురువారానికి వాయిదా పడింది.

కాంగ్రెస్‌ది పటాటోప మద్దతు: జైట్లీ

'రాజ్యసభలో ట్రిపుల్ తలాక్ బిల్లును కాంగ్రెస్ పరోక్షంగా వ్యతిరేకిస్తోంది. ఈ వైఖరి కారణంగా ముస్లిం మహిళలు అన్యాయాన్ని ఇంకా ఎదుర్కోవలసి రావొచ్చు. లోక్‌సభలో ప్రతిపక్షం బిల్లుకు ఇచ్చిన మద్దతు కేవలం చూయించుకోడానికే(పటాటోపమే)'అని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ అన్నారు. అయితే కాంగ్రెస్, ప్రతిపక్షాలు చివరికైనా దీనికి మద్దతు ఇస్తారన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. 'రేపు (గురువారం) రాజ్యసభలో ఈ బిల్లుకు ఏమి జరగనున్నది?' అని ఆయనని ప్రశ్నించినపుడు 'రేపు పార్లమెంటు ముందుకు వచ్చినప్పుడు దాని సంగతి చూస్తాం' అన్నారు.

విపక్షాలకు ముస్లిం పర్సనల్ లా బోర్డు కృతజ్ఞతలు

ట్రిపుల్ తలాక్ బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపాలని కోరిన విపక్షాలకు ఆల్ ఇండియా ముస్లిం లా బోర్డు(ఎఐఎంపిఎల్‌బి) బుధవారం కృతజ్ఞతలు తెలిపింది. వారు తమ వైఖరిపై గట్టిగా నిలబడతారన్న ఆశాభావాన్ని కూడా వ్యక్తం చేసింది. 'ఈ బిల్లులోని లోపాలను సెలెక్ట్ కమిటీ నిర్మూలిస్తుంది' అని ముస్లిం పర్సనల్ లా బోర్డు ప్రతినిధి మౌలానా ఖలీలురెహ్మాన్ సజ్జాద్ నోమాని వ్యాఖ్యానించారు. బిజెపి అనుసరిస్తున్న వైఖరిని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ బిల్లు ఇదే రూపంలో ఆమోదం పొందితే ముస్లిం మహిళల కష్టాలు రెట్టింపవుతాయి అన్నారు.

నాది పనిచేసే అణు మీట

(మొదటిపేజీ తరువాయి)

పెంచాల్సి ఉంది. ఇతర దేశాలు ఈ విషయంలో అమెరికాకు తోడ్పాటునందించాలి' అని వైట్ హౌస్ ప్రెస్ సెక్రటరీ సారా శాండర్స్ విలేకరులతో చెప్పారు. ఉత్తర కొరియా విషయంలో అమెరికా అన్ని ఆప్షన్స్ తెరచి ఉంచిందని కూడా ఆమె చెప్పారు. దక్షిణ కొరియాతో సంబంధాల విషయంలో పురోగతిని ఉత్తర కొరియా కోరుకుంటోందని ఇటీవల కిమ్ జోంగ్ ఉన్ తెలిపారు. దక్షిణ కొరియాకు చెందిన పైయోంగ్చాంగ్ నగరంలో జరిగే 2018 వింటర్ ఒలింపిక్స్‌లో ఉత్తర కొరియా పాల్గొననున్నట్లు ప్యోంగ్యాంగ్ ఇటీవల ప్రకటించింది. ఈ ప్రతిపాదనను దక్షిణ కొరియా సైతం స్వాగతించింది. ఈ నేపథ్యంలో దక్షిణ కొరియాతో తమ సంబంధాల్లో ఎలాంటి మార్పు ఉండబోదని అమెరికా తెలిపింది. గత ఏడాది ఫిబ్రవరి నుంచి ప్యోంగ్యాంగ్ 23 క్షిపణులను పరీక్షించింది. ఇదిలా ఉండగా అణ్వాయుధ దేశంగా ఎదిగినట్లు నవంబర్ 29న ఉత్తర కొరియా ప్రకటించింది. అమెరికా మిత్ర దేశాలైన జపాన్, దక్షిణ కొరియాలు సైతం ఉత్తర కొరియాపై ఒత్తిడిని పెంచాయి.

సాయం ఆపేస్తామని పాలస్తీనాకు అమెరికా హెచ్చరిక

ఇజ్రాయెల్ రాజధానిగా జెరూసలేంను గుర్తిస్తూ అమెరికా చేసిన ప్రకటన నేపథ్యంలో శాంతి చర్చలను పాలస్తీనా మళ్లీ కొనసాగించకపోతే పాలస్తీనియన్ అథారిటీకి ఆర్థిక సాయాన్ని ఆపేస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. పాలస్తీనా కాందీశీకులకు 2016 నుంచి సాయమందిస్తున్న ఐక్యరాజ్యసమితి రిలీఫ్ అండ్ వర్క్స్ సంస్థ(యుఎన్‌ఆర్‌డబ్ల్యుఎ)కు అమెరికా అతి పెద్ద విరాళ దాతగా ఉంది. తూర్పు జెరూసలేంను పాలస్తీనీయులు తమ భవిష్యత్ రాజధానిగా భావిస్తున్నారు. గత నెల ట్రంప్ జెరూసలేంపై చేసిన ప్రకటన నేపథ్యంలో పాలస్తీనా అధ్యక్షుడు మహమూద్ అబ్బాస్ డిసెంబర్‌లో అమెరికా ఉపాధ్యక్షుడు మైక్ పెన్స్‌తో జరపాల్సిన సమావేశాన్ని రద్దు చేసుకున్నారు. ఇదిలా ఉండగా పాలస్తీనియన్ అథారిటీకి నిధులివ్వడాన్ని అమెరికా పాలకవర్గం ఆపేసిందని ఐక్యరాజసమితిలోని అమెరికా రాయబారి నిక్కీ హేలీ చెప్పారు. శాంతి చర్చలకు పాలస్తీనా తిరిగి వచ్చేంత వరకు ఆర్థిక సాయం ఆపేయాలని ట్రంప్ చెప్పినట్లు ఆమె న్యూయార్క్‌లోని ఐక్యరాజ్యసమితి ప్రధాన కేంద్రంలో విలేకరులకు చెప్పారు. అమెరికా మూడు ప్రధాన విధానలకు ప్రాధాన్యత ఇవ్వాలనుకుంటోంది. ఒకటి ఇజ్రాయెల్‌కు విరుద్ధంగా ఉగ్రవాదాన్ని ఆపడం లేక క్షీణింపజేయడం, రెం డోది సుస్థిరత, సౌభాగ్యం, స్వీయ పాలనను మరింత బలోపేతం చేయడం తద్వారాపాలస్తీనీయులు యూదులతో శాంతియుత సహజీవనం కొనసాగించడం. మూడోది మానవ అవసరాలనుఅవసరాలను తీర్చడం.

విపక్షాలవి దివాళాకోరు రాజకీయాలు : జగదీశ్‌రెడ్డి



మన తెలంగాణ/సూర్యాపేట: విపక్షాలవి దివాళాకోరు రాజకీయాలని విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన నూతన క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేకనే అసత్య ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే గృహావసరాలు, పరిశ్రమలకు నిరంతరాయంగా విద్యుత్ అందించిన ఘనత టిఆర్‌ఎస్‌ది అన్నారు. 2019 ఎన్నికల్లో ఉమ్మడి నల్గొండ జిల్లాలో 12 శాసనసభ స్థానాలు, రెండు లోక్‌సభ స్థానాలను టిఆర్‌ఎస్ కైవసం చేసుకుంటుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. పిసిసి అధ్యక్ష హోదాలో ఉన్న ఉత్తమ్ కుమార్‌కి నల్గొండలో సభను పెట్టించే ధైర్యం లేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందనే పగటికలలు మానుకోవాలని ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గండూరి ప్రవళికప్రకాష్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వై.వెంకటేశ్వర్లు, బడుగుల లింగయ్యయాదవ్, కట్కూరి గన్నారెడ్డి, మొరిశెట్టి శ్రీనివాస్, ఉప్పల ఆనంద్, ఆకుల లవకుశ, తూడి నర్సింహారావు, టిఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ఖర్చు వెల్లడించని వారిపై వేటు

- **37మంది ఎంపిటిసి అభ్యర్థులపై అనర్హత**

మన తెలంగాణ/ఇల్లంతకుంట: స్థానిక ఎన్నికల్లో పోటీ చేసి ఎన్నికల నియమావళి ప్రకారం అభ్యర్థులు పెట్టిన ఖర్చుల వివరాలను వెల్లడించకపోవడంతో 37మంది అభ్యర్థులపై అనర్హత వేటు వేస్తూ జిల్లా ఎన్నికల అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలో ఎంపిటిసి ఎన్నికల్లో పోటీ చేసిన 37మంది అభ్యర్థులు తమ ఎన్నికల ఖర్చులు, వివరాలను ఎన్నికల సంఘానికి వెల్లడించాల్సి ఉంది. ఇప్పటికీ అభ్యర్థులు నిర్లక్ష్యం వహించడంతో అధికారులు అనర్హత వేటు వేశారు. అంతేకా కుండా మూడేళ్ల వరకు ఎన్నికల్లో పోటీ చేయరాదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఎల్‌ఎండి నుంచి నీటి విడుదల



మన తెలంగాణ/తిమ్మాపూర్: లోయర్ మానేర్ డ్యాం నుంచి కాకతీయ కాలువ ద్వారా దిగువకు ఆర్థిక శాఖ మంత్రి ఈటెల రాజేందర్ బుధవారం నీటిని విడుదల చేశారు. కరీంనగర్ జిల్లా రైతులకు సాగు, వరంగల్ జిల్లా ప్రజలు తాగునీటి అవసరాలకు నీటిని విడుదల చేస్తున్నట్లు చెప్పారు. రోజుకు 2500 క్యూసెక్కుల చొప్పున ఏప్రిల్ వరకు ఆన్ ఆఫ్ పద్ధతిలో విడుదల చేస్తామని పేర్కొన్నారు. రైతులు నీటిని పొదుపుగా వాడాలని సూచించారు. మొదటి నుంచి చివరి ఆయకట్టులో ఉన్న రైతులకు సాగు నీరందిస్తామన్నారు. ప్రస్తుతం ఎస్‌ఆర్‌ఎస్‌పిలో 14 టిఎంసిల నీరు నిల్వ ఉండగా 2500 క్యూసెక్కులు అవుట్ ఫ్లో ఉందన్నారు. ప్రాజెక్టులో సరిపడా నీరు లేక పోయినా జిల్లా ఎంఎల్‌ఎలు సిఎం కెసిఆర్‌కు వివరించి మంజీరా, సింగూర్ నిజాం సాగర్ ప్రాజెక్టుల్లోని నీటిని ఎస్‌ఆర్‌ఎస్‌పికి, అక్కడి నుంచి ఎల్‌ఎండికి 14 టిఎంసిల నీటిని విడుదల చేసినట్లు వివరించారు. చివరన ఉన్న డిబిఎం 24 కాలువ వరకు దిగువకు ఇవ్వాలని, ఎగువకు నాలుగున్నర లక్షల ఎకరాలకు నీళ్లు ఇవ్వాలనే సంకల్పంతో గత నెల 25న ఎల్‌ఎండికి నీటిని ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపి వినోద్‌కుమార్, ఎం ఎల్‌ఎ రసమయి బాలకిషన్, నారాదాసు లక్ష్మణ్‌రావు, జెడ్‌పి చైర్‌పర్సన్ తుల ఉమ, సిఇ శంకర్, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థిని ఆత్మహత్యాయత్నం



మన తెలంగాణ/రెంజల్: భవనంపై నుంచి దూకి ఓ విద్యార్థిని ఆత్మహ త్యాయత్నానికి పాల్పడింది. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా రెంజల్ మండల కేంద్రంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఎడపల్లి మండల కేంద్రంలోని బాపునగర్‌కు చెందిన రవడి శ్వేత రెంజల్‌లోని కస్తూర్బాలో 7వ తరగతి చదువుతోంది. బుధవారం ఉదయం శ్వేత ఇంటికి వెళ్లేందుకు ప్ర త్యేకాధికారిణి మమతను అడగ్గా నిరాకరించింది. దీంతో ఏం చేయాలో తెలియక పాఠశాల భవనం పై నుంచి దూకింది. విషయం తెలు సుకున్న సిబ్బంది వెంటనే శ్వేతను ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. తల కు బలమైన గాయాలు కావడంతో వైద్యుల సూచన మేరకు జిల్లా కేం ద్రంలోని ప్రధాన ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


మన తెలంగాణ/భీంపూర్: అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలం నిపాని గ్రామంలో విషాదం నింపింది. కుటుంబసభ్యుల వివరాల మేరకు గ్రామానికి చెందిన పొచ్చన్న (49) తనకున్న ఎనిమిదెకరాల్లో పత్తి సాగు చేశాడు. రెండు నెలల క్రితమే కూతురి పెళ్లి కూడా చేశాడు. వీటి కోసం రూ. 8లక్షలు అప్పు చేశాడు. పత్తి పంటలో నష్టం వాటిల్లడంతో అప్పులు ఎలా తీర్చాలో తెలియక మనస్తాపం చెందాడు. మంగళవారం రాత్రి ఇంట్లో పురుగుల మందు తాగాడు. ఇది గమనించిన కుటుంబసభ్యులు వెంటనే రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కులాల మధ్య ప్రభుత్వం కుట్ర



మన తెలంగాణ/హైదరాబాద్/గోషామహల్: ప్రభుత్వం కులాల మధ్య చిచ్చుపెట్టేందుకు కుట్ర పూరితంగా వ్యవహరిస్తుందని జాతీయ మాలల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు అవుల బాలనాథం, ఉపాధ్యక్షుడు గడ్డం సత్యనారాయణ, రాష్ట్ర అధ్యక్షుడు బేర బాలకిషన్ ఆరోపించారు. ఎస్‌సి, ఎస్‌టి రిజర్వేషన్లను తొలగించే కుట్రలో భాగంగానే టిఆర్‌ఎస్ మాల, మాదిగ, ఆదివాసీ, లంబాడీ కులాల మధ్య వైషమ్యాలు పెంచే చర్యలకు పూనుకుంటుందని విమర్శించారు. మాలలకు వ్యతిరేకంగా వర్గీకరణకు మద్దతునిస్తున్న బిజెఎల్‌పి నేత కిషన్‌రెడ్డి రాబోయే ఎన్నికల్లో ఏ నియోజకవర్గం నుంచి పోటీ చేసినా ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లోని కోఠి బ్యాంక్‌స్ట్రీట్ వద్ద ఉన్న సంఘం జాతీయ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఎస్‌సి వర్గీకరణ కోసం సిఎం కెసిఆర్ అఖిలపక్షాన్ని ఢిల్లీకి పంపించినా, వర్గీకరణకు మద్దతుగా ఢిల్లీకి వెళ్లే రాజకీయ పార్టీలకు రాబోయే ఎన్నికల్లో 30లక్షల మాలలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. మాదిగలకు మాత్రమే పదవులను కట్టబెడు తూ సిఎం కెసిఆర్ మాలలను రెచ్చగొట్టే విధంగా వ్యవహరిస్తున్నారని వారు ధ్వజమెత్తారు. ఈ చర్యలకు నిరసనగా ఈ నెల 6న అన్ని జిల్లాల కలెక్టరేట్లు మాలల ఐక్యవేదిక ఆధ్వర్యంలో వినతిపత్రాలు సమర్పించడం జరుగుతుందన్నారు. సమావేశంలో జాతీయ ఐక్యవేదిక మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు జి లక్ష్మీ దేవి, నాయకులు మాదాసు అభినయ్, కిశోర్‌కుమార్, కృష్ణప్రకాశ్, గోపీ సత్యనారాయణ తదితరులున్నారు.

బకెట్‌లో పడి బాలుడు మృతి



మన తెలంగాణ/శంషాబాద్: ప్రమాదవశాత్తూ ఆడుకుంటూ బాలుడు బకెట్‌లో పడి మృతి చెందిన విషాద ఘటన రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం పరిధిలోని మాల్కరంలో చోటుచేసుకుంది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. బాలుడు యశ్వంత్ (14నెలలు) సాయంత్రం వాకిట్లో ఆడుకుంటుండగా తల్లి లత పక్కనే పని చేస్తుంది. బాలుడు ఆడు కుంటూ వచ్చి నీటి బకెట్‌లో తలకిందులుగా పడ్డాడు. అయితే ఎవరూ య శ్వంత్‌ను గమనించక పోవడంతో ఊపిరాడక మృతి చెందినట్లు చెప్పారు.

కేంద్ర మంత్రులకు జోగు వినతులు

మన తెలంగాణ/న్యూఢిల్లీ: తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి అన్ని విధాలుగా సహకరించాలని కేంద్ర మంత్రులను మంత్రి జోగు రామన్న కోరారు. బుధవారం ఆయన ఢిల్లీలో పలువురు కేంద్ర మంత్రులను మర్యాద పూర్వకంగా కలిశారు. రాష్ట్రానికి సంబంధించిన పలు అభివృద్ధి, సంక్షేమ అంశాలతో పాటు, రాష్ట్రానికి రావాల్సిన నిధులపై కేంద్ర మంత్రులతో చర్చించారు. అనంతరం ఢిల్లీ తెలంగాణ భవన్‌లోని గురజాడ సమావేశ మందిరంలో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర మంత్రి మహేశ్ శర్మను కలిసి ఆదిలాబాద్‌లో జంతు, పశు జీవ వైవిధ్య ప్రదర్శన శాల ఏర్పాటుపై చర్చించినట్లు తెలిపారు. జంతు, పశు జీవ వైవిధ్య ప్రదర్శన శాల ఏర్పాటుపై రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి రూ.185 కోట్లతో ప్రతిపాదన అందించిందని, ఇందులో కేంద్రం వాటా రూ.125 కోట్లు త్వరగా విడుదల చేయాలని కోరినట్లు చెప్పారు. మిగిలిన వాటాలో రాష్ట్ర ప్రభుత్వం రూ.45 కోట్లు, అంకుశ్ స్వచ్ఛంద సంస్థ రూ.20 కోట్లను ఇచ్చే నిధులతో ప్రాజెక్టు పూర్తి చేయనున్నట్లు వివరించారు. కరీంనగర్ హెడ్ క్వార్టర్స్‌లో కేటగిరి వన్ విభాగంలో సైన్స్ సెంటర్ ఏర్పాటు చేయాలని సమావేశంలో భాగంగా కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశామన్నారు. రాష్ట్ర విజ్ఞప్తులపై సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి మహేశ్ శర్మ ఫిబ్రవరి 6న హైదరాబాద్ పర్యటనలో భాగంగా ఈ అంశాలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. అనంతరం సామాజిక, న్యాయ శాఖ మంత్రి థావర్ చంద్ గెహ్లాట్‌తో బిసి వర్గాల సమస్యలు, స్కాలర్ షిప్‌లపై చర్చించినట్లు మంత్రి జోగు రామన్న వివరించారు. కొత్తగా 15 బిసి హాస్టళ్ల నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు గతంలోనే కేంద్రానికి పంపామని, అందుకు సంబంధించిన నిధులు, అనుమతులు త్వరగా విడుదల చేయాలని కోరినట్లు మంత్రి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన పోస్టు మెట్రిక్, ప్రీ మెట్రిక్ స్కాలర్ షిప్‌లను త్వరగా కేటాయించాలని విజ్ఞప్తి చేశామన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 113 బిసి కులాలు ఉన్నాయని, ఇందులో కేవలం 85 కులాలను మాత్రమే ఒబిసి కులాలుగా గుర్తించబడ్డాయని మంత్రి తెలిపారు. అయితే మిగిలిన కులాలను ఒబిసిలుగా గుర్తించకపోవడం వల్ల కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలలో వారికి అన్యాయం జరుగుతున్న విషయాన్ని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లానన్నారు. అయితే ఈ అంశాలపై సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి థావర్ చంద్ గెహ్లాట్ త్వరలోనే ఒబిసి కమిషన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారని వివరించారు. ఒబిసి కమిషన్ ఏర్పాటుతో ఒబిసి సమస్య పరిష్కారమవుతోందని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారని మంత్రి జోగు రామన్న తెలిపారు. అనంతరం రాష్ట్ర పర్యాటక అభివృద్ధిపై కేంద్ర పర్యాటక శాఖ మంత్రి అల్ఫాన్స్‌తో చర్చించామని మంత్రి తెలిపారు. ఆదిలాబాద్‌లో అద్భుతమైన పర్యాటక ప్రాంతాలు ఉన్నాయన్న మంత్రి, జాతీయ, అంతర్జాతీయ సందర్శకులను ఆకర్షించే దిశలో రాష్ట్ర ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుంటుందని తెలిపారు. ఇందులో భాగంగా కుంతాల, పొచ్చెర జలపాతాలను జాతీయ ప్రాజెక్టులుగా గుర్తించి అభివృద్ధి చేయటానికి సంబంధించిన 141 కోట్లతో కూడిన ప్రతిపాదనలు కేంద్రానికి గతంలో పంపామని మంత్రి గుర్తు చేశారు. అనంతరం కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి అనంత్ గీతేతో రాష్ట్రంలోని భారీ పరిశ్రమల అభివృద్ధి అంశాలపై చర్చించామని మంత్రి రామన్న వివరించారు. రామగుండం పెర్టిలైజర్, సిసిఐ ఏర్పాటుపై కేంద్ర మంత్రితో చర్చించామని, ఈ రెండు అంశాలను త్వరలోనే పరిష్కరిస్తామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారని మంత్రి జోగు రామన్న తెలిపారు. కేంద్ర మంత్రులను కలిసిన బృందంలో మంత్రి జోగు రామన్నతోపాటు, ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి వేణు గోపాలాచారి, పార్లమెంట్ సభ్యులు జి. నగేశ్, సీతారాం నాయక్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తదితరులు ఉన్నారు.





శాంతి భద్రతలతోనే పెట్టుబడులు



- **నేరాల నియంత్రణకు సాంకేతిక వ్యవస్థ**
- **డిజిపి మహేందర్ రెడ్డి**

మన తెలంగాణ/హైదరాబాద్ సిటీబ్యూరో: తెలంగాణను నేర రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడం జరుగుతుందని డిజిపి మహేందర్ రెడ్డి చెప్పారు. శాంతిభద్రతలు వెల్లివిరిస్తేనే రాష్ట్రానికి ప్రపంచ పెట్టుబడులు అధికంగా వస్తాయని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రం పెట్టుబడులకు స్వర్గధామంగా మారేలా పోలీసు యంత్రాంగం తమవంతు పనిచేయాలని, శాంతిభద్రతల పరిరక్షణకు సాంకేతిక వ్యవస్థను అమలు చేయడం జరుగుతుందని ఆయన వెల్లడించారు. బుధవారం హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన సాంకేతిక ఫ్యుష్యన్ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ పోలీసులు సాంకేతిక వ్యవస్థ అమలుకే చిహ్నంగా నిలుస్తున్నారని చెప్పారు. త్వరలోనే ప్రారంభించనున్న కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు ముందుగా ఈ టెక్నాలజీ ఫ్యుష్యన్ సెంటర్‌ను నగర పోలీసు కమిషనర్ కార్యాలయంలో పైలట్ ప్రాజెక్ట్‌గా అమలు చేస్తున్నామని తెలిపారు. నేరాల నియంత్రణ, నేరస్థుల కదలికలను గుర్తించడం, హైదరాబాద్ మహానగరానికి నేరస్థులు రావాలంటేనే వెనకడుగు వేసేలా వ్యవస్థను కార్యరూపంలోకి తీసుకొస్తున్నామని డిజిపి తెలిపారు. నగరంలోని పోలీసు యూనిట్లతోపాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాల, కమిషనరేట్ కార్యాలయాల్లోని మినీ కమాండ్ కంట్రోల్ సెంటర్ల సాంకేతిక వ్యవస్థ అనుసంధానం చేయనున్నామని, తద్వారా నాణ్యమైన సేవలను అందించనున్నామని వెల్లడించారు.

10 లక్షల సిసి టివి కెమెరాలు: నగరంలో 'నేను సైతం' కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం, ప్రజలు ఏర్పాటు చేసుకున్న సిసిటివి కెమరాలు 1.67 లక్షలుగా ఉన్నాయని, వీటి సహాయంతో ట్రాఫిక్ సమస్యల నివారణతో పాటు నేరాలు చోటు చేసుకోకుండా చూడడం జరుగుతుందన్నారు. రాచకొండ, సైబరాబాద్, హైదరాబాద్ మూడు కమిషనరేట్లలో 10 లక్షల సిసిటివి కెమెరాలను ఏర్పాటు చేయాలనే లక్ష్యంగా ముందుకు వెళ్లాలన్నారు. ఫ్యుష్యన్ సెంటర్ అత్యవసర సమయాల్లో కీలకపాత్ర పోషిస్తుందని, సమాజ పరిరక్షణలో ప్రముఖంగా పనిచేస్తుందని వివరించారు.

త్వరలోనే సిసిసి పూర్తి: 20 అంతస్థులుగా ఉన్న పోలీసు ప్రధాన కమాండ్ కంట్రోల్ సెంటర్ త్వరలోనే పూర్తికానుందని, ఏడాది కాలంగా నిర్మాణం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ భవనం పూర్తయ్యేలోపు కమిషనర్ కార్యాలయంలో ప్రయోగాత్మకంగా ఫ్యుష్యన్ సెంటర్‌ను అమలు చేయడం ద్వారా కనిపించే లోపాలు, పొరపాట్లను గుర్తించి మరింత నైపుణ్యతను పెంచాలని భావిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర పోలీస్ కమిషనర్ వివి శ్రీనివాస్‌రావు, నగర అదనపు పోలీస్ కమిషనర్లు స్వాతిలక్రా, శివప్రసాద్, మురళీకృష్ణ, జాయింట్ కమిషనర్ డా. రవీందర్, ట్రాఫిక్ డిసిపి ఎల్‌ఎస్ చౌహాన్, రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు కానిస్టేబుళ్లపై వేటు

మన తెలంగాణ/హైదరాబాద్/జవహర్‌నగర్: అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న హైదరాబాద్‌లోని జవహర్‌నగర్‌కు చెందిన ముగ్గురు కానిస్టేబుళ్లపై ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకున్నారు. జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుళ్లు గణేశ్, రవియాదవ్, మల్లికార్జున్‌రెడ్డి తమ అధికార పలుకుబడితో ఇష్టారాజ్యంగా వసూళ్లకు పాల్పడుతుండడంతో ఫిర్యాదుదారులు ఉన్నతాధికారుల వద్ద మొరపెట్టుకున్నారు. దీంతో వారిపై మల్కాజిగిరి డిసిపి ఉమామహేశ్వర శర్మ విచారణ చేసి బదిలీ వేటు వేశారు. వీరిని కుషాయిగూడ పోలీస్‌స్టేషన్‌కు అటాచ్‌మెంట్ చేశారు. కొన్నాళ్లుగా తమ పలుకుబడి ఉపయోగించి ఇక్కడే తిష్ఠ వేసిన కానిస్టేబుళ్లు యథేచ్ఛగా వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి. కొత్తగా వచ్చిన ప్రతి ఇన్‌స్పెక్టర్‌కు ఆదాయ వనరులు చూపించడంతో పాటు ఉన్నతాధికారుల పేర్లు చెబుతూ బాధితుల నుంచి భారీగా వసూళ్లకు పాల్పడుతున్నారు. ఈ విషయమై డిసిపి ఉమామహేశ్వర శర్మ మాట్లాడుతూ జవహర్‌నగర్ చెందిన పోలీసులను కుషాయిగూడ పోలీస్ స్టేషన్‌కు అటాచ్‌మెంట్ చేశామని తెలిపారు.



'గజల్'కు బెయిల్ ఇవ్వొద్దు

మన తెలంగాణ/హైదరాబాద్ సిటీబ్యూరో: గాయకుడు, రచయిత గజల్ శ్రీనివాస్‌కు బెయిల్ మంజూరు చేస్తే సాక్ష్యాలను తారుమారు చేసే అవకాశాలు ఉన్నాయని పోలీసులు కౌంటర్ పిటిషన్ దాఖలు చేశారు. యువతిపై లైంగిక వేధింపుల కేసులో శ్రీనివాస్‌ను పంజాగుట్ట పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే. అయితే, ఆయనకు బెయిల్ మంజూరుపై బుధవారం నాంపల్లి కోర్టులో వాదనలు జరిగాయి. ఈ సందర్భంగా పోలీసులు బెయిల్ మంజూరు చేయరాదంటూ తమకు అతనిని ఏడు రోజుల కస్టడీకి ఇవ్వాలని కోర్టును కోరారు. ఇరుపక్షాల న్యాయ వాదుల వాదనలు విన్న న్యాయస్థానం ఈ పిటిషన్‌లపై తీర్పును రేపటికి వాయిదా వేసింది. ఇదిలా ఉండగా పోలీసులు ఈ కేసులో మరిన్ని సాక్ష్యాలపై ఆరా తీస్తున్నారు. ఇదిలా ఉంటే సేవ్ టెంపుల్స్ సంస్థ ప్రచారకర్త బాధ్యతల నుంచి గజల్ శ్రీనివాస్‌ను తొలగిస్తున్నట్టు గ్లోబల్ హిందూ హెరిటేజ్ ఫౌండేషన్ అధ్యక్షుడు వెలగపూడి ప్రకాశ్‌రావు ఓ ప్రకటనలో వెల్లడించారు. దేశంలోని మా కార్యాలయంలో లైంగిక వేధింపులు జరిగాయనే సమాచారం మమ్మల్ని దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. గజల్ శ్రీనివాస్‌పై కేసు నమోదైన వెంటనే ఆయనను సస్పెండ్ చేయాలని మా సంస్థ బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ ఏకగ్రీవ తీర్మానాన్ని ఆమోదించినిట్టు ప్రకటనలో వివరించారు.

కమలనాథులూ ఇక కదలండి

- **బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి కైలాష్ విజయవర్గీయ**

మన తెలంగాణ/ హైద రాబాద్: రాష్ట్రంలో బిజె పి శ్రేణులు అనుకున్న స్థాయిలో ప్రజాక్షేత్రంలోకి వెళ్లడం లేదని బిజెపి జా తీయ ప్రధాన కార్యదర్శి కైలాష్ విజయవర్గీయ అన్నారు. అసంతృప్తిగా ఉన్న కార్యకర్తలలో ఆత్మస్థైర్యాన్ని నింపాలని, ఆ దిశగా కార్యాచరణ రూపొందించాలని బిజెపి నేతలకు ఆయన దిశనిర్దేశం చేసినట్లు తెలిసింది. రాష్ట్ర పర్యటనకు వచ్చిన కైలాష్ విజయ వర్గీయ కరీంనగర్, సిద్దిపేట జిల్లాలోని పోలింగ్ బూత్ కమిటీ ముఖ్య నేతలతో సమావేశమాయ్యరు. ఈ సందర్భంగా స్థానికంగా పార్టీ పరిస్థితి, ప్రభుత్వ విధానాలు, ప్రజావ్యతిరేక కార్యక్రమాలు తదితర అంశాలపై ఆయన సమీక్షించారు. అనంతరం రెండోరోజు బుధవారం రాష్ట్ర కా ర్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు డా. కె.లక్ష్మ ణ్ అధ్యక్షతన కోర్ కమిటీ స మావేశం జరిగింది. ఈ సమావేశంలో బిజెఎల్‌పి నేత జి.కిషన్‌రెడ్డి, ఎంఎల్‌సి రాంచందర్‌రావు, ఎంఎల్‌ఎలు రాంచద్రారెడ్డి, ఎన్‌విఎస్ ప్రభాకర్, నేతలు ఇంద్రసేనారెడ్డి, బాల్‌రెడ్డి, లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మేడారం జాతరకు రండి


- **ఉప రాష్ట్రపతి వెంకయ్యకు మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఆహ్వానం**



మన తెలంగాణ/న్యూఢిల్లీ: మేడారం జాతరకు భారత ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడిని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి అల్లోళ ఇంద్రకరణ్ రెడ్డి బుధవారం ఢిల్లీలోని ఆయన నివాసంలో కలసి ఆహ్వానించారు. ఈ సమావేశంలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించ తలపెట్టిన మేడారం జాతర విశేషాలను ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడికి వివరించారు. మేడారం జాతర ఏర్పాట్లపై ఈ సందర్భంగా ఉప రాష్ట్రపతితో మంత్రి చర్చించారు. అనంతరం మంత్రి అల్లోళ ఇంద్రకరణ్ రెడ్డి తెలంగాణ భవన్‌లోని గురజాడ సమావేశ మందిరంలో మీట్ ది ప్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భారత ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడిని గిరిజన కుంభమేళగా అభివర్ణించే మేడారం జాతరకు ఆహ్వానించినట్లు ఆయన తెలిపారు. ఈ నెల 31 నుండి 3 వరకు నిర్వహించనున్న ఈ ఉత్సవాలకు సంబంధించి ఏర్పాట్లను ఉప రాష్ట్రపతికి వివరించామని మంత్రి తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత మేడారం జాతరకు దాదాపు 90 లక్షల మంది హాజరయ్యారని, ఈ సంవత్సరం దాదాపు కోటి మంది భక్తులు మేడారం జాతరలో పాల్గొనే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. గిరిజన బిడ్డలు భక్తి, శ్రద్ధలతో జరుపుకునే మేడారం జాతరను జాతీయ పండుగగా గుర్తించేలా కేంద్ర ప్రభుత్వానికి సూచించాలని ఉప రాష్ట్రపతిని కోరినట్లు మంత్రి తెలిపారు. తమ విజ్ఞప్తులపై భారత ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు సానుకూలంగా స్పందించారని, సమక్క, సారలమ్మలను దర్శించుకునేందుకు మేడారం జాతరకు వస్తానని ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు హామీ ఇచ్చారని మంత్రి వివరించారు. మేడారం జాతర ఘనంగా నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాలుగా సమాయత్తం అయిందని, ఇప్పటికే మేడారం ఉత్సవాలు జరిగే ప్రాంతానికి నాలుగు లైన్ల రోడ్లు, అన్ని విధాల మౌలిక వసతులు కల్పించినట్లు మంత్రి తెలిపారు. ప్రత్యేకంగా ఈసారి సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగాన్ని పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకు వస్తున్నట్లు మంత్రి వివరించారు. వివిఐపిలు రోడ్డు మార్గంలో రావడంవల్ల భక్తులకు ఇబ్బందులు తలెత్తుతున్న నేపథ్యంలో వివిఐపిల రాక కోసం రెండు హెలిప్యాడ్‌లను సిద్ధం చేసినట్లు మంత్రి తెలిపారు. ఫ్రీ వైఫై, మంచినీరు, స్వచ్ఛతా అంశాలను ముఖ్య అంశాలుగా పరిగణిస్తున్నట్లు మంత్రి తెలిపారు. సమ్మక్క, సారలమ్మలకు ప్రీతిపాత్రమైన బెల్లం ప్రసాదం కొరత లేకుండా అన్ని చర్యలు చేపడుతున్నామన్నారు. సౌకర్యాలు, మౌలిక వసతులు, బెల్లం కొరతపై జిల్లా కలెక్టర్‌తో సమావేశం నిర్వహిస్తామని మంత్రి వివరించారు. ఈ నెల 18న ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి, మంత్రి చందూలాల్, తాను మేడారం జాతర ఏర్పాట్లను పరిశీలించనున్నట్లు తెలిపారు. భారత ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడిని కలిసిన బృందంలో మంత్రి ఇంద్ర కరణ్ రెడ్డితోపాటు ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి వేణుగోపాల చారి, పార్లమెంట్ సభ్యులు జి.నగేశ్, సీతారాం నాయక్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలు ఉన్నారు.

అట్టడుగుల సంక్షేమాన్ని మరిచిన ప్రభుత్వం

- **తెలంగాణ ఇంటి పార్టీ అధ్యక్షుడు డా.చెరుకు సుధాకర్**



మన తెలంగాణ/హైదరాబాద్: అంబేద్కర్ విగ్రహాన్ని ప్రతిష్టిస్తామని చెబుతున్న ప్రభుత్వం, అట్టడుగుల సంక్షేమాన్ని ఎందుకు పట్టించుకోవడం లేదని తెలంగాణ ఇంటి పార్టీ అధ్యక్షులు డా. చెరుకు సుధాకర్ ప్రశ్నించారు. సావిత్రిబాయి పూలే 186వ జయంత్యుత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ వద్ద అంబేడ్కర్ విగ్రహం వద్ద 'పూలే –అంబేద్కర్ జాతర' బస్సుయాత్రను బుధవారం ఆయన జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పూలే–అంబేద్కర్ జాతర యాత్ర రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి, ఏప్రిల్ 29న నిజాం కళాశాల గ్రౌండ్స్‌లో లక్షలాదిమందితో పూలే అంబేద్కర్ జాతర జరుగుతుందని తెలిపారు. అంబేద్కర్ ఆశయాలను తుంగలో తొక్కుతన్న ప్రభుత్వం మరో వైపు విగ్రహాలను ఏర్పాటు చేయడం హాస్యస్పదమన్నారు. తమ హక్కుల సాధనకు దీక్షకు దిగిన ఎంఆర్‌పిఎస్ నేత మందకృష్ణ మాదిగను అరెస్టు చేయడాన్ని ఆయన ఖండించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బిసి సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మేకపోతుల నరేందర్‌గౌడ్, ప్రొ. ప్రభంజన్ యాదవ్, పార్టీ ప్రధాన కార్యదర్శి డి.వెంకటేశ్, గ్రేటర్ హైదరా బాద్ అధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి, టిఎస్‌యు వ్యవ స్థాపక అధ్యక్షుడు సందీప్‌చమార్, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ చైర్మన్‌గా నియమితులైన ఎర్రోళ్ల శ్రీనివాస్ ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీని బుధవారం ఆయన నివాసంలో కలిశారు. ఆయన వెంట కార్పొరేటర్ సుచరిత రెడ్డి ఉన్నారు.

నెక్స్ట్ మూవీ క్రైమ్ థ్రిల్లర్

టాలీవుడ్‌లో కొత్త ట్రెండ్‌ను సృష్టించిన 'అర్జున్ రెడ్డి' చిత్రంతో దర్శకుడిగా భారీ క్రేజ్‌ను సంపాదించుకున్నాడు సందీప్ రెడ్డి వంగా. ఈ చిత్రంతో యంగ్ హీరో విజయ్ దేవరకొండ రాత్రికి రాత్రే స్టార్ అయిపోయాడు. ప్రస్తుతం అతనికి యూత్‌లో మంచి పాపులారిటీ ఉంది. ఇక ఈ చిత్రం తర్వాత దర్శకుడు సందీప్ రెడ్డి స్టార్ హీరోతో సినిమా చేయనున్నాడని వార్తలు వినిపించాయి. ఈ సినిమా గురించి చర్చలు కూడా జరుగుతున్నాయని టాక్ వచ్చింది. అవి ఎంత వరకు నిజమో తెలియదు కానీ సందీప్ నెక్స్ట్ మూవీ మాత్రం ఒక క్రైమ్ డ్రామా అని తెలిసింది. మొన్నటి వరకు ఒక సీరియల్ కిల్లర్ సినిమా ఇదని అన్నారు. కానీ ఇప్పుడు రోమాలు నిక్కపొడిచే క్రైమ్ థ్రిల్లర్ అని దర్శకుడి సన్నిహితులు అంటున్నారు. కొన్ని హత్యలు చేసే హంతకుడిని పట్టుకోవడమే ఈ సినిమా కథ అట. స్క్రిప్ట్ మొత్తం సిద్ధమైందట. కానీ హీరో ఎవరు అనేది సస్పెన్స్‌గా ఉంది. ముగ్గురు హీరోలను దర్శకుడు కలవాలని అనుకుంటున్నాడట. వారిలో ఒకరు హీరోగా సెట్ అయిన తర్వాత ఈ చిత్రం గురించి దర్శకుడు సందీప్ రెడ్డి వంగా అధికారికంగా ప్రకటిస్తాడని తెలిసింది.




సిజి వర్క్ కోసం ముంబయ్‌కి...


చిరంజీవి

మెగాస్టార్ చిరంజీవి 151వ చిత్రం 'సైరా... నరసింహారెడ్డి'. ఈ ఏడాది రానున్న అత్యంత ప్రతిష్ఠాత్మకమైన చిత్రాల్లో ఇది ఒకటి. రామ్‌చరణ్ నిర్మాతగా భారీ బడ్జెట్‌తో ఈ చిత్రం రూపుదిద్దుకుంటోంది. ఈ సినిమా కోసం చిరంజీవి తన కెరీర్‌లో ఎన్నడూ కష్టపడని విధంగా పనిచేస్తున్నాడు. అయితే తాజాగా ఈ స్టార్ హీరో ముంబయ్‌కి వెళ్లాడు. దీంతో ఆయన అక్కడికి ఎందుకు వెళ్లాడు? అనే ప్రశ్న అందరిలోనూ కలిగింది. అసలు విషయం ఏమిటంటే... మొన్నటివరకు చిరంజీవి మీసాలు, వెరైటీ గడ్డంతో కనిపించిన సంగతి తెలిసిందే. అయితే 'సైరా...' సినిమాలో సిజి వర్క్ కోసం క్లీన్‌గా షేవ్ చేసుకొని ఆయన ముంబయ్ వెళ్లాడు. కొన్ని ముఖ్యమైన సన్నివేశాల సీజి వర్క్ కోసమని అక్కడే ఉన్నాడట. అక్కడ మెగాస్టార్ ముఖాన్ని మోషన్ క్యాప్చర్ సాయంతో గ్రాఫిక్స్‌వారు క్యాప్చర్ చేయనున్నారట. ఇటీవల సురేందర్ రెడ్డి ఈ సినిమాకు సంబంధించిన కొన్ని యాక్షన్ సన్నివేశాలను హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో తెరకెక్కించిన సంగతి తెలిసిందే. ఇక మరికొన్ని రోజుల తర్వాత ఒక భారీ సెట్‌లో సైరా షూటింగ్ కొనసాగనుంది.

'అజ్ఞాతవాసి' హంగామా


కీర్తిసురేష్, పవన్‌కళ్యాణ్, అను ఇమ్మాన్యుయేల్

టాలీవుడ్‌లో ప్రస్తుతం అందరు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న చిత్రం పవన్‌కళ్యాణ్ 'అజ్ఞాతవాసి'. త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా పవన్ 25వ సినిమా కావడంతో ప్రేక్షకుల్లో అంచనాలు భారీగా ఉన్నాయి. ముఖ్యంగా అభిమానులు ఈ సినిమా కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ చిత్రం సెన్సార్ పూర్తిచేసుకొని యు/ఎ సర్టిఫికెట్‌ను అందుకుంది. ఇక ఈ చిత్రం ట్రైలర్ గురువారం సాయంత్రం 6 గంటలకు విడుదలకానుంది. సినిమా యూనిట్ యూట్యూబ్‌లో ఈ ట్రైలర్‌ను రిలీజ్ చేయనుంది. ఎప్పటినుంచో ఈ ట్రైలర్ కోసం అభిమానులు ఎదురు చూస్తున్నారు. ఇటీవల రిలీజైన టీజర్‌లో పవన్ పాడిన పాట సోషల్ మీడియాలో సందడి చేస్తూనే ఉంది. ఇక ట్రైలర్ విడుదలైతే మరో కొత్త సంచలనం సృష్టింది అనడంలో ఎలాంటి సందేహం లేదు. అయితే టీజర్‌లో కొంచెం 'అత్తారింటికి దారేది' పోలికలు ఉన్నాయని కొందరు కామెంట్ చేశారు. కీర్తి సురేష్, అను ఇమాన్యుయల్ హీరోయిన్లుగా నటించిన ఈ చిత్రానికి అనిరుధ్ సంగీతాన్ని అందించాడు. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ బ్యానర్‌పై రూపొందిన ఈ చిత్రాన్ని ఎస్.రాధాకృష్ణ నిర్మించారు. ఈ సినిమా సంక్రాంతి కానుకగా ఈనెల 10న ప్రేక్షకుల ముందుకు రానుంది.

కొత్త లుక్ ఎప్పుడో?


నాని

ఈ రోజుల్లో వరుసగా హిట్స్ అందుకోవడం అంటే సాధారణమైన విషయం కాదు. ఇలా వరుసగా విజయాలను అందుకుంటున్న యంగ్ స్టార్ నానీకి ఇప్పుడు టాలీవుడ్‌లో భారీ క్రేజ్ ఉంది. అయితే మొదటి సినిమా నుంచి ఇప్పటివరకు తన హెయిర్ స్టైల్‌లో కానీ బాడీలో కానీ పెద్దగా మార్పులు చేయలేదు ఈ యంగ్ స్టార్. ఆమధ్య 'జెండాపై కపిరాజు' సినిమాలో కాస్త వెరైటీ లుక్‌తో కనిపించాడు. కానీ ఆ చిత్రం సక్సెస్ కాలేకపోయింది. ప్రస్తుతం రెగ్యులర్ లుక్‌తో వరుసగా హిట్స్‌ను అందుకుంటున్న నానీపై కొందరు కామెంట్ చేస్తున్నారు. ఆ మచ్చ తొలగిపోవాలంటే ప్రయోగం చేయాల్సిందేనని మరికొందరు అంటున్నారు. అయితే నాని కొత్తగా ప్రయత్నిద్దామని అనుకుంటే అలాంటి పాత్రలు దక్కడం లేదు. ఫిట్‌నెస్ విషయంలో కూడా ఎలాంటి మార్పులకైనా సిద్ధమని అతను అంటున్నాడు. అయితే కథ డిమాండ్ చేస్తేనే నాని బాడీ పెంచుతానని అంటున్నాడు. ఈరోజుల్లో యంగ్ హీరోలు అందరూ ప్రతి సినిమాలో డిఫరెంట్‌గా కనిపించేందుకు ప్రయత్నిస్తున్నారు. మరి రాబోయే రోజుల్లో నానీ కొత్త లుక్‌తో కనిపిస్తాడేమో చూడాలి.

సాయిధరమ్‌తేజ్ ఇంటెలిజెంట్

యంగ్ హీరో సాయిధరమ్‌తేజ్ ప్రస్తుతం వి.వి.వినాయక్ దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. గత ఏడాది సెప్టెంబర్‌లో మొదలైన ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం చివరి దశకు చేరుకుంది. ఇటీవలే మస్కట్‌లో షెడ్యూల్ కూడా ముగిసింది. అయితే ఈ చిత్రానికి ఇంతకుముందు 'ధర్మ భాయ్' వంటి టైటిల్స్ వినిపించినా అవేమీ నిజం కాదట. తాజాగా ఈ చిత్రానికి 'ఇంటెలిజెంట్' అనే టైటిల్‌ను ఖాయం చేసినట్టు తెలిసింది. పెద్ద బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ సినిమాకు ఎస్.తమన్ సంగీతాన్ని అందిస్తున్నాడు. లావణ్య త్రిపాఠి హీరోయిన్‌గా నటిస్తోంది. సి.కళ్యాణ్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 9న విడుదల చేయనున్నారు. ఇటీవల వచ్చిన 'జవాన్' ఆశించిన ఫలితాన్ని ఇవ్వకపోవడంతో ఈ చిత్రంపై ఎన్నో ఆశలు పెట్టుకున్నాడు సాయిధరమ్ తేజ్.


సాయిధరమ్‌తేజ్

సాయి పల్లవి డేట్స్ కోసం...


సాయి పల్లవి

టాలీవుడ్‌లో హీరోలు హిట్ కొడితే బిజీ అవడానికి కొంచెం సమయం పడుతుంది. కానీ హీరోయిన్‌లకు హిట్ వస్తే మాత్రం వెంట వెంటనే సినిమాలను ఓకే చేస్తూ బిజీ అయిపోతారు. ప్రస్తుతం ఆవిధంగా బిజీగా అయిపోయింది హీరోయిన్ సాయిపల్లవి. ఈ మలయాళీ బ్యూటీ అదృష్టం ఏమిటో కానీ తన సహజమైన నటనతో అందరినీ ఆకట్టుకుంటోంది. ప్రస్తుతం ఆమె వరుసగా సినిమాలు చేస్తూ బిజీగా ఉంది. ఎంతగా అంటే ఆమె డేట్స్ కోసం ఇతర హీరోలు డేట్స్ వదులుకునేంత. సాధారణంగా సినిమాల్లో ఎంపికైన ఏ ఒక్క నటుడు అయినా షూటింగ్‌కు హాజరు కాకపోతే ఆ సినిమాకు పనిచేసే అందరి షెడ్యూల్‌లో తేడా వచ్చేస్తుంది. అయితే సాయిపల్లవి తప్ప ఆ క్యారెక్టర్‌కు ఎవరూ సెట్ కారని చిత్ర యూనిట్ భావించడంతో శర్వానంద్ తాను సుధీర్‌వర్మతో చేయబోతున్న సినిమా డేట్స్ మొత్తాన్ని మార్చేశాడు. మరికొన్ని రోజుల్లో ప్రారంభమయ్యే ఈ సినిమా షూటింగ్‌కు అతను రెగ్యులర్‌గా హాజరుకాబోతున్నాడట. వీలైనంత తొందరగా తనకు సంబంధించిన షూటింగ్ మొత్తాన్ని పూర్తిచేసుకొని ఆతర్వాతే మరో సినిమాపై దృష్టిపెడతాడట.

అప్పుడే రసవత్తరంగా ఉంటుంది


అమలాపాల్

కొంత కాలం క్రితం తమిళ దర్శకుడు విజయ్‌ను పెళ్లి చేసుకొని అనంతరం అతనికి విడాకులు ఇచ్చేసింది అందాల తార అమలాపాల్. ఆతర్వాత తిరిగి సినిమాల్లోకి వచ్చి సందడి చేస్తోంది ఈ బ్యూటీ. ఆమె ప్రస్తుతం కోలీవుడ్‌లో వరుసగా సినిమాలు చేస్తూ ప్రేక్షకులను అలరిస్తోంది. అయితే ఈ భామ ఇటీవల తన నడుముపై తనే కామెంట్ చేసి వార్తల్లో నిలిచింది. ఓ సినిమా స్టిల్‌లో నడుము చూపించిన అమలాపాల్... తాను ఇంత హాట్‌గా ఉంటానని అనుకోలేదని కామెంట్ చేసింది. ఇప్పుడు తన పెదవులపై కూడా అదే తరహాలో మాట్లాడింది. ''సినిమాలో లిప్ కిస్ పెట్టడానికి నాకు ఎలాంటి అభ్యంతరం లేదు. కానీ ఆ సమయంలో నా పెదాలకు లిప్‌స్టిక్ ఉండడం నాకు అస్సలు నచ్చదు. లిప్‌స్టిక్ ఉంటే పూర్తి స్థాయిలో ఆ సీన్‌ను పండించలేను. అందుకే ముద్దు సన్నివేశాల్లో నేను లిప్‌స్టిక్ వాడను. అప్పుడే ఆ సీన్ రసవత్తరంగా ఉంటుంది''అని అమలాపాల్ పేర్కొనడం విశేషం. ఇక ప్రస్తుతం తాను చేస్తున్న సినిమాలో లిప్ కిస్ సన్నివేశాలు లేవని ఆమె చెప్పింది.

నిజాయితీగా ఉండటమే వారి విధి

ధను క్రియేషన్స్ పతాకంపై అల్లం భువన్ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'సారథి'. రేవంత్ జి.హెచ్, సమ్మోహిత్, అనిత రాఘవ, తేజా రెడ్డిలు హీరో హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ చిత్రం విడుదలకు సిద్ధమైంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఏర్పాటైన విలేకరుల సమావేశంలో చిత్ర దర్శక నిర్మాత అల్లం భువన్ మాట్లాడుతూ ''ఇది నా మొదటి సినిమా. హీరో, హీరోయిన్లు చక్కగా నటించారు. నేను ఈ సినిమాను ఎలా తీస్తానో అందరూ భయపడ్డారు. మొత్తం సినిమా పూర్తయ్యాక చూసి బాగా వచ్చిందని అభినందించారు. ఏ సినిమా అయినా హిట్ కావాలంటే అందులో మంచి డైలాగ్స్ ఉండాలి. ఈ సినిమాలో రంజిత్ చాలా అద్భుతమైన డైలాగ్స్ రాశారు. ఈ సినిమా కాన్సెప్ట్ విషయానికొస్తే... నిజాయితీగా ఉండటమే రాజకీయ నాయకుల, పోలీసుల విధి అనేది 'సారథి' చిత్ర సారాంశం''అని అన్నారు. హీరో రేవంత్ మాట్లాడుతూ ''ఇప్పటివరకు 25 షార్ట్ ఫిలిమ్స్‌లో నటించాను. మొదటి సారి బిగ్ స్క్రీన్‌లో హీరోగా పరిచయమవుతున్నాను. మంచి స్క్రిప్ట్‌తో భువన్ ఈ సినిమాను తెరకెక్కించారు''అని తెలిపారు. హీరోయిన్ అనిత రాఘవ మాట్లాడుతూ ''ఈ చిత్ర కథ చాలా బాగుంది. చూసేవారికి ఆసక్తికరంగా అనిపిస్తుంది. సినిమాలో మ్యూజిక్ హైలైట్‌గా ఉంటుంది''అని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జి.సురేష్‌కుమార్ పాల్గొన్నారు. భాను చందర్, మల్లాది రాఘవ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: టి.కె.పరందామ, ఎడిటింగ్: నందమూరి హరి, సంగీతం: వి.కిరణ్ కుమార్, ఫైట్స్: నాగరాజు.


రేవంత్, అనిత రాఘవ

అది కొంచెం కష్టంగానే ఉంది

ప్రస్తుతం దక్షిణాది నటీమణుల్లో తనకంటూ ఓ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకుంది నిత్యామీనన్. తన కెరీర్ ప్రారంభం నుంచి వినూత్నమైన కథల సినిమాల్లో ఆమె నటిస్తోంది. కథలో తన పాత్ర చిన్నది అయినా సరే విభిన్నంగా ఉంటేనే ఓకే చేస్తోంది. దీంతో చాలా మంది దర్శకులు ఈ హీరోయిన్‌ను స్పెషల్ క్యారెక్టర్స్‌కు తీసుకుంటున్నారు. స్టార్ హీరోలు, టాప్ డైరెక్టర్లతో ఇప్పటివరకు నిత్య చాలా సినిమాలే చేసింది. ప్రస్తుతం ఈ మలయాళీ సుందరి 'ప్రాణ' అనే సినిమాలో నటిస్తోంది. ఈ చిత్రం తెలుగు, తమిళ్, మలయాళంతో పాటు హిందీ భాషలో కూడా తెరకెక్కుతోంది. ప్రముఖ దర్శకుడు ఎ.ఎస్.ప్రకాష్ ఈ సినిమాను రూపొందిస్తున్నాడు. ఈ చిత్రంలో మొదటిసారి కొత్త తరహా సౌండ్ సిస్టమ్‌ను వాడుతున్నారట. అందుకోసం సౌండ్ ఇంజనీర్ రసూల్ పూకుట్టి చాలా కష్టపడుతున్నారని తెలిసింది. సినిమా గురించి నిత్యామీనన్ మాట్లాడుతూ ''మొదటిసారి ఒక కొత్త తరహా సినిమా చేస్తున్నాను. ప్రతి రోజు రెండు భాషల్లో ఒకే సీన్స్ చేస్తున్నాను. అది కొంచెం కష్టంగానే ఉంది. కానీ కష్టపడితేనే మంచి అవుట్‌పుట్ వస్తుంది. ఇందులో నా పాత్ర అందరినీ ఆకట్టుకుంటుంది. ఫ్రీడమ్ ఆఫ్ ఎక్స్‌ప్రెషన్ చుట్టూ ఈ కథ ఉంటుంది. ఇక బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ సినిమాను మరో స్థాయికి తీసుకెళ్తుంది''అని పేర్కొంది.


నిత్యామీనన్


భారత్ టెకీలకు స్వాగతం: ఆనంద్ మహీంద్రా



న్యూఢిల్లీ : అమెరికాలో పనిచేస్తున్న భారత ఐటీ ఉద్యోగులకు హెచ్ 1బి వీసా పొడింపు విషయంలో యుఎస్ కఠిన నిబంధనలు తీసుకువచ్చింది. దీంతో విదేశీ ఉద్యోగుల హెచ్1బి వీసా పొడిగింపు ఆందోళనకరంగా మారడంతో అనేక మంది భారత్ ఐటీ ఉద్యోగులు స్వదేశీ బాటపట్టనున్నారు. ఈ నేపథ్యంలో మహీంద్రా గ్రూప్ ఛైర్మన్ ఆనంద్ మహీంద్రా అమెరికాలో పనిచేస్తున్న భారతీయ ఐటీ ఉద్యోగులను ఉద్దేశించి బుధ వారం ట్విటర్‌లో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అమెరికాలో పనిచేస్తున్న భారత్‌కు చెందిన హెచ్1బి వీసాదారులు స్వదేశానికి వస్తే వారికి స్వాగతం పలుకుతానని అన్నారు. భారతదేశాన్ని ఐటీ రంగంలో మరింత ముందుకు తీసుకెళ్లడానికి మీరు సరైన సమయంలో వస్తున్నారని ఆయన అన్నారు. హెచ్ 1బి విషయంలో ట్రంప్ ప్రభుత్వం కఠినతర నిబంధనలు తీసుకువస్తున్న సంగతి తెలిసిందే. అమెరికన్ల ఉద్యోగాలు అమెరికన్లకే అనే నినాదంతో గతేడాది అమెరికాలో అధికారంలోకి వచ్చిన డొనాల్ ట్రంప్ విదేశీ ఉద్యోగులను వెనక్కి పంపే ప్రయత్నాలు చేస్తున్నారు. విదేశీ ఉద్యోగుల విషయంలో కఠిన వైఖరిని అవలంబిస్తున్నారు. హెచ్1బి వీసా సవరణల బిల్లు ఆచరణలోకి వస్తే భారత్‌కు చెందిన సుమారు 5లక్షల మంది నిపుణులు స్వదేశానికి రావాల్సి వస్తుంది.

ఆరు బలహీన పిఎస్‌బిలకు 7,577 కోట్ల మూలధనం

ఆర్థిక మంత్రిత్వశాఖ ఆమోదం



న్యూఢిల్లీ : మొండి బకాయిలు పేరుకుపోయి బలహీనపడిన ఆరు ప్రభుత్వరంగ బ్యాంకుల(పిఎస్‌బి)కు రూ.7,577 కోట్ల మూలధనం అందించాలనే ప్రతిపాదనకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ ఆమోదం తెలిపింది. ఆర్‌బిఐ(భారతీయ రిజర్వు బ్యాంక్) దిద్దుబాటు చర్య కింద ఈ బ్యాంకులు మూలధన సాయం పొందనున్నాయి. ఈ బ్యాంకుల్లో ఎన్‌పిఎ(నిరర్థక ఆస్తులు) పెరగడంతో ఆస్తుల నాణ్యత తగ్గిపోయింది. దీంతో మూలధన కొరత ఏర్పడి ఈ బ్యాంక్‌లు అవస్థలు పడుతున్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం సహకారం అందివ్వనుంది. 2019 మార్చి ముగింపు వరకు ఇంద్రధనుష్ పథకం కింద రూ.70 వేల కోట్ల నిధులను అందివ్వనున్నట్టు ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఐడిబిఐ బ్యాంక్, యుకో బ్యాంక్ సహా ఈ ఆరు బ్యాంకులు షేర్ల ప్రిఫరెన్షియల్ ఇష్యూ ద్వారా మూలధనం అందుకుంటాయి. కోల్‌కతాకు చెందిన యుకో బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలు మూలధనం పొందనున్నాయి. కాగా బ్యాలెన్స్ షీట్లను పటిష్టం చేసేందుకు ప్రభుత్వరంగ బ్యాంకులు తమ వద్ద తనఖా పెట్టిన ఆస్తులను అమ్మడం, బదలీ చేయడం వంటి అవకాశాలను పరిశీలించాలని కూడా ఆర్థిక మంత్రిత్వశాఖ ఇటీవల సూచించింది. తనఖా ఆస్తులను అమ్మడంలో బలంగా ఉన్న ఇతర బ్యాంకులను సంప్రదించాలని పేర్కొంది. బ్యాంకుల నిరర్థక ఆస్తులు, భారీ ఎగవేతదారులు పెరిగిన నేపథ్యంలో తనఖా ఆస్తులను అమ్మేయాలని చెప్పింది. మొండిబకాయిలు పేరుకుపోవడంతో బ్యాంకులను పటిష్ఠపరిచేందుకు రూ.2.11 లక్షల కోట్ల మూలధనాన్ని అందిస్తామని ఇటీవల ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ ప్రకటించారు. రుణాల కోసం తనఖా పెట్టిన ఆస్తులు విక్రయిస్తే కొంత భారం తగ్గుతుందని, తద్వారా బ్యాంకు ముఖ్యమైన విధులు నిర్వర్తించుకునే అవకాశాలు ఉంటాయని ప్రభుత్వం సూచిస్తోంది. చిన్న, మధ్య తరహా సంస్థల వ్యాపారాలకు అధికంగా రుణాలు ఇచ్చేందుకు ప్రభుత్వ రంగ బ్యాంకులు ప్రత్యేక శాఖలు ఏర్పాటు చేయాలని కేంద్రం పేర్కొంది. గత ఏడాది అక్టోబర్‌లో జైట్లీ ప్రభుత్వ రంగ బ్యాంకులకు రెండేళ్లకు గాను రూ.2.11 లక్షల కోట్ల రీక్యాపిటలైజేషన్‌ను అందజేస్తున్నట్టు తెలిపారు. బాండ్ల ద్వారా రూ.1.35 లక్షల కోట్ల మూలధనాన్ని, కేంద్ర బడ్జెటరీ ఫండ్ నుంచి రూ.18,139 కోట్లు, మిగతా రూ.58 వేల కోట్లు ప్రభుత్వ ఈక్విటీని తగ్గించడం ద్వారా క్యాపిటల్ మార్కెట్ నుంచి సమీకరించనున్నట్టు తెలిపారు. నిరర్థక ఆస్తులు(ఎన్‌పిఎ) పెరిగిపోయి పిఎస్‌బిల ఆస్తుల నాణ్యత ఆందోళనకరంగా మారింది.

అయితే మొండి బకాయిలు పెరిగిపోవడంతో తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్న బ్యాంకులు ఇప్పుడు కనీస బ్యాలెన్స్ చార్జీల పేరిట వసూళ్లు చేపట్టాయి. ఈ చార్జీలు బ్యాంకులకు మంచి ఆదాయాన్నే అందిస్తున్నాయి. 2017 ఏప్రిల్ నుంచి నవంబర్ వరకు ఎస్‌బిఐ(స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా) దాదాపు రూ.1,771 కోట్లను చార్జీల రూపంలో వసూలు చేసిందని ఓ నివేదిక వెల్లడించింది. ఐదేళ్ల విరామం తర్వాత గతేడాది ఏప్రిల్ నెలలో కనీస బ్యాలెన్స్ నిబంధన విధించారు. ఎస్‌బిఐ తర్వాత పంజాబ్ నేషనల్ బ్యాంకు(పిఎన్‌బి)కు కనీస బ్యాలెన్స్ చార్జీ వసూళ్లు అత్యధికంగా ఉన్నాయి. ఈ బ్యాంక్ రూ.97.34 కోట్లను వసూలు చేయగా, ఆ తర్వాత సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.68.67 కోట్లు, కెనరా బ్యాంక్ రూ.62.16 కోట్లు వసూలు చేశాయి. ప్రభుత్వరంగ బ్యాంకుల్లో పంజాబ్ అండ్ సింద్ బ్యాంక్ మాత్రమే ఏప్రిల్–నవంబర్ వ్యవధిలో ఎలాంటి కనీస బ్యాలెన్స్ చార్జీలకు వసూలు చేయలేదు.



ఎస్‌బిఐ బాటలో ప్రైవేటు బ్యాంకులు!

న్యూఢిల్లీ : దేశీయ ప్రభుత్వరంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బిఐ ఇటీవల రుణాలపై వడ్డీ రేట్లను తగ్గించిన విషయం తెలిసిందే. ఇదే బాటలో ప్రైవేటు బ్యాంకులు.. హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, ఐసిఐసిఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్ లాంటి ప్రైవేట్ దిగ్గజాలు పయనించనున్నాయని తెలుస్తోంది. త్వరలో రుణాలపై వడ్డీరేట్లను తగ్గించే దిశగా ఈ బ్యాంకులు కసరత్తులు చేస్తున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. దీంతో ఇప్పటికే ఆయా బ్యాంకుల వద్ద రుణాలు తీసుకున్న కస్టమర్లకు వడ్డీరేట్లు తగ్గవచ్చని ఊహాగానాలు వెలువడుతున్నాయి. ఎస్‌బిఐ తరహాలో చర్యలకు ఆలోచిస్తున్నామని ప్రముఖ ప్రభుత్వ రంగ బ్యాంకు ప్రతినిధి ఒకరు చెప్పారు. గత సెప్టెంబర్‌లో ఒక సారి ఎస్‌బిఐ 5 బేసిస్ పాయింట్ల మేర బేస్‌రేట్ తగ్గించింది. ఆ తర్వాత కొత్త సంవత్సరం తొలిరోజు ఎస్‌బిఐ బేస్‌రేటు తగ్గింపుతో 8.65 శాతానికి వడ్డీ రేటు దిగివచ్చింది. నిజానికి వడ్డీరేట్లను ఆర్‌బిఐ తగ్గించిన ప్రతిసారీ, బ్యాంకులు ఖాతాదారులు ఈ ప్రయోజనాన్ని బదిలీ చేయాలని సూచిస్తూనే ఉంది. అయితే బ్యాంకులు బేస్‌రేట్ తగ్గింపు విషయంలో వాయిదా వేస్తూ వస్తున్నాయి. ప్రస్తుతం ప్రధాన ప్రైవేట్ బ్యాంకుల బేస్‌రేట్ 8.85 నుంచి 9 శాతం మధ్యలో ఉంది. కొన్ని పిఎస్‌బిల బేస్‌రేటే 9 శాతానికి పైనే ఉంది. కార్పొరేట్ రుణాల్లో స్తబ్దతతో బ్యాంకులు రిటైల్ రుణాల వైపు మొగ్గాయి.

CLOSING SENSEX REPORT



స్టాక్ మార్కెట్

ఈరోజు మార్కెట్	ముగింపు	మార్పు	%
సెన్సెక్స్	33793.38	-18.88	-0.06%
నిఫ్టీ	10443.20	-1.00	-0.01%

కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	64.89
యూరో	75.33
బ్రిటిష్ పౌండ్	85.18
ఆస్ట్రేలియన్ డాలర్	49.84
కెనెడియన్ డాలర్	50.64
ఎమిరైట్ దిర్హామ్	17.67
స్విస్ ఫ్రాంక్	64.97
చైనీస్ యువాన్	9.76
మలేషియన్ రింగిట్	15.3
న్యూజిలాండ్ డాలర్	44.67
హాంగ్‌కాంగ్ డాలర్	8.31
జపనీస్ యెన్	0.57
కువైట్ దినార్	214.41
సౌతాఫ్రికన్ రాండ్	4.59

బులియన్




బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22క్యారట్	24క్యారట్	మార్పు(%)
చెన్నై	28190	30149.73	0.11%
ముంబై	28960	30973.26	0.38%
ఢిల్లీ	28400	30374.33	0%
కోల్‌కతా	29030	31048.13	0%
కేరళ	27350	29251.34	0%
బెంగళూరు	27500	29411.76	0%
హైదరాబాద్	28190	30149.73	0.25%
గల్ఫ్	–	–	–

వెండి ధర (రూ./ కిలో)

నగరం	బుధవారం	మంగళవారం	మార్పు (%)
చెన్నై	42000.00	41600.00	0.96
ముంబై	42000.00	41600.00	0.96
ఢిల్లీ	42000.00	41600.00	0.96
కోల్‌కతా	42000.00	41600.00	0.96
హైదరాబాద్	42000.00	41600.00	0.96



కోడిగుడ్లు (100కు) నెక్ రేటు

హైదరాబాద్	350	విశాఖపట్నం	366
వరంగల్	351	చిత్తూరు	368
విజయవాడ	360	చెన్నై	375
గోదావరి	360	బెంగళూరు	355



3% నష్టపోయిన డా.రెడ్డీస్, విప్రో

న్యూఢిల్లీ : కొత్త సంవత్సరంలో స్టాక్‌మార్కెట్ తీవ్ర ఒడిదుడుకులను ఎదుర్కొంటోంది. అంతర్జాతీయ పరిణామాలు, అలాగే వచ్చే వారంలో దేశీయ కార్పొరేట్ మూడో త్రైమాసిక(అక్టోబర్–డిసెంబర్) ఫలితాలు ప్రారంభం కానుండడంతో ఇన్వెస్టర్లు జాగ్రత్త వహిస్తున్నారు. మార్కెట్లో డా.రెడ్డీస్, విప్రో షేర్లు భారీగా నష్టపోయాయి. వచ్చే వారం క్యూ3 ఫలితాలను టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, ఇన్ఫోసిస్ కంపెనీలతో సహా పలు కంపెనీలు వెల్లడించనున్నాయి. 2016 ఆఖరులో నోట్ల రద్దు నిర్ణయం, 2017లో జిఎస్‌టి అమలు నేపథ్యంలో మందగమన చోటు చేసుకుని ఇప్పుడిప్పుడే ఆర్థిక వ్యవస్థ కోలుకుంటోంది. ఈ నేపథ్యంలో కార్పొరేట్ ఫలితాలు ఎలా ఉండనున్నాయోనని ఇన్వెస్టర్లు ఎదురుచూస్తున్నారు. ఫలితాల పట్ల వారు ఆచితూచి వ్యవహరిస్తున్నారు. 'అంతర్జాతీయ పరిణామాలు ఆందోళనకరంగా ఉండడం. మరోవైపు క్యూ3 ఫలితాలు ప్రకటించనుండతో ఇన్వెస్టర్లు అప్రమత్తమయ్యారు. అలాగే బహిరంగ అంశాలు ప్రాథమికంగా ప్రభావం చూపుతున్నాయి' అని రెలిగేర్ బ్రోకింగ్ సంస్థ ప్రతినిధి జయంత్ మాంగలిక్ అన్నారు. మార్కెట్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 19 పాయింట్లు నష్టపోయి 33,793 వద్ద ముగిసింది. మరోవైపు నిఫ్టీ సూచీ 1 పాయింట్ పెరిగి 10,443 పాయింట్ల వద్ద స్థిరపడింది. బిఎస్‌ఇలో రంగాల వారీగా చూస్తే ఒక్క ఆటో రంగం తప్ప మిగతా అన్నీ లాభాల్లోనే కొనసాగాయి. వీటిలో మెటల్ సూచీలు 1.47 శాతం లాభపడగా, ఆ తర్వాత క్యాపిటల్ గూడ్స్, రియాల్టీలు వరుసగా 1.22 శాతం, 1.21 శాతం మేరకు లాభపడ్డాయి.

రెడ్డీస్ ల్యాబ్‌కు మరో షాక్

ఫార్మా దిగ్గజం డాక్టర్ రెడ్డీస్ లాబొరేటరీస్‌కి మరోసారి షాక్ తగిలింది. రెడ్డీస్ ల్యాబ్‌కు చెందిన దువ్వాడ ప్లాంటుకి ఇఐఆర్(ఎస్టాబ్లిష్‌మెంట్ ఇన్‌స్పెక్షన్ రిపోర్ట్)ను యుఎస్‌ఎఫ్‌డిఎ(అమెరికా ఆరోగ్య) జారీ చేసింది. దీంతో బుధవారం నాటి ట్రేడింగ్‌లో డా.రెడ్డీస్ టాప్ లూజర్‌గా నిలిచింది. ట్రేడర్ల అమ్మకాలతో 4.5 శాతం పతనమైంది. ఆంధ్రప్రదేశ్, విశాఖ దగ్గర్లోని దువ్వాడ ప్లాంట్‌కు ఇఐఆర్ జారీతో కంపెనీ షేరు నష్టపోయింది. ఫార్మా సెక్టార్‌లో ఓఏఐ(ఆఫీషియల్ యాక్షన్ ఇనిషియేటెడ్) అంటే నియంత్రణా సంబంధిత చర్యలకు ఉపక్రమించినట్టేనని విశ్లేషకులు చెబుతున్నారు. 2017 ఫిబ్రవరి–మార్చి తనిఖీలలో యుఎస్‌ఎఫ్‌డిఎ దువ్వాడ ప్లాంటుపై 13 అబ్జర్వేషన్స్‌ను నమోదు చేసింది. ఈ ప్లాంటు నుంచి రెడ్డీస్ ఇంజెక్టబుల్స్‌ను రూపొందిస్తోంది. 2015 నుంచి వెలిబుచ్చుతున్న అభ్యంతరాల నివారణకు కంపెనీ తగిన చర్యలు చేపట్టలేదంటూ ఎఫ్‌డిఎ పేర్కొన్నట్లు సమాచారం. తాజా సమాచారంపై కంపెనీ ఇంకా స్పందించాల్సి ఉంది. అమెరికా డ్రగ్ రెగ్యులేటరీ కంపెనీకి మూడు హెచ్చరిక లేఖను జారీ చేసింది. దువ్వాడ ప్లాంట్ సహా దాని తనిఖీ బృందాలు ఆమోదయోగ్యమైన సమస్యలను ఉన్నట్టు గుర్తించిన సంగతి తెలిసిందే.

7 శాతానికి దిగువనే జిడిపి వృద్ధి రేటు

- **నోట్ల రద్దు, జిఎస్‌టిలే**
  కారణం : నిపుణుల అంచనా



న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దేశీయ ఆర్థిక వృద్ధి రేటు 7 శాతానికి దిగువనే ఉండనుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. డీమానిటైజేషన్(నోట్ల రద్దు), జిఎస్‌టి(వస్తు, సేవల పన్ను) వంటి నిర్ణయాల వల్ల వృద్ధి రేటు నెమ్మదించిందని అంటున్నారు. కేంద్ర గణాంకాల శాఖ(సిఎస్‌ఒ) శుక్రవారంనాడు అంచనాలను వెల్లడించనున్న నేపథ్యంలో నిపుణులు ఈవిధంగా స్పందించారు. సరిదిద్దే చర్యలు చేపట్టకపోయినట్లయితే 2017–18 ఆర్థిక సంవత్సరంలో జిడిపి(స్థూల దేశీయోత్పత్తి) 7 శాతాన్ని దాటడం కష్టమేనని.. మూడో, నాలుగో త్రైమాసికంలో ఆర్థిక వృద్ధి మెరుగయ్యే అవకాశముందని ఎస్‌బిఐ రీసెర్చ్ చీఫ్ ఎకనమిస్ట్ సౌమ్య కాంతి ఘోష్ అన్నారు. జిడిపి వృద్ధి రేటు 6.5 శాతంలో ఎలాంటి మార్పు ఉండబోదని అన్నారు. ప్రణాళికా సంఘం మాజీ డిప్యూటీ చైర్మన్ మాంటెక్ సింగ్ అహ్లువాలియా కూడా ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి వృద్ధి రేటును 6.2 శాతం నుంచి 6.3 శాతం మధ్య అంచనా వేశారు. యాక్సిస్ బ్యాంక్ చీఫ్ ఎకనమిస్ట్ సుగత భట్టాచార్య మాట్లాడుతూ, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి జివిఎ(గ్రాస్ వాల్యూ యాడెడ్) 6.6 శాతం నుంచి 6.8 శాతం మధ్య ఉండనుందని అన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పన్ను వసూళ్లను పరిశీలనలోకి తీసుకోవడం లేదని, అయితే పన్ను వసూళ్లు వేగంగా ఉన్నట్లయితే జిడిపి వృద్ధి పెరుగుతుందని అన్నారు. ప్రణాళికా సంఘం మాజీ సభ్యుడు, సీనియర్ ఆర్థికవేత్త అభిజిత్ సేన్ అంచనా ప్రకారం, జిడిపి వృద్ధి రేటు 6 శాతం నుంచి 6.5 శాతం మధ్య ఉండే అవకాశముంది. జిఎస్‌టి ప్రారంభించిన తర్వాత పన్ను వసూళ్లు ఆశించనంతగా లేకపోవడం వంటి పలు కారణాలు జిడిపి వృద్ధి రేటుపై ప్రభావం చూపనున్నాయని తెలిపారు.

బిట్‌కాయిన్ బుడగ పేలనుందా?

న్యూఢిల్లీ: క్రిప్టో కరెన్సీ బిట్ కాయిన్‌కి ఈ ఏడాది ఆరంభంలో ఎదురుదెబ్బ తగిలింది. రెండేళ్లుగా ఏడాది తొలి రోజు లాభాల్లో దూసుకెళ్లిన ఈ కరెన్సీ విలువ 2015 తర్వాత తొలిసారి తగ్గింది. 2018 తొలి రోజైన సోమవారం బిట్‌కాయిన్ విలువ న్యూయార్క్‌లో 13,624.56 డాలర్లకు పడిపోయింది. అంతకుముందు ఆదివారం దీని విలువ 14,156 డాలర్లుగా ఉంది. శుక్రవారం నాటి విలువతో పోలిస్తే బిట్‌కాయిన్ విలువ 4.8 శాతం తగ్గిందని ఓ మీడియా సంస్థ వెల్లడించింది. గతేడాది డిసెంబర్ 18న తొలిసారిగా 19,511 డాలర్ల గరిష్ఠాన్ని చేరిన బిట్‌కాయిన్, ప్రపంచం మొత్తం దృష్టిని ఆకర్షించింది. 2017లో జనవరి 1న 3.6 శాతం దీని విలువ పెరిగింది. అప్పట్లో దీని విలువ 998 డాలర్లుగా ఉండగా, ఏడాదిలో 1300 శాతం దీని విలువ పెరిగింది. 2016 జనవరి ఒకటో తేదీన కూడా దీనివిలువ 0.873 శాతం పెరిగింది. కాగా, 2015లో 1.855శాతం బిట్‌కాయిన్ విలువ తగ్గింది. రెండేళ్ల తర్వాత తొలిసారిగా ఆరంభంలో బిట్‌కాయిన్‌కు ఎదురుదెబ్బ తగిలినట్లయింది. వచ్చే రోజుల్లోనే దీని విలువ మరింత పడిపోయే అవకాశముందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

రూ. 2వేలకే మైక్రోమాక్స్ స్మార్ట్‌ఫోన్



న్యూఢిల్లీ: గత నెల ప్రారంభంలో 'గూగుల్ ఫర్ ఇండియా 2017' కార్యక్రమంలో గూగుల్ సరికొత్త ఆండ్రాయిడ్ ఓరియో(గో ఎడిషన్)ను ప్రకటించడం వెనుక లక్ష్యం భారత్ వంటి దేశాల్లో మార్కెట్‌ను విస్తరించుకోవడమే.. ఇప్పుడు తొలి ఆండ్రాయిడ్ గో స్మార్ట్‌ఫోన్‌ను ఈ నెలలో లాంచ్ చేసేందుకు సిద్ధమవుతోంది. దీనికి గాను దేశీయ స్మార్ట్‌ఫోన్ తయారీ సంస్థ మైక్రోమాక్స్‌తో జట్టు కట్టింది. గూగుల్‌తో ఒప్పందం చేసుకున్న మైక్రోమాక్స్ త్వరలోనే రూ.2 వేల లోపు స్మార్ట్‌ఫోన్‌ను విడుదల చేసేందుకు రంగం సిద్ధం చేసుకుంటోంది. ఇందులో 512 ఎంబి, 1జిబి ర్యామ్ కలిగిన వేరియెంట్లను విడుదల చేయనున్నారు. ఇక మిగిలిన ఫీచర్ల విషయానికి వస్తే 4 అంగుళాల డిస్‌ప్లే, 8 జిబి స్టోరేజ్, క్వాడ్‌కోర్ ప్రాసెసర్, డ్యుయల్ సిమ్, 4జి వోల్ట్ వంటి ఫీచర్లను ఈ ఫోన్‌లో ఏర్పాటు చేయనున్నారు. ఈ ఫోన్‌లో గూగుల్ రీసెంట్‌గా విడుదల చేసిన గూగుల్ గో, మ్యాప్స్ గో, జిమెయిల్ గో, యూట్యూబ్ గో, అసిస్టెంట్ గో, ఫైల్స్ గో తదితర లైట్ వెయిట్ యాప్స్‌ను ప్రీ ఇన్‌స్టాల్డ్ అందివ్వనున్నారు. ఈ నెల చివర్లో ఈ బడ్జెట్ స్మార్ట్‌ఫోన్‌ను మైక్రోమ్యాక్స్ విడుదల చేసే అవకాశం ఉంది.

త్వరలో షియోమీ నోట్-5 ఫోన్



న్యూఢిల్లీ: చైనా మొబైల్ ఫోన్ తయారీ సంస్థ షియోమీ ఫోన్లకు భారత్ ఉన్న క్రేజ్ అంతా ఇంతా కాదు. గతంలో విడుదలైన రెడ్‌మీ నోట్ 4 షియోమీకి ఎంతటి లాభాలను తెచ్చి పెట్టిందో అందరికీ తెలిసిందే. షియోమీ తన నూతన స్మార్ట్ ఫోన్ రెడ్‌మీ నోట్ 5 ను త్వరలో విడుదల చేయనుండడంతో అందరి దృష్టి ఈ ఫోన్‌పై నెలకొంది. ఏప్రిల్ మొదటి వారంలో ఈ ఫోన్‌ను విడుదల చేయవచ్చని తెలుస్తోంది. ఫోన్‌కు చెందిన పలు ఇమేజ్‌లు, స్పెసిఫికేషన్లు ప్రస్తుతం నెట్‌లో లీకై హల్‌చల్ చేస్తున్నాయి. వాటిలో నోట్ 5 ఫీచర్ల వివరాలు ఇలా ఉన్నాయి. 5.99 ఇంచ్ ఫుల్ హెచ్‌డి ప్లస్ భారీ డిస్‌ప్లే, స్నాప్‌డ్రాగన్ 632 ప్రాసెసర్, 3/4 జిబి ర్యామ్, 32/64 జిబి స్టోరేజ్, డ్యుయల్ సిమ్, ఆండ్రాయిడ్ 7.1 నౌగట్, 13 మెగాపిక్సల్ బ్యాక్ కెమెరా, 5 మెగాపిక్సల్ సెల్ఫీ కెమెరా, 4జి వోల్ట్, 4000 ఎంఏహెచ్ బ్యాటరీ తదితర ఫీచర్లు ఉండే అవకాశం ఉన్నట్లు సమాచారం.

టాప్ గెయినర్స్ (+)

కంపెనీ పేరు	గరిష్టం	కనిష్టం	ముగింపు ధర	క్రితం ముగింపు	మార్పు	లాభం %
అదాని పోర్ట్స్	410.90	397.45	407.65	397.40	10.25	2.58
లార్సెన్	1,283.95	1,251.50	1,275.30	1,249.75	25.55	2.04
ఐసిఐసిఐ బ్యాంకు	316.35	312.50	315.00	309.70	5.30	1.71
హిందాల్కో	279.35	273.10	276.50	271.90	4.60	1.69
అంబుజా సిమెంట్	273.30	267.35	272.60	268.15	4.45	1.66
వేదాంత	335.25	329.05	332.50	327.75	4.75	1.45
యస్ బ్యాంకు	316.50	311.15	315.85	311.65	4.20	1.35
అల్ట్రాటెక్ సిమెంట్	4,314.00	4,245.40	4,301.95	4,252.30	49.65	1.17
హెచ్‌పిసిఎల్	416.95	405.90	410.95	406.40	4.55	1.12
టాటా పవర్స్	101.60	99.60	100.80	99.70	1.10	1.10

టాప్ లూజర్స్ (-)

కంపెనీ పేరు	గరిష్టం	కనిష్టం	ముగింపు ధర	క్రితం ముగింపు	మార్పు	నష్టం %
డా.రెడ్డీస్ ల్యాబ్స్	2,386.50	2,292.10	2,339.00	2,409.20	70.20	2.91
విప్రో	320.40	308.75	309.95	318.70	8.75	2.75
ఒఎన్‌జిసి	197.40	193.00	193.45	196.85	3.40	1.73
బజాజ్ ఆటో	3,310.20	3,231.55	3,241.05	3,294.75	53.70	1.63
మారుతి సుజికి	9,598.00	9,402.00	9,416.60	9,554.05	137.45	1.44
టాటా మోటార్స్	441.40	431.95	433.90	439.30	5.40	1.23
హెచ్‌డిఎఫ్‌సి	1,878.25	1,851.20	1,852.65	1,872.35	19.70	1.05
ఎన్‌టిపిసి	180.30	176.75	177.05	178.90	1.85	1.03
బిపిసిఎల్	504.90	493.40	494.90	499.80	4.90	0.98
ఆరబిందో ఫార్మా	674.30	663.80	665.55	671.40	5.85	0.87

ఇస్రో ఉపగ్రహాలతో రైల్వే ఇంజిన్ల అనుసంధానం

న్యూఢిల్లీ: డిసెంబర్ 2018 నాటికి రైల్వే ఇంజన్లను ఇస్రో ఉపగ్రహాలతో అనుసంధానం చేయాలని భారత రైల్వే లక్ష్యంగా ఎంచుకుంది. దీంతో రైళ్లను గుర్తించడంతోపాటు వాహనాన్ని నడిపే సిబ్బందితో సంభాషించడం సులభతరమవుతుందని అధికారులు తెలిపారు. మొత్తం 10,800 రైల్వే ఇంజిన్లకు యాంటెన్నాలను అమర్చనున్నారు. దీనిని డ్రైవర్ క్యాబిన్ లోపల నుంచి సిబ్బంది పర్యవేక్షిస్తారని రైల్వే సీనియర్ అధికారులు తెలిపారు. 10 రైల్వే ఇంజిన్లను ఇప్పటికే ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టామని, ఏడాది చివరి నాటికి అన్ని రైలు ఇంజిన్లను యాంటెన్నాలు అమర్చుతామని రైల్వే బోర్డు సీనియర్ మెంబర్ ఒకరు తెలిపారు. ఇస్రో ఉపగ్రహాల సహాయంతో రైళ్ల కదలికలను గమనించడంతోపాటు మానవ రహిత రైల్వే క్రాసింగ్‌ల వద్ద ప్రమాదాలను నివారించడానికి వీలవుతుంది. ఇస్రోతో పైలట్ ప్రాజెక్టులో భాగంగా స్పేస్ ఏజెన్సీ అభివృద్ధి చేసిన ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్ (ఐసి) చిప్‌లను కొన్ని రైళ్ల ఇంజిన్లకు అమర్చారు. భారత ప్రాంతీయ మార్గదర్శి ఉపగ్రహాల (ఎన్‌ఎవిఐసి) ద్వారా మానవ రహిత రైల్వే క్రాసింగ్‌ల వద్ద రోడ్డు మార్గంలో ప్రయాణించే వారిని హెచ్చరించేందుకు స్టీమ్ సైరన్లను అమర్చనున్నారు.





రాజ్యసభ అభ్యర్థులను ప్రకటించిన ఆప్

న్యూఢిల్లీ : రాజ్యసభ ఎన్నికలకు ఆమ్ ఆద్మీ పార్టీ తన అభ్యర్థుల పేర్లను ప్రకటించింది. మూడు స్థానాలకు ఈ నెల 16న ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో సంజయ్ సింగ్, సుశీల్ గుప్తా, ఎన్‌డి గుప్తాను తమ అభ్యర్థులని బుధవారంనాడు వెల్లడించింది. ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ నివాసంలో జరిగిన సమావేశం అనంతరం మనీశ్ సిసోడియా మీడియాకు అభ్యర్థుల పేర్లను ప్రకటించారు. ఎంపికైన అభ్యర్థుల్లో సంజయ్ సింగ్ ఆప్ ఏర్పడినప్పటి నుంచి పార్టీ సభ్యుడిగా ఉన్నారు. ఢిల్లీ, హర్యానా ప్రాంతంలో విద్య, వైద్యాభివృద్ధికి తన వంతు కృషి చేశారు. సుమారు 15వేల మంది చిన్నారులకు ఉచిత విద్యను అందిస్తున్నారు. సుశీల్ గుప్తా ఢిల్లీకి చెందిన వ్యాపారవేత్త, ఎన్‌డి గుప్తా ఛార్టెడ్ అకౌంటెంట్. ఢిల్లీలో ఆప్‌కు మెజార్టీ ఎంఎల్‌ఎలు ఉన్న నేపథ్యంలో వీరి ఎన్నిక నల్లేరు మీద నడక కానుంది. ఈ నెల 5తో నామినేషన్లకు గడువు ముగియనుంది. రాజ్యసభ సీటును కోరుతున్న ఆ పార్టీ నేత కుమార్ విశ్వాస్ కేజ్రీవాల్‌పై నిప్పులగక్కారు. 'నిజమైన పోరాట యోధునికి ఇది నైతిక విజయం. నా బలిదానాన్ని అంగీకరించి కేజ్రీవాల్‌కు కృతజ్ఞతలు అని అభివర్ణించారు. కార్పొరేట్లకు కొమ్ము కాస్తున్నామని పదేపదే తమపై దుమ్మెత్తి పోసే కేజ్రీవాల్ ఇప్పుడేం సమాధానమిస్తారని, ఆయన ఇద్దరు వ్యాపారవేత్తలకు రాజ్యసభ టికెట్లు ఎలా ఇచ్చారని బిజెపి ప్రశ్నించింది.

ఎంఎస్ సుబ్బులక్ష్మి కుమార్తె రాధా విశ్వనాథన్ కన్నుమూత



బెంగళూరు: ప్రముఖ సంగీత విద్వాంసురాలు ఎంఎస్ సుబ్బులక్ష్మి కుమార్తె , కర్నాటక సంగీత విద్వాంసురాలు రాధా విశ్వనాథన్ (83) బెంగళూరులోని ప్రైవేట్ ఆస్పత్రిలో మృతి చెందినట్లు ఆమె కుటుంబ సభ్యులు తెలిపారు. శ్వాస సంబంధిత సమస్యలతో బాధ పడుతున్న రాధా విశ్వనాథన్ మంగళవారం రాత్రి తుదిశ్వాస విడిచారు. భారత రత్న ఎంఎస్ సుబ్బులక్ష్మి దేశ, విదేశాల్లో సంగీత కచేరీలు నిర్వహించినప్పుడు ఆమెతో కలిసి పని చేశారు. ఎంఎస్ సుబ్బులక్ష్మితో కలిసి రాధా విశ్వనాథన్ 'ఆమనీ మనాధో మాన్యో లోకాస్వామి త్రిలోకాద్రుత్' పాటను ఆలపించినట్లు ఆమె తనయుడు వి శ్రీనివాసన్ ఫేస్‌బుక్‌లో పోస్టు చేశారు. ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది దేవాలయాల్లో వినిపించే 'వెంకటేశ్వర సుప్రభాతం', 'విష్ణు సహస్రనామం', 'భజగోవిందం' వంటి సుప్రసిద్ధ పాటలను సుబ్బులక్ష్మితో కలిసి రాధా విశ్వనాథన్ ఆలపించారు. ఆమెకు ఇద్దరు కుమారులు, కుమార్తె , ఇద్దరు మనవరాళ్లు ఉన్నారు.

రెండు ఎయిమ్స్‌లకు గ్రీన్ సిగ్నల్

న్యూఢిల్లీ : బిలాస్‌పూర్, హిమాచల్ ప్రదేశ్‌లలో ఎయిమ్స్ ఏర్పాటుకు కేంద్రం అనుమతి మంజూరు చేసింది. ప్రధాన మంత్రి స్వాస్థ్య సురక్షా యోజన కింద వీటి ఏర్పాటుకు రూ.1350 కోట్లను మంజూరు చేస్తున్నట్లు ఒక అధికారిక ప్రకటన బుధవారం వెలువడింది. 750 పడకలతో కూడిన ఈ ఎయిమ్స్ సంస్థలలో 100 మంది విద్యార్థులు వైద్య విద్య అభ్యసించేందుకు ఒక మెడికల్ కాలేజీ, మరో 60 మంది విద్యార్థులు నర్సింగ్ విద్యనభ్యసించేందుకు ఒక నర్సింగ్ కాలేజీ ఉండనున్నాయని ప్రకటనలో వివరించారు. మరో రెండు సంవత్సరాల్లో సంస్థల నిర్మాణ పనులు పూర్తి కానున్నాయి. ఒక్కో ఎయిమ్స్‌లో 20 స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ డిపార్ట్‌మెంట్‌లు, 15 ఆపరేషన్ థియేటర్లు ఉండనున్నాయి. న్యూఢిల్లీ ఎయిమ్స్ తరహాలోనే రెసిడెన్సియల్ కాంప్లెక్సులు, సేవాకేంద్రాలు ఉండనున్నట్లు అధికారిక ప్రకటన తెలియజేసింది. కొత్తగా ఏర్పాటు కానున్న ఎయిమ్స్ సంస్థల్లో 30 పడకలతో కూడిన ఆయుష్ విభాగం కూడా ఉండనుంది.

జూట్ బ్యాగ్‌ల వాడకంపై గడువు పొడిగింపు : ఆహార పదార్థాల,పంచదార ఉత్పత్తుల ప్యాకేజింగ్‌లో జూట్ బ్యాగ్‌లను తప్పనిసరిగా వాడాలంటూ విధించిన గడువును 2018 జూన్ నాటికి ఆర్థిక విషయాల క్యాబినెట్ కమిటీ (సిసిఇఎ) పొడిగించింది. బుధవారం ఒక అధికార ప్రకటన విడుదల చేసింది. సిసిఇఎ తీసుకున్న నిర్ణయం కారణంగా పశ్చిమబెంగాల్, బీహార్, ఒరిస్సా,అసోం, ఆంధ్రప్రదేశ్, మేఘాలయ, త్రిపుర రాష్ట్రాలకు మేలు జరగనుంది. దేశంలో ఉన్న జూట్ పరిశ్రమ ప్రభుత్వ కొనుగోళ్లపైనే ఎక్కువగా ఆధారపడి ఉంది. వారి నుంచి ప్రతి ఏటా రూ.5,500 కోట్ల విలువైన ఉత్పత్తులను కొనుగోలు చేస్తుంది.3.7లక్షల మంది కార్మికులు, 40 లక్షల మంది రైతులు జూట్ పరిశ్రమపై ఆధారపడి ఉన్నారని గుర్తించిన ప్రభుత్వం వారి అభివృద్ధికి అనేక విధానాలను అవలంభిస్తోంది.

ప్రమాదాల్లో 19 మంది దుర్మరణం



సికార్/జైపూర్ : రాజస్థాన్‌లో రహదారులు రక్తమోడాయి. వేర్వేరుగా జరిగిన రెండు రోడ్డు ప్రమాదాల్లో 19 మంది దుర్మరణం పాలయ్యారు. మృతుల్లో నలుగురు మహిళలు, ఇద్దరు చిన్నారులు ఉన్నారు. మరో 18 మందికి గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. జాతీయ రహదారిపై బుధవారం రాజస్థాన్ ఆర్‌టిసి బస్సు ఓ ట్రక్కు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో 11మంది మృత్యువాతపడ్డారు. మరో 12 మంది క్షతగాత్రులయ్యారు. బస్సు డ్రైవర్ ముందు వెళ్తున్న మరో బస్సును ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఎదురుగా అతివేగంతో వస్తున్న ట్రక్కును ఢీకొట్టినట్లు పోలీసులు తెలిపారు. జైపూర్ జిల్లా రెన్వాల్ ప్రాంతంలో మంగళవారం అర్ధరాత్రి ఒక టెంపో, ట్రక్కు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో 8 మంది మరణించగా, ఆరుగురికి గాయాలయ్యాయి.

ఘర్షణలు బ్రిగేడ్ పనే : ఆర్‌ఎస్‌ఎస్

ఉజ్జయిన్ : మహారాష్ట్రలో హింసాత్మక ఘటనలకు బ్రేకింగ్ ఇండియా బ్రిగేడే కారణమని ఆర్‌ఎస్‌ఎస్ ఆరోపించింది. 2016లో జెఎన్‌యులో జాతి వ్యతిరేక వ్యాఖ్యలు చేసిన బ్రేకింగ్ ఇండియా బ్రిగేడ్ ప్రస్తుతం హిందూ సమాజాన్ని విడదీయడానికి ప్రయత్నిస్తోందని ఆర్‌ఎస్‌ఎస్ అధికార ప్రతినిధి మన్మోహన్ వైద్య మండిపడ్డారు. మతాలను, కులాలను అడ్డుపెట్టుకుని దేశాన్ని విడదీయాలని చూస్తున్న బ్రేకింగ్ ఇండియా బ్రిగేడ్ పనులను తాము అడ్డుకుంటామని మన్మోహన్ వైద్య అన్నారు. బుధవారం ఉజ్జయిన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. పూణెలో జరిగిన అల్లర్లలో ఆర్‌ఎస్‌ఎస్ హస్తం ఉందని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందించారు.



ముంబయిలో దళితుల ఆందోళన



కుల ఘర్షణలపై దద్దరిల్లిన రాజ్యసభ



న్యూఢిల్లీ: గోరేగావ్ కుల ఘర్షణల అంశం బుధవారం రాజ్యసభను కుదిపేసింది. కాంగ్రెస్‌తోపాటు, బిఎస్పీ సభ్యులు ఈ విషయంపై చర్చ చేపట్టాలని పట్టుబట్టడంతో సభాకార్యక్రమాలు స్తంభించిపోయాయి. సభ్యులు ఆందోళన కారణంగా సభ పలు మార్లు వాయిదా పడింది. బుధవారం ఉదయం రెండు సార్లు వాయిదా పడిన అనంతరం తిరిగి సభ ప్రారంభం కాగానే బిఎస్పీ సభ్యుడు సతీష చంద్ర మిశ్రా తన స్థానంలో నిలబడి భీమా కోరేగావ్ అల్లర్లపై చర్చ చేపట్టాలని డిమాండ్ చేశారు. శాంతికాముకులైన ప్రజలపై మహారాష్ట్రలో దాడి జరిగిందని, రాష్ట్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆయన ఆరోపించారు. చైర్మన్ వెంకయ్య నాయుడు అల్లర్ల అంశానికి ముగింపు పలికారని, ఈ విషయాన్ని ఇక్కడితో వదిలిపెట్టాలని డిప్యూటి చైర్మన్ పిజె కురియన్ వ్యాఖ్యానించారు. కురియన్ వ్యాఖ్యలకు మండిపడ్డ కాంగ్రెస్ నేత ఆనంద్ శర్మ మహారాష్ట్ర మొత్తం కుల ఘర్షణల కారణంగా తగలబడిపోతోందని, ఇటువంటి అంశంపై చర్చ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఆనంద్ శర్మతో పాటు ఇతర పార్టీలకు చెందిన పలువురు సభ్యులు కూడా చర్చకు పట్టుబట్టారు. సభ్యులు శాంతించకపోవడంతో కురియన్ సభను 3 గంటలకు వాయిదా వేశారు.

బుధవారం ఉదయం కూడా రాజ్యసభ సజావుగా సాగలేదు. సభ ప్రారంభం కాగానే చైర్మన్ వెంకయ్యనాయుడు ప్రతిపక్ష నాయకుడు గులాంనబీ ఆజాద్‌కు మాట్లాడేందుకు అవకాశం ఇచ్చారు. ఇంతలోనే బిఎస్పీ నాయకుడు మిశ్రా మహారాష్ట్ర హింస విషయాన్ని లేవనెత్తారు.భీమా కోరేగావ్ ప్రాంతంలో జరిగిన హింస వెనక బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ నేతల హస్తం ఉందని ఆయన ఆరోపించారు. మిశ్రాతో పాటు మరొకొందరు సభ్యులు కూడా కోరేగావ్ అంశంపై చర్చ చేపట్టాలని పట్టుబట్టారు. దీంతో చైర్మన్ వెంకయ్య సభను వాయిదా వేశారు. కొద్దిసేపటి తర్వాత సభ తిరిగి ప్రారంభం అయిన తర్వాత కూడా సభ్యుల తీరు మారకపోవడంతో 2 గంటల వరకు సభను వాయిదా వేశారు.

సంయమనం పాటించండి

మహారాష్ట్రలో పలు పార్టీలకు చెందిన నాయకులు ప్రజలను సంయమనం పాటించాలని కోరారు. రాష్ట్రంలో హింసాత్మక పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో వారు వివిధ మాధ్యమాల ద్వారా ఇరు వర్గాల ప్రజలకు శాంతిగా ఉండాలని కోరారు. ఎన్‌సిపి నేత సునీల్ తట్కారే, శివసేన నాయకుడు నీలం గోర్హే, మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ నాయకుడు అశోక్ చవాన్ శాంతి వచనాలను పలికారు. హింసాత్మక సంఘటనలు జరగడం దురదృష్టకరమని అశోక్ చవాన్ అన్నారు. దర్యాప్తు ఒక్కటే చాలదని, దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని అశోక్ చవాన్ కోరారు.

జిగ్నేష్ మేవానీపై ఫిర్యాదు

గుజరాత్ ఎమ్మెల్యే, దళిత నాయకుడు జిగ్నేష్ మేవానీపైనా, జెఎన్‌యు విద్యార్థి నాయకుడు ఉమర్ ఖలీద్‌పైనా కొందరు వ్యక్తులు మంగళవారం ఫిర్యాదు చేశారని పూణె పోలీసులు తెలిపారు. పూణెలో డిసెంబర్ 31న జరిగిన ఒక కార్యక్రమంలో వారిద్దరు రెచ్చగొట్టే ప్రసంగాలు చేశారని వారిపై ఫిర్యాదు చేశారు. మేవానీ, ఖలీద్ లిద్దరూ ఎల్గార్ పరిషద్ అనే ఒక కార్యక్రమానికి హాజరయ్యారు. భీమా కోరే గావ్ యుద్ధం 200వ వార్షికోత్సవం సందర్భంగా శనివార్‌వాడాలో ఈ కార్యక్రమం జరిగింది.

దళితుల విషయంలో మోడీ 'మౌని బాబా' : ఖర్గే

న్యూఢిల్లీ: దళితుల నిరసనలతో మహారాష్ట్ర అట్టుడుకుతున్న నేపథ్యంలో కాంగ్రెస్ సీనియర్ నేత, లోక్‌సభలో విపక్ష నేత మల్లికార్జున ఖర్గే ప్రధా ని నరేంద్ర మోడీపై విమర్శలు గుప్పించారు. దళితుల విషయంలో ఆయన 'మౌని బాబా' అని దుయ్యబట్టారు. దళితుల నిరసనలు తీవ్రంగా పెరుగుతున్న సమయంలో ప్రధాని మౌనం వహించకూడదని అన్నా రు. మహారాష్ట్ర నిరసనల నేపథ్యంలో నేడు పార్లమెంట్‌లో బిజెపి, కాం గ్రెస్ సభ్యులు పరస్పర విమర్శలు చేసుకున్నారు. ఖర్గే విమర్శల నేపథ్యంలో బిజెపి నేత అనంత్‌కుమార్ కాంగ్రెస్‌పై విరుచుకుపడ్డారు. ఉద్రిక్తతలు నెలకొన్న మహారాష్ట్రలో శాంతి నెలకొనడానికి కృషి చేయకుండా కాంగ్రెస్ అల్లర్లను రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేస్తోందన్నా రు. ఆ పా ర్టీ విడదీసి పాలించాలని మాట్లాడుతోందని మండిపడ్డారు. ఈ విషయంలో కాంగ్రెస్, బ్రిటిష్ వారి స్థానాన్ని భర్తీ చేస్తోందని విమర్శించారు.



రజనీ పార్టీలోకి లారెన్స్?

నేడు ప్రకటన, అదే బాటలో లైకా ప్రొడక్షన్ అధినేత మహాలింగం

చెన్నై: సూపర్‌స్టార్ రజనీకాంత్ రాజకీయాల్లోకి వస్తున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో ఆయన వెంట నడిచేందుకు పలువురు ప్రముఖులు సిద్ధమవుతున్నారు. తాజా '2.ఓ' సినిమాను నిర్మించిన లైకా ప్రొడక్షన్స్ క్రియేటివ్ హెడ్ రాజు మహాలింగం తన బాధ్యతలకు రాజీనామా చేశారు. అదే విధంగా ప్రఖ్యాత కొరియోగ్రాఫర్ లారెన్స్ కూడా రజనీ పార్టీలో చేరేందుకు సిద్ధమవుతున్నట్టు సమాచారం. రజనీ పార్టీలో చేరేందుకు మహాలింగం రాజీనామా చేసినట్లు కోలీవుడ్ వర్గాలు వెల్లడించాయి. ఈ విషయాన్ని ఆయన కూడా మీడియా ఎదుట ధృవీకరించారు. 'రజనీతో కలిసి మూడేళ్లు పని చేశాను. ఆయన వ్యక్తిత్వం, దూర దృష్టి నన్ను ఆకట్టుకున్నాయి. అందుకే లైకాకు రాజీనామా చేసి తలైవా రాజకీయ ఉద్యమంలో చేరాలని నిర్ణయించుకున్నా' అని వ్యాఖ్యానించారు. లారెన్స్ గురువారం ప్రెస్ మీట్ పెట్టి అధికారికంగా ప్రకటించే అవకాశాలున్నాయి. ఆ తర్వాత త్వరలో రజనీని కలిసి పార్టీ గురించి చర్చించే అవకాశం ఉంది. నిజానికి లారెన్స్ రజనీకి మద్దతు ప్రకటన బుధవారంనాడే చేయాలనుకున్నప్పటికీ ఆయన వీరాభిమాని ఒకరు మరణించడం, దాంతో అతని కుటుంబాన్ని పరామర్శించేందుకు లారెన్స్ వెళ్లారని అందుకే ప్రెస్ మీట్‌ను గురువారానికి వాయిదా వేశారని కోలీవుడ్ వర్గాల సమాచారం.





కరుణానిధితో రజనీకాంత్ భేటీ

ప్రముఖ సినీ నటుడు రజనీకాంత్ తన రాజకీయ రంగ ప్రవేశంపై ప్రకటన చేసిన తర్వాత డిఎంకె అధ్యక్షుడు ఎం కరుణానిధితో బుధవారం రాత్రి సమావేశమై ఆయన ఆశీస్సులు తీసుకున్నారు. తెల్లని అంగీ, నల్లని ప్యాంట్ ధరించి వచ్చిన ఆయన కరుణానిధికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి రజనీకాంత్ అడిగి తెలుసుకున్నారు. రజనీకాంత్, కరుణానిధితో సమావేశమైనప్పుడు డిఎంకె అధ్యక్షుడు ఎంకె స్టాలిన్ కూడా హాజరయ్యారు. డిసెంబర్ 31న తన రాజకీయ రంగ ప్రవేశంపై ప్రకటన చేసిన తర్వాత రజనీ కలిసిన మొదటి నాయకుడు కరుణానిధి కావడం గమనార్హం. రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షమైన డిఎంకె నేతతో ఆయన సమావేశం కావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. అయితే మర్యాదపూర్వకంగానే ఆయన కరుణానిధిని కలిశారని డిఎంకె శ్రేణులు అభివర్ణించాయి.

రన్‌వే నుంచి పక్కకు 'మిగ్'

పనాజి : భారత నౌకా దళానికి చెందిన మిగ్ 29కె విమానం గోవాలోని ఐఎన్‌ఎస్ హన్సాబేస్ నుంచి టేకాఫ్ అవుతుండగా ఒక్కసారిగా రన్‌వే నుంచి పక్కకు ఒరిగి కుప్పకూలింది. దీంతో విమానంలో మంటలు చెల రే గాయి. అప్రమత్తమైన శిక్షణ పైలట్ విమానం నుంచి సురక్షితంగా బయటపడ్డారు. ఈ ఘటన నేపథ్యంలో గోవా విమానాశ్రయంలో టేకాఫ్, ల్యాండ్ అయ్యే విమానాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగిందని విమానాశ్రయ డైరెక్టర్ డిసిహెచ్ నేగి తెలిపారు. నౌకాదళ విమానం వద్ద అత్యవసరంగా సహాయక చర్యలు చేపట్టాల్సి రావడంతో రన్‌వేను మూసివేశారు. దీంతో గోవా విమానాశ్రయానికి వచ్చేపోయే సర్వీసుల రాకపోకల్లో జాప్యం జరిగినట్లు విమానాశ్రయ అధికారులు వెల్లడించారు. బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు మిగ్ 29కె కూలిపోయిందన్నారు. ఎయిర్‌క్రాఫ్ట్ టేకాఫ్ కావడానికి ముందే రన్‌వే నుంచి పక్కకు ఒరిగిపోయిందని ప్రత్యక్ష సాక్షి ఒకరు చెప్పారు.



అహ్మదాబాద్‌లో అమానుషం

దళితుడితో బూట్లు నాకించిన పోలీసులు

అహ్మదాబాద్ : గుజరాత్‌లోని అహ్మదాబాద్ పోలీసులు ఓ దళితుడి పట్ల అమానుషంగా ప్రవర్తించారు. పోలీసు స్టేషన్‌లో ఉన్న 15 మంది షూలను అతడితో నాకించారు. హర్షద్ జాదవ్ అనే 38 ఏళ్ల దళిత వ్యక్తిని డిసెంబర్ 28 న అరెస్టు చేశారు. తాను నివసిస్తున్న ప్రాంతంలో జరిగిన ఒక గందరగోళం విషయమై ఒక పోలీసు కానిస్టేబుల్‌తో హర్షద్ జాదవ్‌కు మాటామాటా పెరిగింది. దీంతో కానిస్టేబుల్ రెచ్చిపోయాడు. హర్షద్‌పై చేయిచేసుకున్నారు. వేళ్లు పగిలేలా కొట్టాడు. స్టేషన్‌కు తరలించుకుపోయాడు. అక్కడ మరికొందరు పోలీసులు జాదవ్‌తో అమానుషంగా ప్రవర్తించారు. టెలివిజన్లు రిపైరు చేసుకునే జాదవ్ డిసెంబర్ 29న బెయిల్‌పై విడుదలయ్యాడు.అమరాయ్ వాడీ పోలీసు స్టేషన్‌లో తనను అవమానించిన కానిస్టేబుల్‌పై కేసు పెట్టాడు. తన కులం గురించి అడిగి తెలుసుకుని ఆ తర్వాత తనతో 15 మంది పోలీసుల షూస్ నాకించారని జాదవ్ తాను చేసిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. జాదవ్ ఫిర్యాదు మేరకు అతడిపై అమానుషంగా ప్రవర్తించిన కానిస్టేబుల్ వినోద్ భాయ్ బాబూ భాయ్‌పై చర్యలు చేపట్టారు. ఎస్సీ, ఎస్టీ (దురాగతాల నిరోధక) చట్టం కింద కేసు నమోదు చేశామని, ప్రస్తుతం ఈ కేసును క్రైమ్ బ్యాంచ్ దర్యాప్తు చేస్తోందని అమరాయ్ వాడీ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఓఎం దేశాయ్ తెలిపారు. కానిస్టేబుల్‌ను ఇంకా అరెస్టు చేయలేదు. ఇదిలా ఉంటే డిసిపి గిరీశ్ పాండ్యా, హర్షద్ జాదవ్ తీరును తప్పుబట్టారు. డిసెంబర్ 29న కోర్టుకు హాజరైన జాదవ్ తనపై జరిగిన అమానుషాన్ని చెప్పలేదని, డిసెంబర్ 30, 31 తేదీలలో కూడా పోలీసులకు ఫిర్యాదు చేయకపోవడాన్ని డిసిపి గుర్తుచేశారు. జనవరి 1వ తేదీన మాత్రమే జాదవ్ మరికొంత మందితో వచ్చి ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్ చేశారని దేశాయ్ మీడియాకు తెలిపారు.

జయ కేసులో డాక్టర్ సాక్ష్యం

చెన్నై: జయలలిత మృతిపై విచారణ కమిషన్ ఎదుట ఆమె మృత దేహాన్ని భద్రపరిచిన ప్రభుత్వ వైద్యురాలు సాక్ష్యమిచ్చారు. బుధవారం అర్ముగన్ స్వామి కమిషన్ ఎదుట మద్రాస్ మెడికల్ కాలేజ్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుధ శేషయన్ హాజరయ్యారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ జయలలిత మృత దేహం కుళ్లిపోకుండా భద్ర పరిచేందుకు 15 నిమిషాల్లో ప్రక్రియనంతా పూర్తి చేశామని కమిషన్‌కు తెలిపామన్నారు. డిసెంబర్ 5, 2016లో జయ లలిత మృతి చెందారు. ఆమె మృతికి దారి తీసిన పరిస్థితులు, ఆమెకు చికిత్స అందిస్తున్న సమయంలో ఆస్పత్రిలో పరిస్థితులపై తమిళనాడు ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. కమిషన్ ఎదుట ఐఎఎస్ అధికారులు, డాక్టర్లు, జయలలిత మేనకోడలు జె దీపా, మేనల్లుడు జె దీపక్ తదితరులు సాక్ష్యమిచ్చారు.

రాఫెల్ డీల్ రద్దు!

న్యూఢిల్లీ: రాఫెల్ సంస్థతో కుదుర్చుకున్న సుమారు రూ.3176 కోట్ల(500 మిలియన్ల డాలర్ల) ఒప్పందాన్ని భారత్ రద్దు చేసుకుంది. ఈ విషయాన్ని ఇజ్రాయెల్‌కు చెందిన రాఫెల్ సంస్థ బుధవారంనాడు ఓ ప్రకటనలో వెల్లడించింది. ఇజ్రాయిల్‌కు చెందిన స్పైక్ యాంటీ ట్యాంక్ క్షిపణులను కొనుగోలు చేసుకునేందుకు భారత్ గతంలో ఆ ఒప్పందాన్ని కుదుర్చుకున్నది. కానీ డిఆర్‌డిఓ రూపొందించిన మిస్సైళ్లకు అవకాశం ఇచ్చేందుకు రాఫెల్ డీల్‌ను రద్దు చేసుకున్నట్లు రక్షణ శాఖ ఇటీవల వెల్లడించింది. వాస్తవానికి ఇజ్రాయిల్ ప్రధాని బెంజిమన్ నెతన్యూ ఈ నెల 14వ తేదీన అయిదు రోజుల పర్యటన నిమిత్తం భారత్ రానున్నారు. ఈ నేపథ్యంలో భారీ ఆయుధ ఒప్పందం రద్దు కావడం శోచనీయం. కానీ డీల్ రద్దు అయిన అంశంపై రాఫెల్ సంస్థ మరో ప్రటకన కూడా చేసింది. సుమారు రూ.460 కోట్లతో 131 బరాక్ మిస్సైళ్లను భారత్ కొనుగోలు చేయనున్నట్లు రాఫెల్ వెల్లడించింది. భారత్ మొదటిసారి నిర్మిస్తున్న భారీ యుద్ధ నౌక ద్వారా ఆ మిస్సైళ్లను వాడనున్నట్లు తెలుస్తున్నది. నెతన్యాహూ భారత్‌కు వస్తున్న తరుణంలో ఆ టీమ్‌లో రాఫెల్ సభ్యులు ఉంటారని కూడా సంస్థ పేర్కొన్నది.





అమెరికా నుంచి 5 లక్షల భారతీయులు వెనక్కి?

వాషింగ్టన్: అమెరికాలో ప్రతిపాదిత హెచ్1-బి వీసా నింబంధనల సవరణ బిల్లు గనుక అమల్లోకి వస్తే 5 లక్షల మంది భారతీయులు ఇంటిదారి పట్టాల్సి ఉంటుంది. అమెరికాలో శాశ్వత నివాసం కోసం గ్రీన్‌కార్డ్ పొందేందుకు ఎదురుచూసేవారికి ఇక మీదట పొడగింపు ఇవ్వకూడదని ట్రంప్ అడ్మినిస్ట్రేషన్ ప్రతిపాదించింది. 2016లో అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ ఇచ్చిన హామీ మేరకు హెచ్1బీ వీసా పొడగింపు ఇవ్వకూడదని.. అందుకు కొత్త నిబంధనలు తీసుకురావాలని డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌లాండ్ సెక్యూరిటీస్ పేర్కొంటోంది. ప్రస్తుత చట్టం ప్రకారం విదేశీ ఉద్యోగులు హెచ్-1బి వీసా పొందితే మూడేళ్ల కాలపరిమితితోపాటు మరో మూడేళ్ల పొడగింపు లభిస్తుంది. మొత్తం ఈ ఆరేళ్ల కాలంలో వారికి సంబంధించిన గ్రీన్‌కార్డ్ అప్లికేషన్ పెండింగ్‌లో ఉంటే అది పూర్తయ్యేవరకూ పొడగింపు లభిస్తుంది. అయితే ప్రతిపాదిత సవరణల ప్రకారం ఇప్పుడు అలాంటి అవకాశం లభించదు. గ్రీన్‌కార్డు పెండింగ్‌లో ఉన్నప్పుడు వీసాను పునరుద్ధరించకుండా చేయడం ఈ ప్రతిపాదన ఉద్దేశ్యం. ఈ కారణంగా అలాంటి వారు అమెరికాను వదిలివెళ్లాల్సి ఉంటుంది. ప్రస్తుతం హెచ్1-బి నిబంధనల్లో మార్పులు చేస్తే ఇతర దేశస్థుల కంటే భారతీయులే ఎక్కువగా నష్టపోతారని నిపుణులు అంటున్నారు.

లోక్‌సభలో ఒబిసి బిల్లు

చర్చ ముగియకుండానే సభ వాయిదా



న్యూఢిల్లీ: గత సమావేశంలో రాజ్యసభ ప్రతిపాదించిన సవరణలను తోసిపుచ్చుతూ కీలక ఒబిసి బిల్లును ప్రభుత్వం బుధవారం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. వెనుకబడిన తరగతులవారి సాధికారతకు ప్రభుత్వం కట్టుబడి ఉందని అధికారిక బిజెపి ఈ సందర్భంగా నొక్కి చెప్పింది. ఒబిసి కమిషన్‌కు రాజ్యాంగ హోదాను కట్టబెట్టాలని ఈ బిల్లు ప్రతిపాదిస్తోంది. గత రాజ్యసభ సమావేశంలో ప్రతిపక్షాలు సవరించి ఆమోదించిన ఈ బిల్లును ఇదివరకు లోక్‌సభలో ప్రవేశపెట్టిన తొలి రూపంలోనే తాజాగా మళ్లీ ప్రవేశపెట్టారు. అయితే రాజ్యాంగ(123వ సవరణ) బిల్లు 2017పై చర్చ జరుగుతున్నప్పుడు కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్‌కు, తృణమూల్ కాంగ్రెస్ సభ్యుడు కళ్యాణ్ బెనర్జీకి మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకోవడంతో స్పీకర్ సుమిత్రా మహాజన్ సభను గురువారానికి వాయిదా వేశారు. గుజరాత్ ఎన్నికల సమయంలో ఒబిసిలు వ్యతిరేకించిన ఈ బిల్లుపై ఇతర పార్టీల అభిప్రాయాలను, సూచనలను బిజెపి స్వీకరించడంలేదని బెనర్జీ చేసిన ఆరోపణను గిరిరాజ్ సింగ్ వ్యతిరేకించారు. బెనర్జీ తప్పుడు సమాచారాన్ని ఇస్తున్నారని ఓ బిజెపి సభ్యుడు నిందించారు. కాగా టిఎంసి సభ్యుడు తనను దూషించాడని గిరిరాజ్ సింగ్ ఆరోపించారు. అయితే ఆ ఆరోపణను బెనర్జీ తిరస్కరిస్తూ విపక్షాలను బెదిరిస్తున్నారని అన్నారు. దాంతో వాగ్వాదం తీవ్రంగా మారింది. విపక్షాలు చేసే మంచి సూచనలను ప్రభుత్వం స్వీకరించాలని కాంగ్రెస్ సభ్యుడు రాజీవ్ సాతవ్ అన్నారు. ఒబిసిలకు సంబంధించిన విషయాలను చూడడానికి ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఉండాలన్నారు. ఈ బిల్లు ఒబిసిలకు సాధికారతను కల్పిస్తుందన్నారు. ఒబిసిలోని వివిధ సముదాయాల జనాభా ఎంతుందో తెలియడానికి సెన్సెస్ డేటాను బహిర్గతం చేయాలని గణేశ్ సింగ్(బిజెపి) గెహ్లాట్‌ను కోరారు. ఒబిసి కోటా ఉన్నప్పటికీ అనేక ప్రభుత్వ సంస్థల్లో అది అమలు కావడంలేదని అందుకు ఉదాహరణ పాట్నాలోని ఎయిమ్స్ అన్నారు.

లోక్‌సభలో నవ్వులే నవ్వులు..

లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్‌కు కాంగ్రెస్ నాయకుడు మల్లికార్జున ఖర్గేకు మధ్య సాగిన హిందీ సంభాషణ సభలో సభ్యులను కడుపుబ్బ నవ్వించాయి. వివరాల్లోకి వెళితే....మహారాష్ట్రలోని కుల హింసాకాండ సమస్యపై మల్లికార్జున ఖర్గే మాట్లాడటానికి పూను కుని, తానిచ్చిన వాయిదా తీర్మానంను మహాజన్ తిరస్కరించారని అన్నారు. అయితే తన వాయిదా తీర్మానం అంగీకరించబడిందని (స్వీకార్ హోగయా) ఖర్గే అంటున్నారేమోనని స్పీకర్ భావించారు. దాంతో ఆయన 'స్వీకరించబడలేదు'(అస్వీకార్ హో గయా) అన్నారు. 'నాకు కూడా హిందీ కొంచెం కొంచెం తెలుసు' అని ఖర్గే అన్నప్పుడు సభ మొత్తం పకపకా నవ్వింది. దాంతో సుమిత్రా మహాజన్ 'నాకు వినపడ్డం కష్టంగా ఉంది, మీ గోల చాలా ఎక్కువగా ఉంది' అన్నారు. దానికి ఖర్గే 'మంచి డాక్టర్‌కు చూపెడతాం' అన్నారు. దానికి సభ మరోసారి పగలబడి నవ్వింది.

పెరూలో ఘోర బస్సు ప్రమాదం

- ట్రక్కును ఢీకొని కొండ ప్రాంతం నుంచి సముద్రపు అంచులో పడిన బస్సు
- ఘటనలో 48 మంది దుర్మరణం

లిమా : పెరూలో ఘోర బస్సు ప్రమాదం సంభవించింది. ప్రయాణికులతో వెళ్తున్న బస్సు ట్రక్కును ఢీకొని కొండ ప్రాంతంలో పడిపోయింది. ఈ ఘటనలో 48 మంది దుర్మరణం పాలయ్యారు. ఘటనాస్థలి అత్యంత ప్రమాదకరమైన కొండ అంచున ఇరుకైన రోడ్డు కావడంతో దానిని డెవిల్స్ మలుపు అను కూడా అంటారని అధికారులు తెలిపారు. మంగళవారం అర్ధరాత్రి 55 మంది ప్రయాణికులు, ఇద్దరు సిబ్బందితో బస్సు హౌచో నుంచి నుంచి వెళ్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. 100 మీటర్ల లోతు నుంచి కొండల మీదుగా సముద్రపు అంచున పడినట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనలో 48 మంది మరణించినట్లు అంతర్గత మంత్రిత్వశాఖ వెబ్‌సైట్ ఒక ప్రకటనను పోస్టు చేసింది. కొండల్లో పడిపోయిన బస్సు నుంచి మృతదేహాలను వెలికి తీసేందుకు సహాయక చర్యలు కొనసాగుతున్నాయని పోలీసులు వెల్లడించారు. సహాయక చర్యలు చేపట్టేందుకు సహాయ సిబ్బందిని పోలీస్ హెలికాప్టర్ ద్వారా ప్రమాదస్థలికి తరలిస్తున్నారు. ప్రతి ఒక్కరిని వెలికి తీయాలనే ఉద్దేశంతో నేవి కూడా సహాయకారులుగా సహాయంగా ఉండేలా ఒక పెట్రోల్ బోట్‌ను పంపింది. కాగా, క్షతగాత్రులైన ఐదుగురిని తమ ఆసుపత్రిలో చేర్చినట్లు ఎల్ చాలోలోని ఆలోసిడ్స్



క్రియన్ ఆసుపత్రి డైరెక్టర్ మారియ ఎలెన అగ్యులర్ చెప్పారు. అయితే ప్రాణాలతో బయటపడ్డ మరో వ్యక్తిని ఇంకో ఆసుపత్రిలో చేర్చారు.

విజయవాడలో రచయిత సైబాబాపై దాడి

హైదరాబాద్/మనతెలంగాణ : ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ నగరంలో బుధవారంనాడు 29వ పుస్తక ప్రదర్శన ప్రారంభమైంది. ఇక్కడ జరుగుతున్న పుస్తకావిష్కరణ కార్యక్రమానికి హాజరయ్యేందుకు వచ్చిన రచయిత సైబాబాపై కొంతమంది దుండగులు దాడి చేశారు. పుస్తకావిష్కరణ కార్యక్రమానికి తొలుత అనుమతినిచ్చిన బుక్ ఫెయిర్ నిర్వాహకులు ఈ ఘటన తర్వాత పోలీసులు ఉన్నప్పటికీ కార్యక్రమ అనుమతిని రద్దు చేశారు. సైబాబాపై దాడి ఘటనను 'సింగిడి-తెలంగాణ రచయితల సంఘం' తీవ్రంగా ఖండించింది.'తెలంగాణ ఉద్యమ సమయంలో ఆంధ్రపై విషంగక్కావని, అలాంటి నువ్వు ఈ గడ్డపై ఎలా అడుగుపెడతావు. ఇక్కడి నుంచి వెంటనే వెళ్లిపో' అంటూ కొంతమంది దుండగులు ఆయనపై దాడికి దిగారని,అంతేకాకుండా అక్కడి నుంచి ఆయనను బయటికి తరిమివేయడాన్ని తాము తీవ్రంగా గర్హిస్తున్నామని సింగిడి నిర్వాహకులు సంగిశెట్టి శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రెండు ప్రాంతాల నడుమ వైషమ్యాలను రెచ్చగొట్టే ఈ చర్య దురదృష్టకరమని, ఇటీవల ప్రపంచ తెలుగు మహాసభల్లో ప్రాంతాలకు అతీతంగా అనేకమంది ఆంధ్ర ప్రాంత రచయితలను గౌరవించామని గుర్తు చేశారు. సైబాబాపై దాడి ఘటనను ప్రజాస్వామిక వాదులు, రచయితలు ఖండించాలని కోరారు. ఈ ఘటనకు బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు ఇలాంటివి పునరావృతం కాకుండా ప్రభుత్వం వ్యవహరించాలని డిమాండ్ చేశారు. దాడికి పాల్పడిన వారు భేషరుతుగా క్షమాపణ చెప్పాలన్నారు.

విమానంలో కొట్టుకున్న పైలట్లు

న్యూఢిల్లీ : జెట్ ఎయిర్ వేస్ విమానంలో ఇద్దరు సీనియర్ పైలట్లు విమానం గాల్లో ఉండగానే ఒకరికొకరు గొడవ పడ్డారు. అంతటితో ఆగకుండా ఒకరి చెంపలు మరొకరు చెళ్లుమనిపించుకున్నారు. కాక్‌పీట్‌లోనే ఇదంతా జరిగింది. అయితే, ఎలాంటి ప్రమాదం జరగకుండానే చివరకు విమానాన్ని జాగ్రత్తగా కిందికి దించారు. ఈ సంఘటన జనవరి 1న లండన్-ముంబయి మధ్య నడిచే జెట్ ఎయిర్ వేస్ విమానంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. బోయింగ్ 777 విమానం 324మంది ప్రయాణీకులు, 14మంది సిబ్బందితో బ్రిటన్ కాలమానం ప్రకారం జనవరి1న ఉదయం పదిగంటలకు నూతన సంవత్సరం రోజే ముంబయికి బయలు దేరింది. మొత్తం తొమ్మిదిగంటలపాటు సాగే ఈ ప్రయాణం మధ్యలో విమానం టేకాఫ్ తీసుకున్న తర్వాత ఇద్దరు పైలట్లకు గొడవ అయింది. కాక్‌పీట్ కెప్టెన్ కోపైలట్‌ను చెంపచెల్లుమనిపించాడు. దీంతో ఆమె ఏడుస్తూ కాక్‌పీట్ నుంచి బయటకొచ్చింది. కిచెన్‌లోకి వెళ్లి బోరుమని ఏడ్వడం ప్రారంభించింది. అయితే, ఇతర సిబ్బంది ఆమెను ఓదార్చి తిరిగి కాక్‌పీట్‌లోకి పంపించారు. అప్పటికే కెప్టెన్ కూడా ఆమెను కాక్‌పీట్‌లోకి పంపించాలని సిబ్బందిని పదేపదే కోరినట్లు సమాచారం. అనంతరం కూడా వారిద్దరు తీవ్రంగా మరోసారి గొడవపడటం అసలు కాక్‌పీట్‌ను ఇద్దరు వదిలేయడం జరిగింది. దీంతో కోపైలెట్ మరోసారి అందులోకి వెళ్లేందుకు నిరాకరించగా ప్రయాణీకులను సురక్షితంగా చేర్చాలన్న సిబ్బంది వేడుకోలు మేరకు ఆమె అంగీకరించింది. ఎట్టకేలకు విమానాన్ని సురక్షితంగా ల్యాండ్ చేశారు. ఈ గొడవను జెట్ ఎయిర్ వేస్ అధికారులు కూడా ధ్రువీకరించారు.


8 నుంచి 12 వరకు సైన్స్ ఫెయిర్

మన తెలంగాణ/హైదరాబాద్ : పాఠశాల విద్యాశాఖ, బెంగుళూరుకు చెందిన విశ్వేశ్వరయ్య ఇండస్ట్రియల్ అండ్ టెక్నాలజికల్ మ్యూజియం(విఐటిఎం) సౌజన్యంతో ఈ నెల 8 నుంచి 12 వరకు సికింద్రాబాద్‌లోని సెయింట్ ప్యాట్రిక్స్ హైస్కూల్‌లో దక్షిణ భారత సైన్స్ ఫెయిన్(ఎస్ఐఎస్ఎఫ్) నిర్వహించనున్నట్లు పాఠశాల విదాశాఖ కమిషనర్ జి.కిషన్ తెలిపారు. ఈ ఫెయిన్‌లో ఆరు రాష్ట్రాలు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కేరళ, తమిళనాడు, కర్ణాటక, పుదుచ్చేరిల నుంచి ఎగ్జిబిట్స్‌ను ప్రదర్శిస్తారని పేర్కొన్నారు. ప్రతి రాష్ట్రం నుంచి 20 గ్రూప్ ఎగ్జిబిట్స్, 15 వ్యక్తిగత ఎగ్జిబిట్స్, 15 టీచర్ ఎగ్జిబిట్స్ ప్రదర్శిస్తారన్నారు. ప్రతి రాష్ట్రం నుంచి 50 ఎగ్జిబిట్స్ చొప్పున మొత్తం 300 ఎగ్జిబిట్స్ ప్రదర్శించనున్నట్లు తెలిపారు. పాఠశాల విద్యార్థులు సైన్స్ ఫెయిర్‌ను సందర్శించడానికి ఏర్పాట్లు చేశామని చెప్పారు. ఎస్ఐఎస్ఎఫ్‌ను సందర్శించాలనే ఆసక్తి గల పాఠశాలలు హైదరాబాద్ జిల్లా విద్యాధికారిని సంప్రదించాలని తెలిపారు.

రాయలసీమ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

పులివెందులలో సిఎం చంద్రబాబు

పులివెందుల: రాయలసీమ ప్రాంతాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. కడప జిల్లా పులివెందులలో నిర్వహించిన 'జన్మభూమి మా వూరు' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'సీమ ప్రాంతంలో నీరు చూడటం నా పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నా. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా పట్టిసీమ నుంచి నీరు తీసుకొచ్చాం. రాయలసీమను ఉద్యాన హబ్‌గా తీర్చిదిద్దే పనిలో ఉన్నాం. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాట్లు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. రాయలసీమలో అభివృద్ధి జరగాలంటే నాకు సహకరించండి. పులివెందులలో టిడిపిని గెలిపించకపోయినా అభివృద్ధికి నిధులు ఇస్తూనే ఉన్నాం. ఇక్కడ ముఠా



కక్షల వల్ల కంపెనీలు పెట్టేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. ప్రజలెవరైనా 1100 నంబరుకు ఫోన్ చేస్తే వారి సమస్యలు పరిష్కరిస్తున్నాం. ప్రతి కుటుంబం నెలకు రూ.10వేల ఆదాయం సాధించే విధంగా శ్రద్ధ పెట్టాం' అన్నారు.

జన్మభూమి గ్రామసభలో వివాదం

కడప జిల్లా పులివెందులలో బుధవారం నిర్వహించిన 'జన్మభూమి మా వూరు' గ్రామసభలో స్వల్ప వివాదం చోటుచేసుకుంది. సభకు హాజరైన వైసిపి ఎంపీ అవినాష్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్ హయాంలోనే అంతా అభివృద్ధి చేశారని చెప్పడంతో సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో రాజకీయాలు తగవని సున్నితంగా మందలించారు. టిడిపి నేతలు అవినాష్‌రెడ్డి చేతిలో ఉన్న మైక్ లాక్కునేందుకు ప్రయత్నించగా సీఎం వారించారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ కుప్పం కంటే పులివెందులకే ముందుగా నీరిచ్చామని గుర్తు చేశారు. రాయలసీమను రతనాలసీమగా మారుస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మంత్రులు దేవినేని ఉమామహేశ్వరరావు, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి,ఆదినారాయణరెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

ఉగ్రవాదంపై పాక్ ద్వంద్వ వైఖరి

వాషింగ్టన్: ఉగ్రవాద పోరులో పాకిస్థాన్ 'డబుల్ గేమ్' ఆడుతోందని అమెరికా తాజాగా వ్యాఖ్యానించింది. సంవత్సరాది సందేశంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పాకిస్థాన్‌పై ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తూ ట్వీట్ చేసిన నేపథ్యంలో అమెరికా తాజాగా ఈ వ్యాఖ్య చేసింది. పాకిస్థాన్‌కు ఆర్థిక సాయాన్ని ఆపేసే ట్రంప్ నిర్ణయాన్ని ఐక్యరాజ్యసమితికి అమెరికా రాయబారి అయిన నిక్కీ హేలీ సమర్థించారు. 'పాకిస్థానీయులు కొన్ని సందర్భాల్లో మాతో కలిసి పనిచేస్తారు, మరి కొన్ని సందర్భాల్లో అఫ్ఘానిస్తాన్‌లో మా దళాలపై దాడికి దిగే తాలిబన్లను పెంచిపోషిస్తుంటారు. ఇలాంటి డబుల్ గేమ్ ఇకపై కొనసాగనివ్వం' అని హేలీ స్పష్టం చేశారు. 'పాకిస్థాన్‌లో పనిచేస్తున్న హఖ్ఖానీ నెట్‌వర్క్, ఇతర తీవ్రవాదులపై పాకిస్థాన్ కఠిన చర్యలు తీసుకోవాలి' అని విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి హీథర్ నౌర్ట్ అన్నారు. ఉగ్రవాద పోరులో పాకిస్థాన్ మరింత కృషిచేయాల్సి ఉందని వైట్ హౌస్ అభిప్రాయపడింది.

అరుణాచల్‌ను గుర్తించలేదు : చైనా

బీజింగ్: అరుణాచల్‌ప్రదేశ్‌ను తామేనాడు గుర్తించలేదని చైనా బుధవారం చెప్పింది. అయితే అరుణాచల్‌ప్రదేశ్‌లోకి చైనా దళాలు చొరబడిన మీడియా నివేదికలపై మాత్రం చైనా నోరుమెదపలేదు. సియాంగ్ జిల్లాలోని ఎగువ గ్రామంలోకి 200 మీటర్ల మేర చైనా దళాలు చొచ్చుకు వచ్చాయన్న మీడియా వార్తల అనంతరం చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి జెంగ్ షువాంగ్ ప్రతిస్పందిస్తూ 'సరిహద్దు విషయంలో మా వైఖరి సుస్ప ష్టం. అరుణాచల్‌ప్రదేశ్‌ను మేమేనాడు గుర్తించలేదు' అన్నారు. భారత్‌కు చెందిన అరుణాచల్ ప్రదేశ్‌ను చైనా తమ దక్షిణ టిబెట్ అని వాదిస్తోంది. భారత, చైనాల మధ్య ఉన్న 3,488 కిమీ. వాస్తవిక నియంత్రణ రేఖపై రెండు దేశాల నడుమ సరిహద్దు వివాదం ఉంది. డోక్లామ్ ప్రాంతంలో ఏర్పడినట్లు మళ్లీ భారత, చైనాల మధ్య ప్రతిష్టంభనకు ఆస్కారం ఉందా? అని అడిగినప్పుడు 'ఆ ప్రతిష్టంభన గత ఏడాది జరిగింది. దాన్ని సజావుగా పరిష్కరించుకున్నాం' అని జెంగ్ షువాంగ్ సమాధానం ఇచ్చారు. న్యూఢిల్లీలో డిసెంబర్ 22న జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ చైనా భద్రతా సలహాదారు యాంగ్ జిచీ మధ్య 20వ రౌండ్ సరిహద్దు చర్చలు జరుగుతున్న సమయంలోనే చైనా దళాలు అరుణాచల్‌ప్రదేశ్‌లోకి చొరబడ్డాయి.అయితే భారత, చైనాసంబంధాల విషయంలో నిరంతరం కృషి చేయనున్నటుఇరు దేశాలు ప్రకటించాయి.భూటాన్‌కు చెందిన భూభాగంలో చైనా దళాలు రోడ్డు నిర్మించే చేపట్టడంతో జూన్16నుంచి డోక్లామ్ ప్రతిష్టంభన ఏర్పడింది.

ఢిల్లీలో మాల మహానాడు ధర్నా

మన తెలంగాణ/న్యూఢిల్లీ: ఎస్‌సి వర్గీకరణపై అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకవెళ్లాలనే ఆలోచనను సీఎం కేసీఆర్ విరమించుకోవాలని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య కోరారు. తెలంగాణ ప్రభుత్వ నిర్ణయాన్ని నిరసిస్తూ జంతర్ మంతర్‌లోని పార్లమెంట్ స్ట్రీట్‌లో బుధవారం నుండి మూడురోజుల పాటు మాల మహనాడు నేతలు ధర్నా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా చెన్నయ్య మాట్లాడుతూ అగ్రకులాల నాయకులు మాల, మాదిగల మధ్య గొడవ పెడుతున్నారని ఆరోపించారు. తెలంగాణలో ఎస్‌సి కార్పొరేషన్ చైర్మన్ మాదిగల కార్పొరేషన్ చైర్మన్‌లా వ్యవహరిస్తున్నాడని విమర్శించారు. తెలంగాణలో మాలలకు మంత్రి పదవులు లేవు, నామినేటడ్ పోస్టులు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. కెసిఆర్ మాలలను చిన్న చూపు చూస్తున్నారని, ఆ పార్టీకి మాలల ఓట్లు అవసరం లేదా అని ఈ సందర్భంగా ఆయన ప్రశ్నించారు. తెలంగాణ ప్రభుత్వం ఎస్‌సి వర్గీకరణ అపకపోతే, వచ్చే ఎన్నికలలో అన్ని జిల్లాల నుంచి మాలలు పోటి చేస్తారని ఆయన హెచ్చరించారు. అదేవిధంగా ఎస్‌సి వర్గీకరణ ఆపకపోతే దేశ వ్యాప్తంగా అందోళనలు చేపడతామని, పార్లమెంటులో బిల్లు పెట్టకుండా అడ్డుకుంటామని స్పష్టం చేశారు.

రూ. 117.74 కోట్ల ఆస్తులు అటాచ్

అమరావతి: వైసిపి అధినేత వైఎస్ జగన్ అక్రమాస్తుల కేసులో ఇడి అధికారులు బుధవారం రూ. 117.74 కోట్ల ఆస్తులను అటాచ్ చేశారు. గృహనిర్మాణ ప్రాజెక్టుల ఛార్జిషీట్‌లో ఆస్తులు అటాచ్ చేసింది. ఇడి అటాచ్ చేసిన వాటిలో శ్యామ్ ప్రసాద్‌రెడ్డి, ఇందూ ప్రాజెక్ట్స్, ఎంబిసి ప్రాపర్టీ డెవలప్‌మెంట్స్, వసంత ప్రాజెక్ట్స్ ఆస్తులు ఉన్నాయి.

దళితుల హక్కులు హరిస్తున్నారు



మన తెలంగాణ/ హైదరాబాద్/హిమాయత్‌నగర్: సావిత్రిబాయి పూలే 187వ జయంతిని పురస్కరించుకుని పూలే అంబేద్కర్ జాతర కమిటీ ఆధ్వర్యంలో స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావంతో కూడిన బహుజనుల రాజ్యాధికారమే లక్ష్యం గా బుధవారం లిబర్టీ వద్దగల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం నుండి పూలే అంబేద్కర్ జాతర యాత్రను ఎఐసిసి కార్యదర్శి వి.హన్మంతరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అంబేద్కర్, రాజ్యాంగానికి గౌరవం లేకుండా పోయిందని, అగ్రవర్ణాలు, బడుగు బలహీన వర్గాల ప్రజలను అణగదొక్కుతున్నాయని ఆరోపించారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దళితులపై దాడులు అధికమయ్యాయని విమర్శించారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ దళితుల హక్కులు హరించబడుతున్నయని, రాజ్యాంగం ప్రకారం ప్రజలు స్వేచ్ఛగా ఉండలేకపోతున్నరని అందోళన వ్యక్తం చేశారు. మహారాష్ట్రలో దళితులపై జరిగిన దాడులు దారుణమన్నారు. పూలే అంబేద్కర్ జాతరకు ఆయన సంఘీభావం తెలియజేశారు. ప్రజాగాయకుడు గద్దర్ మాట్లాడుతూ ఈ జా తర ద్వారా దళిత బహునులు చైతన్యమై, 2019 ఎన్నికల్లో రాజ్యాధికారాన్ని సాధింయచుకోవాలని, మా భూములు, ఉద్యోగాలు, అడవులు మాకే దక్కాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభంజన్ యాదవ్ మాట్లాడుతూ ఈ యాత్ర తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి ఏప్రిల్ మాసంలో నిజాం కళాశాల ప్రాంగణంలో భారీ బహిరంగ సభను నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు మల్లు రవి వివిధ సంఘాల నాయకులు జె.బి రాజు,నల్ల సూర్యప్రకాశ్,రాజు కె.యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలకు పరిష్కారం

మన తెలంగాణ/హైదరాబాద్: ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఎల్లవేళలా కృషి చేస్తుందని రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మం త్రి తలసాని శ్రీనివాస యాదవ్ అన్నారు. బుధవారం సచివాలయంలో పశుసంవర్ధక శాఖ అధికారుల నూతన డైరీ, క్యాలెండర్‌ను మం త్రి ఆవిష్కరించారు. రాష్ట్రం వచ్చాక పశుసంవర్ధక శాఖలో నూతన నియామకాలు, పదోన్నతులను చేపట్టిన విషయాన్ని మంత్రి గుర్తుచేశారు.రూ.5,000కోట్లతో గొర్రెల పంపి ణీ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతుందన్నారు.జీవాల వద్దకే వైద్యసేవలు అందించే ఉద్దేశంతోసంచార పశు వైద్యశాలలను ప్రారంభిస్తున్నామన్నారు. పశు సంవర్ధకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా సురేష్ చందా మంచి పనితీరును కనబరిచారని మంత్రి ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, అదనపు కార్యదర్శి రేణుకాదేవి, టిఎస్ఎల్‌డిఎ సిఇ వో తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా సావిత్రిభాయి పూలే జయంతి


మన తెలంగాణ/హైదరాబాద్ : మహాత్మాజ్యోతి రావు పూలే సతీమణి, భారతదేశపు తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిభా యి పూలే 187వ జయంతి వేడుకలు రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా జరిగాయి. బహుజన్ సమాజ్ పార్టీ, 'బామ్‌సెఫ్' (అఖిల భారత వెనకబడిన, మైనారిటీ తరగతుల ఉద్యోగుల సమాఖ్య)తదితర సంస్థల ఆధ్వర్యంలో సావిత్రిభాయి పూలే జయంతిని ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకున్నారు. పలు జిల్లాల్లో జరిగిన కార్యక్రమాల్లో మహిళా ఉపాధ్యాయులను ప్రత్యేకంగా సన్మానించారు.సావిత్రిభాయి పూలే జీవిత విశేషాలను తెలిపే కార్యక్రమాలను చేపట్టారు.అణగారిన వర్గాలు, మహిళలు విద్యావంతులయ్యేందుకు నాటి నిర్బంధ పరిస్థితులను సావిత్రిభాయి పూలే తన భర్త జ్యోతిరావు పూలేతో కలిసి ఎదుర్కొన్న తీరును వివిధ కార్యక్రమాల్లో వక్తలు వివరించారు. మనువాద ఆధిపత్యకుల అణచివేతను ఎదుర్కొన్న సావిత్రిభాయి పూలే జీవితం నేటి మహిళలకుఆదర్శప్రాయమన్నారు.మహిళా విద్య కోసం తొలి పాఠశాలను స్థాపించిన సావిత్రిభాయి పూలే జయంతిని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించాలని నాయకులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

హిందూవులదే భారత్

బిజెపి ఎంఎల్ఎ విక్రమ్ సైనీ

ముజఫర్‌నగర్: హిందుస్థాన్‌గా పేరున్న భారత్ హిందూవులదని యుపిలోని ఖతౌలి బిజెపి ఎంఎల్ఎ విక్రమ్ సైనీ పేర్కొన్నారు. గతంలో తాను చేసిన వ్యాఖ్యలు పాకిస్థాన్‌కు వ్యతిరేకమే తప్ప ముస్లింలకు కాదని స్పష్టం చేశారు. కొంత మంది బాధ్యతారాహిత్యమైన నాయకులు ముస్లింలను భారత్‌లో నివసించేందుకు అనుమతించారని సోమవారం ఆయన వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ముస్లింల కారణంగా హిందూవులు సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. దేశ విభజన సమయంలో పాకిస్థాన్‌కు వెళుతున్న ముస్లింలను ఆపి ఉండనట్లైతే కోట్లాది రూపాయల ఆస్తులు హిందూవులకుదక్కేవనిసైనీవ్యాఖ్యానించారు.

ఆలయంలో ఏం జరిగినా నాదే బాధ్యత : సూర్యకుమారి



విజయవాడ: ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మ సన్నిధిలో ఓ అజ్ఞాత వ్యక్తి తాంత్రిక పూజలు చేశారన్న ఆరోపణల నేపథ్యంలో ఆలయ ఈవో సూర్యకుమారి బుధవారం మీడియాతో మాట్లాడారు. 'డిసెంబరు 26న అర్ధరాత్రి ఆలయంలో శుద్ధి జరిగింది, పూజ జరగలేదు. ఆలయంలోకి వచ్చిన వారిలో పార్థసారధి తప్ప మిగిలినవారంతా పాతవారే. నాపై వచ్చిన ఆరోపణలపై ఉన్నతాధికారులు విచారణ జరుపు తున్నారు. పూజల కోసం పిలిచారని ప్రధాన అర్చకులు ఎక్కడా చెప్పలేదు. రోజు చేసే అలంకారం మాత్రమే చేశారు. ఆరోజు ఏం జరిగిందనేదానిపై ఎస్పీఎఫ్, మా సిబ్బంది, శానిటేషన్ సిబ్బందిని విచారిస్తున్నాం. అలంకారానికి సంబంధించిన సామగ్రి మాత్రమే లోపలికి తీసుకెళ్లారు. ఆలయంలో ఏం జరిగినా నైతికంగా నాదే బాధ్యత. ఎలాంటి విషయ మైనా ఆధారాలు లేకుండా మాట్లాడను. దుర్గగుడిలో వంద రకాల గ్రూపు లున్నాయి. ఆలయంలో జరిగే పనులపై గుత్తేదార్ల నుంచి ఒత్తిళ్లు వచ్చా యి. నా హయాంలో భక్తుల సంఖ్య, హుండీ ఆదాయం పెరిగింది. కేవలం కార్తీకమాసంలోనే గతం కంటే రూ.కోటి ఆదాయం పెరిగింది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణ యంపై నాకు సమాచారం లేదు. వాస్తవ విషయాలను మంత్రికి తెలి యజేశా. నన్ను లక్ష్యంగా చేసుకుని కొందరు ఎందుకు విమర్శలు చేస్తు న్నారో తెలియదు. పాలకమండలి సభ్యులతో అంతరం ఉన్నమాట వాస్త వం. అమ్మవారి ప్రతిష్ఠ ముఖ్యం, ఎవరైనా దిగజారి ఏ పని చేసినా పాప భీతిలేని చర్యే అవుతుంది'' అని ఈవో వెల్లడించారు.

దుర్గగుడి ఈవోపై చర్యలు తీసుకోవాలి

దుర్గగుడిలో తాంత్రిక పూజల వ్యవహారంపై పలువురు న్యాయవాదులు విజయవాడ ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఘటనకు సంబంధించి ఈవో సూర్యకుమారి, ప్రధాన అర్చకుడితో పాటు మరో ఐదుగురిని అరెస్ట్ చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆగమ శాస్త్రానికి, సంప్రదాయానికి విరుద్ధంగా ఆలయంలో అర్ధరాత్రి పూజలు చేసి హిందువుల మనోభావాలను దెబ్బతీశారని పేర్కొన్నారు.ఈ వ్యవహారానికి సంబంధించి ఈవోపై ప్రభుత్వం కఠినచర్యలు తీసుకోవాలని కోరారు.

టిప్పర్ బోల్తా పడి నలుగురు మృతి

ఆస్పరి: కర్నూలు జిల్లా ఆస్పరి సమీపంలోని రైల్వేగేట్ వద్ద బుధవారం ఉదయం టిప్పర్ బోల్తా పడిన ఘటనలో నలుగురు మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హొళగుంద మండలం కొత్తపేట గ్రామానికి చెందిన 18 మంది వలసకూలీలు పనుల నిమిత్తం నల్గొండకు వెళ్లారు. బుధవారం వారు పనులు ముగించుకొని టిప్పర్‌లో ఇంటికి బయలుదేరారు. ఈ నేపథ్యంలో కర్నూలు జిల్లా ఆస్పరి సమీపంలోని రైల్వేగేట్ వద్దకు రాగానే వెనుక టైరు పేలడంతో టిప్పర్ అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో షేకమ్మ(45), నర్సమ్మ(46) అక్కడికక్కడే మృతిచెందగా, గోవిందమ్మ(55), హనుమంతమ్మ(16) ఆదోని ఆస్పత్రికి తరలిస్తుండగా ప్రాణాలు విడిచారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన 14మందిని ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి, పరిస్థితి విషమంగా ఉన్న మరో 9మందిని కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఆస్పరి ఎస్ఐ శంకరయ్య, ఆలూరు సీఐ గౌస్ సంఘటనా స్థలానికి చేరుకొని సహాయచర్యలు చేపట్టారు.



మెరుగైన ఆటను కనబరుస్తా: మురళీ విజయ్



కేప్‌టౌన్: సౌతాఫ్రికాతో జరిగే టెస్టు సిరీస్‌లో సత్తా చాటేందుకు సిద్ధంగా ఉన్నానని టీమిండియా స్టార్ ఓపెనర్ మురళీవిజయ్ అన్నాడు. బౌన్సీ పిచ్‌లపై ఓపెనింగ్ చేయడం కష్టంతో కూడుకున్న అంశమేనని, అయితే తాను మాత్రం సౌతాఫ్రికా బౌలర్ల సవాలును స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశాడు. ఈ సిరీస్ కోసం జట్టులోని ప్రతి ఆటగాడు ఎంతో ఆసక్తితో ఎదురు చూస్తున్నాడని తెలిపాడు. ప్రతి ఒక్కరు తమ సామర్థ్యం మేరకు రాణించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారని విజయ్ వివరించాడు. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో తమ జట్టు సమతూకంగా ఉందన్నాడు. ఓపెనర్‌గా తనవంతు పాత్రం పోషించేందుకు కృషి చేస్తానని తెలిపాడు. రాహుల్‌తో, ధావన్‌తో ఇన్నింగ్స్ ప్రారంభించేందుకు తాను సిద్ధమేనని, ఇద్దరు కూడా మెరుగైన ఓపెనర్లేనని స్పష్టం చేశాడు. కాగా, ఓపెనర్ల స్థానం కోసం తమ మధ్య ముక్కోణపు పోటీ నెలకొన్న విషయం వాస్తవమేనన్నాడు. అయితే ముగ్గురిలో ఎవరూ ఓపెనర్లుగా దిగిన తమకు అభ్యంతరం లేదన్నాడు. కాగా, క్లిష్టమైన సిరీస్‌లో విజయం సాధిస్తే జట్టు ఆత్మవిశ్వాసం రెట్టింపు కావడం ఖాయమని విజయ్ ధీమా వ్యక్తం చేశాడు.

సఫారీ సిరీస్‌పై సర్వత్రా ఆసక్తి!

కేప్‌టౌన్: భారత్, దక్షిణాఫ్రికా జట్ల మధ్య జరుగనున్న మూడు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌పై ప్రపంచ వ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. క్రికెట్ ఆడే అన్ని దేశాలు ఈ సిరీస్‌పై ప్రత్యేక దృష్టి సారించాయి. కిందటి ఏడాది ప్రపంచ క్రికెట్‌లో ఎదురులేని శక్తిగా హవా కొనసాగించిన టీమిండియాకు సౌరీ గడ్డపై జరిగే సిరీస్ సవాలుగా మారింది. ప్రపంచ టెస్టు ర్యాంకింగ్స్‌లో నంబర్‌వన్‌గా ఉన్న విరాట్ కోహ్లి సేన ఈ సిరీస్‌లో ఎలా ఆడుతుందనే దానిపై అందరిలోనూ ఉత్కంఠ నెలకొంది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో భారత్ సమతూకంగా కనిపిస్తోంది. ప్రపంచంలోనే అత్యుత్తమ బ్యాటింగ్, బౌలింగ్ లైనప్ టీమిండియాకు అందుబాటులో ఉంది. ఒంటిచేత్తో మ్యాచ్ ఫలితాన్ని తారుమారు చేయగలిగే బ్యాటర్లు, బౌలర్లు జట్టులో ఉన్నారు. దీంతో ఈ సిరీస్‌లో భారత్‌కు మెరుగైన అవకాశాలున్నాయని చాలా మంది విశ్లేషిస్తున్నారు. భారత్ కూడా దక్షిణాఫ్రికా గడ్డపై తొలి సిరీస్‌ను దక్కించుకోవాలనే పట్టుదలతో ఉంది. కిందటి సీజన్‌లో భారత్ ఒక్క సిరీస్‌ను కూడా కోల్పోలేదు. అంతేగాక మూడు ఫార్మాట్‌లలో కలిపి 37 మ్యాచుల్లో విజయాలను సొంతం చేసుకుంది. విరాట్ కోహ్లి, మురళీ విజయ్, చటేశ్వర్ పుజారా, రాహుల్, ధావన్, రోహిత్ శర్మ, రహానె తదితరులు నిలకడైన బ్యాటింగ్ భారత్ విజయాల్లో కీలకపాత్ర పోషించారు. కాగా, శ్రీలంకతో సొంతగడ్డపై ఘోరంగా విఫలమైన రహానె దక్షిణాఫ్రికాలో సత్తా చాటేందుకు తహతహలాడుతున్నాడు. అతను చెలరేగితే భారత్ అవకాశాలు మరింత మెరుగవుతాయి. ఇక, కిందటి సీజన్‌లో వరుస డబుల్ సెంచరీలతో ప్రకంపనలు సృష్టించి కెప్టెన్ కోహ్లి ఈసారి కూడా అదే జోరును కొనసాగించేందుకు తహతహలాడుతున్నాడు. విజయ్ కూడా శ్రీలంక సిరీస్ ద్వారా మళ్లీ ఫాంలోకి వచ్చాడు. అతను కూడా సఫారీపై చెలరేగేందుకు సిద్ధంగా ఉన్నాడు. ధావన్ కూడా జోరుమీదున్నాడు. అతను గాయం నుంచి కోలుకుని తొలి టెస్టులో ఆడేందుకు సిద్ధమయ్యాడు. రాహుల్ కూడా అవకాశం దొరికితే సత్తా చాటాలనే పట్టుదలతో ఉన్నాడు. ఇక, పుజారా రూపంలో భారత్‌కు పదునైన అస్త్రం ఉండనే ఉంది. నిలకడైన బ్యాటింగ్‌కు మరో పేరుగా అతన్ని చెప్పుకోవచ్చు. అతనిపై జట్టుకు భారీ ఆశలే ఉన్నాయి. ఇక రహానె, రోహిత్, హార్దిక్, అశ్విన్, సాహ తదితరులతో భారత బ్యాటింగ్ చాలా బలంగా ఉంది. అంతేగాక, ఉమేశ్ యాదవ్, మహ్మద్ షమి, ఇషాంత్ శర్మ, భువనేశ్వర్ కుమార్, బుమ్రా, పాండ్యలతో కూడిన ఫాస్ట్ బౌలింగ్ లైనప్ దక్షిణాఫ్రికా బ్యాట్స్‌మెన్‌కు ఇబ్బందులు సృష్టించడం ఖాయం. అశ్విన్, జడేజాల రూపంలో ప్రపంచ స్థాయి స్పిన్నర్లు కూడా ఉండనే ఉన్నారు. ఈ పరిస్థితుల్లో భారత్‌ను ఎదుర్కొవడం దక్షిణాఫ్రికా కష్టమేనని చాలా మంది పేర్కొంటున్నారు. రెండు జట్లలోనూ ప్రతిభావంతులకు కొదవలేదు. అయితే గతంతో పోల్చితే సౌతాఫ్రికా కాస్త బలహీనంగా మారింది. అదే సమయంలో భారత్ చాల బలంగా తయారైంది. దీంతో సిరీస్‌లో భారత్ ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. ఇరు జట్ల మధ్య టెస్టు సమరానికి శుక్రవారం తెరలేవనుంది.



ధావన్ ఫిట్...

టీమిండియా స్టార్ ఓపెనర్ శిఖర్ ధావన్ గాయం నుంచి పూర్తిగా కోలుకున్నాడు. ధావన్ బుధవారం ముమ్మర సాధన చేశాడు. దీనికి సంబంధించిన ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. చీలమండల గాయంతో బాధపడుతున్న ధావన్ ప్రస్తుతం పూర్తి ఫిట్‌నెస్ సాధించాడని తెలిసింది. అతను తొలి టెస్టులో ఆడడం ఖాయమని వార్తలు కూడా వినిపిస్తున్నాయి. ఇది భారత్‌కు నిజంగా ఊరట కలిగించే అంశమే. మంచి ఓపెనర్‌గా పేరుతెచ్చుకున్న ధావన్ బరిలోకి దిగితే భారత బ్యాటింగ్ మరింత పటిష్టంగా మారడం ఖాయం. మురళీవిజయ్‌తో కలిసి అతను ఇన్నింగ్స్‌ను ప్రారంభించే అవకాశాలున్నాయి. ఇదే జరిగితే లోకేష్ రాహుల్ పెవిలియన్‌కే పరిమితం కాక తప్పదు. ధావన్ నెట్స్‌లో చాలా సేపు సాధన చేసినట్టు జాతీయ మీడియాలో కథనాలు వచ్చాయి. దీంతో అతను గాయం నుంచి కోలుకున్నట్టేనని స్పష్టమవుతోంది. అంతకుముందు తొలి టెస్టుకు ధావన్ దూరమయ్యాడనే వార్తలు వచ్చిన విషయం తెలిసిందే.



సాధనే.. సాధన..

తొలి టెస్టు ప్రారంభానికి సమయం సమీపించడంతో టీమిండియా తన సాధనను ముమ్మరం చేసింది. బుధవారం కూడా భారత క్రికెటర్లు కఠోర సాధన చేశారు. భారత్, దక్షిణాఫ్రికా జట్ల మధ్య మూడు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ శుక్రవారం ప్రారంభం కానుంది. ఈ సిరీస్‌ను టీమిండియా చాలా ప్రతిష్టాత్మకంగా తీసుకొంది. సౌతాఫ్రికా గడ్డపై తమకున్న పేలవమైన రికార్డు చెరిపేయాలనే ఉద్దేశంతో కోహ్లి సేన సమరానికి సిద్ధమవుతోంది. రెండు దశాబ్దాలకు పైగా సుదీర్ఘ ప్రస్థానంలో భారత్ ఒక్కసారి కూడా సౌతాఫ్రికాలో సిరీస్ నెగ్గలేదు. కానీ, ఈసారి ఈ సంప్రదాయాన్ని తిరగేయాలని తహతహలాడుతోంది. ఇందు కోసం ప్రతి ఆటగాడు తనవంతు పాత్ర పోషించేందుకు సిద్ధమయ్యాడు. తొలి రెండు రోజులు వర్షం వల్ల ప్రాక్టీస్‌కు అంతరాయం కలిగింది. అయితే భారత క్రికెటర్లు ఇండోర్ స్టేడియంలో సాధన చేశారు. అయితే వర్షం తగ్గి మాములు పరిస్థితులు ఏర్పడడంతో భారత ఆటగాళ్లు కేప్‌టౌన్ ప్రధాన స్టేడియంలో ముమ్మర సాధన చేస్తున్నారు. కెప్టెన్ విరాట్ కోహ్లి, ప్రధాన్ కోచ్ రవిశాస్త్రి, అతని సహచర బృందం పర్యవేక్షణలో ఆటగాళ్లు ప్రాక్టీస్‌లో నిమగ్నమయ్యారు. బుధవారం భారత ఆటగాళ్లు ఫీల్డింగ్‌పై దృష్టి పెట్టారు. కెప్టెన్ కోహ్లితో సహా చాలా మంది ఫీల్డింగ్ సాధన చేశారు. మరికొంత మంది నెట్స్‌లో బ్యాటింగ్ ప్రాక్టీస్ చేశారు. బౌలర్లు కూడా తీవ్రంగా శ్రమించారు. గురువారం కూడా భారత క్రికెటర్లు కఠోర సాధన చేయాలనే ఉద్దేశంతో ఉన్నారు. ఒక్క ప్రాక్టీస్ మ్యాచ్ లేకుండానే భారత్ టెస్టు సిరీస్ బరిలోకి దిగుతోంది. దీంతో ఇక్కడి పరిస్థితులకు అలవాటు పడేందుకు ప్రాక్టీస్‌నే ఆయుధంగా మార్చుకుంది.



విరుష్క షికారు..

మరోవైపు కొత్త దంపతులు విరుష్కలు షాపింగ్, షికార్లతో సందడి చేస్తున్నారు. ఒకవైపు ప్రాక్టీస్ సెషన్‌లో పాల్గొంటూనే అది ముగిసిన వెంటనే తన భార్య అనుష్కతో కలిసి విరాట్ విందు, విహారాల్లో మునిగి పోతున్నాడు. కేప్‌టౌన్ నగరంతో పాటు చుట్టుప్రక్కల గల పర్యాటక క్షేత్రాలను ఈ జంట చుట్టి వస్తోంది. ఒకవైపు షాపింగ్ చేస్తూనే తమకు ఇష్టమైన భోజనాలు చేస్తూ సరదగా గడుపుతున్నారు. అంతేగాక అందరిని ఆశ్చర్యానికి గురిచేస్తున్న రోడ్డు పక్కన ఉన్న షాప్‌లలో కూడా విరుష్క జంట షాపింగ్ చేస్తూ హల్‌చల్ చేస్తోంది. ఈ సందర్భంగా వీరితో సెల్ఫీలు దిగేందుకు అభిమానులు, స్థానిక వ్యాపారులు ఎంతో ఆసక్తి కనబరుస్తున్నారు.



మన్రో ప్రపంచ రికార్డు

- అంతర్జాతీయ టి20లో మూడో శతకం
- కివీస్ చేతిలో విండీస్ చిత్తు

మౌంట్ ముంగనుయ్: న్యూజిలాండ్ విధ్వంసక బ్యాట్స్‌మన్ కొలిన్ మన్రో అంతర్జాతీయ ట్వంటీ–20లో మూడో సెంచరీ సాధించి కొత్త ప్రపంచ రికార్డును తన పేరిట లిఖించుకున్నాడు. బుధవారం విండీస్‌తో జరిగిన మూడో టి–20 మ్యాచ్‌లో మన్రో 53 బంతుల్లోనే పది సిక్సర్లు, మరో మూడు ఫోర్లతో 104 పరుగులు చేసి తన ఖాతాలో మూడో శతకాన్ని జమచేసుకున్నాడు. ఈ క్రమంలో అంతర్జాతీయ టి–20లో మూడు సెంచరీలు సాధించిన తొలి క్రికెటర్‌గా చరిత్ర సృష్టించాడు. మన్రో చెలరేగి ఆడడంతో ముందుగా బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 20 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 243 పరుగులు చేసింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన విండీస్ కివీస్ బౌలర్ల ధాటికి తట్టుకోలేక కేవలం 124 పరుగులకే కుప్పకూలింది. సౌథి, బౌల్ట్, సోధి అద్భుత బౌలింగ్‌తో విండీస్ బ్యాటింగ్ లైనప్‌ను కుప్పకూల్చారు. విండీస్ జట్టులో ఫ్లెచర్ (46) ఒక్కడే ఒంటరి పోరాటం చేశాడు. విధ్వంసక ఆటగాడు గేల్ ఖాతా తెరవకుండానే పెవిలియన్ చేరాడు. మరో ఓపెనర్ వాల్టన్ కూడా తక్కువ స్కోరుకే పెవిలియన్ చేరాడు. దీంతో విండీస్ మళ్లీ కోలుకోలేక పోయింది. అంతకుముందు గుప్టిల్, మన్రో కివీస్‌కు శుభారంభం అందించారు. మార్టిన్ గుప్టిల్‌తో కలిసి తొలి వికెట్‌కు 136 పరుగులు జోడించాడు. కీలక ఇన్నింగ్స్ ఆడిన గుప్టిల్ 63 పరుగులు చేసి ఔటయ్యాడు. మరోవైపు విధ్వంసక ఇన్నింగ్స్ ఆడిన మన్రో పది సిక్సర్లు, మరో మూడు ఫోర్లతో 104 పరుగులు చేసి ఇన్నింగ్స్ చివరి ఓవర్‌లో పెవిలియన్ చేరాడు. ఈ మ్యాచ్‌లో గెలిచిన కివీస్ 2–0తో సిరీస్ కైవసం చేసుకుంది. తొలి మ్యాచ్‌లో కివీస్ విజయం సాధించగా రెండో టి–20 వర్షం వల్ల రద్దయ్యింది. మన్రోకు మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్, మ్యాన్ ఆఫ్‌ది సిరీస్ అవార్డులు దక్కాయి. ఈ విజయంతో కివీస్ టి–20 ర్యాంకింగ్స్‌లో మళ్లీ టాప్ ర్యాంక్‌కు దూసుకెళ్లింది. పాకిస్థాన్ రెండో, భారత్ మూడో ర్యాంక్‌లో నిలిచాయి.




సమష్టిగా పోరాడండి

- మాస్టర్ సచిన్ టెండుల్కర్

ముంబయి: దక్షిణాఫ్రికా సిరీస్‌లో భారత్ సిరీస్ సాధించే అవకాశాలు అధికంగా ఉన్నాయని టీమిండియా మాజీ దిగ్గజం, మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండుల్కర్ జోస్యం చెప్పాడు. గతానికి భిన్నంగా ఈసారి భారత్ సిరీస్‌తో తిరిగివస్తుందనే నమ్మకం తనకుందన్నాడు. గతంతో పోల్చితే భారత్ ప్రస్తుతం చాలా బలంగా ఉందన్నాడు. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో కోహ్లి సేన చాలా పటిష్టంగా మారిందన్నాడు. ఇంత పటిష్టమైన భారత జట్టును తాను ఇప్పటి వరకు చూడలేదన్నాడు. రెండు విభాగాల్లోనూ జట్టు సమతూకంగా ఉందన్నాడు. హార్దిక్ పాండ్య రూపంలో విరాట్‌కు పదునైన అస్త్రం లభించిందన్నాడు. ఇక, కోహ్లి సారథ్యం జట్టుకు అదనపు వరమన్నాడు. పుజారా, ధావన్, రహానె, విజయ్‌లతో భారత బ్యాటింగ్ చాలా బలంగా ఉందన్నాడు. ఈ పరిస్థితుల్లో టీమిండియా సిరీస్ గెలుచుకోవడం ఖాయమన్నాడు. కానీ, దీని కోసం ఏ ఒక్కరో రాణిస్తే సరిపోదన్నాడు. సమష్టిగా పోరాడితే ఫలితాన్ని సాధించే అవకాశాలుంటాయన్నాడు. బ్యాటింగ్‌లో కోహ్లిపై ఒత్తిడి లేకుండా చూడాల్సిన బాధ్యత ఓపెనర్లపై ఉందన్నాడు. ఓపెనర్లు అందించే శుభారంభం జట్టుకు చాలా కలిసివచ్చే అంశమన్నాడు.

తొలి రోజే కీలకం...

సిరీస్‌లో ఏ జట్టయితే తొలి రోజు ప్రారంభంలో పైచేయి సాధిస్తుందో వారికే విజయవకాశాలు అధికంగా ఉంటాయని సచిన్ తేల్చి చెప్పాడు. ఇరు జట్లకు కూడా తొలి సెషన్ చాలా కీలకమన్నాడు. ఇందులో ఎవరు ఆధిపత్యం చెలాయిస్తే సిరీస్ ముగిసే వారకు అదే జోరును కొనసాగించడం ఖాయమన్నాడు. ఇది వినడానికి వింతగా ఉన్నా ఇదే నిజమన్నాడు. గతంలో ఇక్కడ జరిగిన చాలా సిరీస్‌లలో ఇటువంటి పరిస్థితులు నెలకొన్నాయని సచిన్ వివరించాడు. ముందుబా బ్యాటింగ్ చేస్తే తొలి సెషన్‌లో వికెట్లను కాపాడుకోవాలని, ఒక వేళ బౌలింగ్ ఎంచుకుంటనే కనీసం మూడు, నాలుగు వికెట్లయిన తన ఖాతాలో వేసుకోవాలని సచిన్ భారత కెప్టెన్‌కు సూచించాడు. అలా చేసినప్పుడే ప్రత్యర్థి జట్టును ఒత్తిడిలోకి నెట్టే అవకాశాలు మెరుగుపడతాయన్నాడు.



హార్దిక్ ఓ వరం...

హార్దిక్ పాండ్య టీమిండియాకు వరం వంటివాడని సచిన్ అభిప్రాయపడ్డాడు. విధ్వంసక బ్యాటింగ్, నిలకడైన బౌలింగ్, కళ్లు చెదిరే ఫీల్డింగ్‌తో హార్దిక్ జట్టులో స్థానాన్ని సుస్థిరం చేసుకున్నాడని సచిన్ ప్రశంసించాడు. కపిల్‌దేవ్ తర్వాత అంతటి ఆల్‌రౌండర్ లక్షణాలు ఒక్క పాండ్యలోనే ఉన్నాయని చెప్పడంలో అతిశయోక్తి లేదన్నాడు. కీలక సమయంలో ధాటిగా బ్యాటింగ్ చేసే సత్తా పాండ్యకు ఉందన్నాడు. అంతేగాక ఒక రోజులో కనీసం 20 ఓవర్లు సునాయాసంగా వేసే సత్తా హార్దిక్ సొంతమన్నాడు. ఇటువంటి ఆల్‌రౌండర్ దొరకడం కోహ్లి అదృష్టమన్నాడు. స్వల్ప కాలంలోనే హార్దిక్ జట్టుపై తనదైన ముద్ర వేశాడని పేర్కొన్నాడు. రానున్న రోజుల్లో పాండ్య మరింత మెరుగైన ప్రదర్శన కనబరచడం ఖాయమని సచిన్ జోస్యం చెప్పాడు.

వారిద్దరి నుంచే ప్రమాదం..

సిరీస్‌లో భారత్‌కు ఇద్దరి నుంచే ఎక్కువ ప్రమాదం పొంచి ఉందని సచిన్ అన్నాడు. డాషింగ్ ఆటగాళ్లు హాషిం ఆమ్లా, డివిలియర్స్ నుంచి భారత బౌలర్లకు పెను సవాలు ఎదురయ్యే అవకాశాలను కొట్టి పారేయలేమన్నాడు. ఇటీవల కాలంలో ఆమ్లా ఆకాశమే హద్దుగా చెలరేగి పోతున్నాడన్నాడు. ఇక, సొంత గడ్డపై అతను మరింత ప్రమాదకర బ్యాట్స్‌మన్ అనడంలో సందేహం లేదన్నాడు. అతన్ని సాధ్యమైనంత త్వరగా పెవిలియన్ పంపించేందుకు భారత్ ప్రయత్నించాలని సూచించాడు. ఇక, డివిలియర్స్‌తో ఏ జట్టుకైన సదా ప్రమాదం పొంచే ఉంటుందన్నాడు. అది స్వదేశి అయినా విదేశి సిరీస్ అయినా ఒకటేనన్నాడు. డివిలియర్స్ చెలరేగితే అడ్డుకోవడం ఎంతటి బౌలర్‌కైనా తలకుమించిన భారమేనన్నాడు. భారత బౌలర్లు ఈ ఇద్దరిని త్వరగా ఔట్ చేయడంపై దృష్టి పెడితే బాగుంటుందని సచిన్ వివరించాడు. ఇక డికాక్, ఎల్గర్, కెప్టెన్ డుప్లెసిస్‌లనూ తక్కువ అంచన వేయలేమన్నాడు. అయితే సమష్టిగా పోరాడితే దక్షిణాఫ్రికాను ఓడించడం భారత్‌కు పెద్ద కష్టమేమి కాదని సచిన్ పేర్కొన్నాడు. దక్షిణాఫ్రికాతో సిరీస్ నేపథ్యంలో ఓ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో సచిన్ తన సలహాలు, సూచనలు కోహ్లి సేనకు ఇచ్చాడు.

కర్నాటక, పంజాబ్ జట్ల ముందంజ

- జాతీయ సీనియర్ కబడ్డీ పోటీలు

మన తెలంగాణ/ హైదరాబాద్: జాతీయ సీనియర్ కబడ్డీ పోటీల్లో కర్నాటక, ఉత్తరాఖండ్ జట్లు క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నాయి. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న మహిళా, పురుషుల సీనియర్ పోటీల్లో తెలుగు రాష్ట్రాల పోరాటం ముగిసింది. పురుషుల, మహిళల విభాగంలో ఆంధ్రప్రదేశ్ జట్లు ప్రిక్వార్టర్ ఫైనల్లోనే ఇంటిదారి పట్టాయి. మరోవైపు పురుషుల విభాగంలో కర్నాటక, ఉత్తరాఖండ్ జట్లు క్వార్టర్ ఫైనల్ బెర్త్‌ను దక్కించుకున్నాయి. బుధవారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో కర్నాటక 37–27 తేడాతో తమిళనాడును ఓడించింది. మరో పోటీలో ఉత్తరాఖండ్ 52–31 తేడాతో ఆంధ్రప్రదేశ్‌ను ఓడించి క్వార్టర్ ఫైనల్లో ప్రవేశించింది. మహిళల విభాగంలో రైల్వేస్ జట్లు సెమీఫైనల్‌కు చేరుకుంది. బుధవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో రైల్వేస్ 39–25 తేడాతో ఉత్తరప్రదేశ్ జట్టును చిత్తు చేసి సెమీస్ బెర్త్‌ను దక్కించుకుంది. మరోవైపు పంజాబ్, హర్యానా, మహారాష్ట్ర, కేరళ జట్లు క్వార్టర్ ఫైనల్లో ప్రవేశించాయి. ఆంధ్రప్రదేశ్ జట్టు ప్రిక్వార్టర్ ఫైనల్లోనే ఇంటిముఖం పట్టింది. కేరళ మహిళా జట్టు 31–21 తేడాతో ఆంధ్రను చిత్తు చేసింది. పంజాబ్ 33–19 బిహార్‌ను, హిమాచల్‌ప్రదేశ్ 24–21తో తమిళనాడు జట్టును ఓడించి క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నాయి.





తెలంగాణకు పతకాల పంట



మన తెలంగాణ/ హైదరాబాద్: మహారాష్ట్రలో జరిగిన జాతీయ స్థాయి జూనియర్ తైక్వాండో పోటీల్లో తెలంగాణ క్రీడాకారులు పతకాల పంట పండించారు. బాలికల 63 కిలోల విభాగంలో తెలంగాణకు చెందిన మసీరా సారఖాన్ పసిడి పతకం గెలుచుకుంది. ఈ క్రమంలో మసీరా అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనే భారత తైక్వాండో జట్టులో చోటు సంపాదించింది. మరోవైపు రాష్ట్రానికే చెందిన నందిశ్వర్, హన్సిక సింగ్, మిహాన్సు తదితరులు జాతీయ జూనియర్ తైక్వాండోలో రజత పతకాలు గెలుచుకున్నారు. శివ్‌క్రిష్, నైనా, రమ్య, త్రిలక్, అజిత్, సంతోష్‌లకు కాంస్య పతకాలు లభించాయి. కాగా, పతకాలు సాధించిన క్రీడాకారులను బుధవారం శాట్స్ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా స్వర్ణ పతక విజేత మసీరాను సత్కరించారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలు గెలవాలని ఆకాంక్షించారు.

Printed and published by K Sreenivas Reddy, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037, R.R.Dist., TELANGANA and Published from H.No.12-1-493/VA, Giriprasad Bhavan,Opp:Rajiv Swagruha Offices Complex, Bandlaguda Main Road, Nagole, R.R. Dist. and owned by M/s. Moveon Media Private Limited, **Editor: K. Sreenivas Reddy,** RNI Regn. No.TELTEL/2012/42234, Phone No/Fax:040-27655666, e-mail : editor@manatelangana.org.